thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. NO. TEL TEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

సాయంకాల దినపత్రిక

Published from Karimnagar, Hyderabad, Adilabad, Warangal

సంపుటి - 20 సంచిక - 212 | కరీంనగర్ గురువారం, 9 అక్టోబర్ 2025 ఎడిటర్ - మొహ్మద్ ఇమ్రాన్ | పేజీలు - 12 + 8 జిల్లా అనుబంధం వెల - 1.00

## ఆరో తరం ఫైటర్ జెట్‌పై భారత్ దృష్టి

న్యూఢిల్లీ : అత్యాధునిక ఆరో తరం ఫైటర్ జెట్‌ల అభివృద్ధిపై భారత్ దృష్టి సారించింది. ఇందుకు సంబంధించి యునైటెడ్ కింగ్‌డమ్(యూకే), జపాన్, ఇటలీ సంయుక్తంగా నిర్వహిస్తున్న గ్లోబల్ కాంబాట్ ఎయిర్ ప్రోగ్రామ్ (జీసీఏపీ) ప్రాజెక్టులో చేరేందుకు భారత్ ఆసక్తి చూపిస్తోంది. కానీ, రక్షణ రంగంలో భారత్, రష్యా మధ్య ఉన్న బలమైన బంధం నేపథ్యంలో జీసీఏపీలో భారత్‌ను చేర్చుకునే అంశంలో జపాన్ ఓ నిర్ణయానికి రాలేకపోతోంది. జపాన్ మీడియాలో ఈ మేరకు కథనాలు వెలువడ్డాయి. ఆరో తరం ఫైటర్ జెట్‌లను కలిసి అభివృద్ధి చేసేందుకు యూకే, జపాన్, ఇటలీ.. 2022 డిసెంబరులో జీసీఏపీ ప్రాజెక్టును చేపట్టాయి. 2035 నాటికి అత్యాధునిక ఫైటర్ జెట్‌ను అందుబాటులోకి తీసుకురావాలనేది లక్ష్యం.

# పంతం నీదా... నాదా... సై!

# మోడీ వర్సెస్ రాహుల్

## ప్రత్యక్ష పోరులో గెలుపెవరిది?!





## రసవత్తరంగా మారిన బీహార్ రాజకీయాలు!!

ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ.. కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో విపక్ష నాయకుడు రాహుల్‌గాంధీకి మధ్య ప్రత్యక్ష ఎన్నికల సమరానికి బీహార్ వేదిక అయింది. ఎన్నికల సమయానికి మూడు మాసాల ముందే.. ఇద్దరూ బీహార్ వేదికగా.. అనేక సవాళ్లు-ప్రతి సవాళ్లు రువ్వుకున్న విషయం గుర్తుండే ఉంటుంది. ఓట్ చోరీ అంటూ.. రాహుల్‌గాంధీ బీజేపీని, అదేవిధంగా ప్రధాన మంత్రిని కూడా టార్గెట్ చేశారు. అంతేకాదు.. కీలకమైన ఓట్ అధికార యాత్ర పేరుతో 22 జిల్లాల్లో 30 రోజులపాటు ఆయన యాత్ర చేశా రు. ప్రతి సభలోనూ మోడీ కేంద్రంగా ఆయన నిప్పులు చెరిగారు. దీంతో ఇప్పుడు బీహార్ ఎన్నికల్లో రాహుల్ సత్తా ఏమేరకు ఉంటుందన్నది చూడాలి. ఇక, మోడీ విషయానికి వస్తే.. బలమైన యాదవ సామాజిక వర్గంతోపాటు.. నాయి సామాజిక వర్గాన్ని కూడా ఆయన ప్రభావితం చేస్తున్నారు. నాయి సామాజిక వర్గానికి చెందిన ప్రముఖ రచయిత, సామాజిక వేత్త.. కర్పూరీ ఠాకూర్‌కు ముందస్తుగానే(గత ఏడాది) అత్యంత కీలకమైన పౌర సన్మానం.. భారత రత్నను ప్రకటించారు. తద్వారా.. మోడీ ఆ సామాజిక వర్గానికి ఆరాధ్య నాయకుడిగా మారిపోయారు. పైగా ఈబీసీ కేటగిరీలో నాయిని చేర్చడం కూడా.. ఆయనకు ఎంతో కలిసి వస్తోంది. ఇక, రాజకీయంగా చూసుకుంటే.. రాహుల్ గాంధీ పేరు ఎత్తుకుండానే.. ఆయన కుటుంబాన్ని టార్గెట్ చేసుకుంటు న్నారు. గాంధీల కుటుంబం.. ముఖ్యంగా నెహ్రూను కూడా ఎండగడుతున్నారు. ఆపరేషన్ సిందూర్ వ్యవహారం.. అటు మోడీకి, ఇటు రాహుల్‌కు కూడా తీవ్ర పరీక్షగానే మారిందని చెప్పాలి. ఆపరేషన్ సిందూర్ ద్వారా పాకిస్థాన్‌కు బుద్ధి చెప్పామని.. ఉగ్రమూకను అరికట్టామని ప్రధాని చెబుతున్నారు. కానీ, రాహుల్ మాత్రం.. దీనిని ఎందుకు అర్ధంతరంగా ఆపేశారో చెప్పాలని.. ప్రధానంగా అమెరికా అధ్యక్షుడు ట్రంప్ జోక్యం.. ఆయన పదే పదే దీనిపై కామెంట్లు చేయడాన్ని కూడా.. రాహుల్ ప్రశ్నిస్తున్నారు. ఈ క్రమంలోనే ఇటీవల తీసుకువచ్చిన జీఎస్టీ-2.0 సంస్కరణలను ప్రధాని ఇప్పుడు సద్వినియోగం చేసుకునే అవకాశం ఉందని పరిశీలకులు. అంతేకాదు.. బీహార్‌లోని అత్యంత వెనుక బడిన జిల్లాగా పేరున్న దర్భంగా కు ఇటీవలే 7 వేల కోట్ల రూపాయల ప్యాకేజీతో అనేక ప్రాజెక్టులకు ప్రధాని మోడీ శంకుస్థాపనలు చేశారు.

**ఎవరు ఎటు?...** ఇక, బలాబలాను బట్టి చూస్తే.. మోడీకి ఉన్న ఆదరణ.. రాహుల్‌కు లేదన్నది స్థానికంగా వినిపిస్తున్న మాట. అనేక సర్వేలు ఇప్పటికే వచ్చాయి. వాటిలో ప్రధానంగా మోడీ హవాను గ్రామీణ స్థాయిలో ఎక్కువ మంది కోరుకుంటున్న సూర్య ఘర్ నుంచి పీఎం కిసాన్ వరకు.. అదేవిధంగా స్వయం ఉపాధి రుణాలు... బీహార్‌ను సైతం %-%పూర్వోదయ%-% పథకంలో చేర్చినిధులు ఇవ్వడం.. స్థానికంగా యువతకు ఉపాధి అవకాశాలు పెంచడం వంటివి మోడీకి కలిసి వస్తున్నాయి. అంతేకాదు.. బీజేపీకి ఉన్న ఏకైక ఐకానిక్ నాయకుడు, మేజర్ ఎన్నికల ప్రచాకర్త కూడా.. మోడీనే. ఆయన మాటలే మంత్రంగా.. బీహార్ ఓటు బ్యాంకును సమూలంగా తమవైపు తిప్పుతారన్న వాదనను కూడా బీజేపీ నాయకులు చెబుతున్నారు. ఈ తరహా బలమైన వాదన కాంగ్రెస్‌లో కనిపించడం లేదు. సో.. మొత్తంగా ఎవరు గెలుస్తారన్నది.. ఈ 40 రోజుల పరిస్థితులను బట్టి తేలనుంది.




## బీసీ రిజర్వేషన్ బిల్లుపై విచారణ వాయిదా..

హైదరాబాద్ : బీసీ రిజర్వేషన్ బిల్లుపై హైకోర్టు తీర్పును రేపటికి వాయిదా వేసింది. రేపు మధ్యాహ్నం 2.15గంటలకు విచారణ చేపట్టనున్నట్లు తెలిపింది. బీసీ రిజర్వేషన్లపై మొత్తం 28 ఇంప్లీడ్ పిటిషన్లు దాఖలయ్యాయి. అన్ని పిటిషన్లను కలిపి హైకోర్టు.. బుధవారం మధ్యాహ్నం లంచ్ బ్రేక్ తర్వాత విచారణ చేపట్టింది. ప్రభుత్వం తరఫున అభిషేక్ సింఘ్వీ తన వాదనలు వినిపించారు. ఈ సందర్భంగా తెలంగాణ ప్రభుత్వానికి హైకోర్టు పలు ప్రశ్నలు వేసింది. గవర్నర్ దగ్గర బిల్లు ఎప్పటినుంచి పెండింగ్‌లో ఉంది?, ట్రిపుల్ టెస్టు విధానం అమలు చేశారా?, బీసీ రిజర్వేషన్ల ప్రక్రియ ఎలా నిర్వహించారు?, కమిషన్ రిపోర్ట్ పబ్లికేషన్ చేశారా?, ప్రజల అభ్యంతరాలను స్వీకరించారా.. అంటూ హైకోర్టు ప్రశ్నించింది. షెడ్యూల్ నోటిఫై అయ్యిందా అని ఏజీని ప్రశ్నించించింది. వాదనలు ఇంకా వినిపించాల్సి ఉన్నందున విచారణ రేపటికి వాయిదా వేయాలని ఏజీ కోరింది.

## జూబ్లీహిల్స్ లో బీఆర్ఎస్ కు తలసాని షాక్?.. తాజా ఇంటర్వ్యూలో సెన్సేషనల్ కామెంట్స్




తెలంగాణ రాజకీయాల్లో పార్టీల మధ్య జూబ్లీహిల్స్ బైపోల్ ఫైట్ షురూ అయింది. మరో ఐదు రోజుల్లో నోటిఫికేషన్ రిలీజ్ కాబోతున్న నేపథ్యంలో ప్రధాన పార్టీలు గెలుపు కోసం ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాయి. ఈ క్రమంలో అందరికంటే ముందే తమ అభ్యర్థిని ప్రకటించి బీఆర్ఎస్ గెలుపు గట్టి ప్రయత్నాలు చేస్తోంది. అయితే దివంగత మాగంటి గోపీనాథ్ సతీమణినే బరిలోకి దింపడం ద్వారా సెంటిమెంట్ కార్డును ప్లే చేస్తున్న కారు పార్టీకి జూబ్లీహిల్స్ బై పోల్‌లో ఊహించని షాక్ తగలబోతున్నట్లు సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతోంది. మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ రూపంలో భారీ ఎదురుదెబ్బ తగలబోతోందనే చర్చ ఈ సెగ్మెంట్లో ఇప్పుడు హాట్ టాపిక్ గా మారింది.

**నవీన్ యాదవ్ కోసం తలసాని!:** బీఆర్ఎస్ తన అభ్యర్థిని ప్రకటించగా కాంగ్రెస్, బీజేపీలు తమ అభ్యర్థి కోసం కసరత్తు చేస్తున్నాయి. హస్తం పార్టీ నుంచి నవీన్ యాదవ్ పేరు దాదాపు ఖరారు అయినట్లు ప్రచారం జరుగుతోంది. అయితే నవీన్ యాదవ్ మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ సోదరుడి అల్లుడు. తన సోదరుడు శ్రీనివాస్ యాదవ్ తనకు కుడిభుజం లాంటి వారని తలసాని చెబుతుంటారు. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ నవీన్ యాదవ్‌ను బరిలోకి దింపితే తలసాని శ్రీనివాస్ యాదవ్ నవీన్ యాదవ్?కు మద్దతు ఇవ్వబోతున్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. తాజాగా ఓ ఇంటర్వ్యూలో తలసాని చేసిన వ్యాఖ్యలు ఈ వాదనకు బలం చేకూరేలా ఉన్నాయని సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతోంది.

**పార్టీ వర్సెస్ బంధుత్వం:** ఇంటర్వ్యూలో పలు కీలకాంశాలను ప్రస్తావించిన తలసాని.. బీఆర్ఎస్ హయాంలో మాగంటిగోపినాథ్ ఉండగా నవీన్ యాదవ్? పడిన ఇబ్బందులు, కేసులు అన్ని తనకు పూసగుచ్చినట్లు తెలుసన్నారు. అయితే తన అల్లుడు నవీన్ యాదవ్‌కు మద్దతు విషయంలో స్పందిస్తూ.. ఇంకా నోటిఫికేషన్ రాలేదని ఆ సందర్భం వచ్చాక మాట్లాడుతానన్నారు. నవీన్ యాదవ్ నా కుటుంబీకుడు.. అతనికి నేను చాలా ఏళ్ల నుంచి రాజకీయంగా మార్గనిర్దేశం చేస్తున్నానని తలసని చెప్పుకొచ్చారు. నవీన్ యాదవ్ గెలిస్తే మంత్రి అయ్యే అవకాశం ఉందని అడుగగా ఫ్యామిలీలో డ్రీమ్స్, ఫ్రెండ్స్ సర్కిల్స్ లో డ్రీమ్స్ ఉంటాయి. కానీ తాను సందర్భం వచ్చాక మాట్లాడుతానన్నారు. అలాగే తాను పార్టీకి లాయలిస్టునని చెప్పారు. దీంతో ఎన్నికల నోటిఫికేషన్ వెలువడి కాంగ్రెస్ తరఫున నవీన్ యాదవ్ బరిలో ఉంటే పార్టీ ఓ వైపు బంధుత్వం మరో వైపు ఈ రెండింటి మధ్య తలసాని ఎటువైపు అనే చర్చ జూబ్లీహిల్స్ పాలిటిక్స్ లో కాక రేపుతోంది. హైదరాబాద్ లో తలసానికి ప్రజల్లో మంచి క్రేజ్ ఉంది. ఆయన నియోజకవర్గం సనత్ నగర్ కూడా జూబ్లీహిల్స్ కు ఆనుకునే ఉంది. ఈ నేపథ్యంలో నేరుగా సపోర్టు చేయకపోయినా అంతర్గతంగా తన అల్లుడికి మద్దతు కూడగట్టే అవకాశాలు లేకపోలేదనే టాక్ వినిపిస్తోంది. ఈ నేపథ్యంలో తలసాని డిసిషన్ బీఆర్ఎస్‌లో కు కొత్త టెన్షన్ పుట్టించబోతోందనే అభిప్రాయాలు రాజకీయ వర్గాల్లో వినిపిస్తోంది.




# గెలుపుపై ప్రధాన పార్టీల ఫోకస్..

## మూడు పార్టీలకూ కీలకం!

హైదరాబాద్ : జూబ్లీహిల్స్ ఉప ఎన్నికకు నగరా మోగింది. బీఆర్ఎస్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ ఆకస్మిక మరణంతో ఖాళీ అయిన ఈ స్థానానికి కేంద్ర ఎన్నికల సంఘం బై పోల్ షెడ్యూల్‌ను ప్రకటించింది. దీంతో ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ గెలుపుపై ఫోకస్ పెట్టాయి. రాష్ట్ర రాజధాని నడిబొడ్డున ఉన్న అసెంబ్లీ సీటు కావడం, త్వరలో జీహెచ్ఎంసీ ఎన్నికలు జరగనుండడంతో మూడు పార్టీలకు ఈ బైపోల్ కీలకంగా మారింది.

ఇప్పటికే నేతలు సెగ్మెంట్‌లో కలియతిరుగుతున్నారు. ఇప్పుడు షెడ్యూల్ కూడా రావడంతో మరింత బిజీ కానున్నారు.

**ఈ నెల 13 నుంచి నామినేషన్లు...** జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక నోటిఫికేషన్ ఈ నెల 13న విడుదల కానుంది. అదేరోజు నుంచి నామినేషన్ల ప్రక్రియ మొదలవుతుంది.

షెడ్యూల్ ప్రకటించినందున హైదరాబాద్ జిల్లాలో ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది. ఈ నెల 13 నుంచి 21 వరకు నామినేషన్లు దాఖలు చేసుకోవచ్చు. 22న స్క్రూటినీ, 24న విత్ డ్రాకి అవకాశం ఇచ్చారు. వచ్చే నెల 11న పోలింగ్ జరుగుతుంది. అదే నెల 14న కోట్ల విజయభాస్కర్ రెడ్డి స్టేడియంలో ఓట్ల లెక్కింపు ఉంటుంది. నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు 3,98,982 మంది ఉన్నారు.

**రెండు మూడు రోజుల్లో అభ్యర్థి ప్రకటన...** జూబ్లీహిల్స్‌లో గెలుపే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ పకడ్బందీ వ్యూహంతో ముందుకెళ్తున్నది. ఇందులో భాగంగా అభ్యర్థి ఎంపికపై ఆచితూచి అడుగులు వేస్తున్నది. మంగళవారం సీఎం రేవంత్ రెడ్డితో కాంగెస్ రాష్ట్ర ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్ , పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ మరోసారి సమావేశమై నాలుగు పేర్లతో కూడిన ఆశావహుల జాబితాను సిద్ధం చేయనున్నారు. ఎన్నికల షెడ్యూల్ కూడా వచ్చినందున హైకమాండ్ గురువారంలోగా అభ్యర్థిని ప్రకటించే అవకాశమున్నట్లు తెలుస్తున్నది. విద్య, ఉద్యోగాలు, స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల కోసం కృషి చేస్తున్న కాంగ్రెస్.. జూబ్లీహిల్స్‌లోనూ బీసీలకే టికెట్ ఇవ్వాలని భావిస్తున్నట్లు ప్రచారం జరుగుతున్నది. ఈ మేరకు సోమవారం మీడియాతో జరిగిన చిట్ చాట్ లో బీసీలకే జూబ్లీహిల్స్ టికెట్ ఇవ్వనున్నట్లు పీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్ స్పష్టం చేశారు. బీసీ కోటాలో నవీన్ యాదవ్, బొంతు రామ్మోహన్, అంజన్ కుమార్ యాదవ్ పేర్లు ప్రధానంగా వినిపిస్తున్నాయి. నియోజకవర్గ ఇన్‌చార్జులుగా ఉన్న మంత్రుల సిఫార్సులకు తోడు ఇప్పటికే కాంగ్రెస్ నిర్వహించిన సర్వేల ఆధారంగా టికెట్ ఖరారుచేసే అవకాశం ఉంది. అభ్యర్థిని ప్రకటించనప్పటికీ బై పోల్ ప్రచారంలో దూసుకుపోతున్న కాంగ్రెస్ రెండు, మూడు రోజుల్లో బస్తీ బాటకు రెడీ అవుతున్నది. ఇక్కడ పార్టీ ఇన్‌చార్జులుగా ఉన్న మంత్రులు వివేక్ వెంకటస్వామి, పొన్నం ప్రభాకర్, తుమ్మల నాగేశ్వర్ రావు ఇప్పటికే స్థానిక నేతలు, కేడర్‌తో పలుదఫాలు సమావేశమయ్యారు. షెడ్యూల్ రాకముందే బస్తీల్లో తిరుగుతూ ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ క్రమంలో వివిధ అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. ఇప్పుడు షెడ్యూల్ రావడంతో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ చైర్‌పర్సన్లు, ఇతర ప్రజాప్రతినిధులతో పాటు పార్టీ సీనియర్లు ఆయా డివిజన్లలో ముమ్మర ప్రచారానికి సిద్ధమవుతున్నారు.

**హడావుడి మొదలు...** జూబ్లీహిల్స్ ఉప ఎన్నికకు షెడ్యూల్ వెలువడటంతో ప్రధాన పార్టీల్లో హడావుడి మొదలైంది. అధికార కాంగ్రెస్‌తోపాటు బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు ఇక్కడ విజయం కోసం వ్యూహరచనలు చేస్తున్నాయి. తాము అధికారంలోకి వచ్చాక చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలే తమను గెలిపిస్తాయనే కాంగ్రెస్ ధీమాతో ఉంది. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో హైదరాబాద్‌లో ఒక్క సీటూ గెలవని ఆ పార్టీ.. ఆ తర్వాత కంటోన్మెంట్ ఉప ఎన్నికలో గెలవడం ద్వారా గ్రేటర్ హైదరాబాద్‌లో బోణీ కొట్టింది.

అదే జోష్‌తో జూబ్లీహిల్స్ బై ఎలక్షన్‌లోనూ విజయం సాధించాలని భావిస్తున్నది. అటు వరుస ఓటములతో కుదేలైన బీఆర్ఎస్‌కు ఈ సిట్టింగ్ స్థానాన్ని తప్పక నిలబెట్టుకోవాల్సిన పరిస్థితి! దీంతో ఆ పార్టీ ప్రధానంగా సెంటిమెంట్?నే నమ్ముకున్నది. మాగంటి గోపీనాథ్ మృతితో ఖాళీ అయిన ఈ సీటులో ఆయన భార్య సునీతనే అభ్యర్థిగా ప్రకటించి, ప్రచారం చేస్తున్నది. మరోవైపు కాంగ్రెస్‌కు తామే ప్రత్యామ్నాయమని చెప్తున్న బీజేపీకి.. జీహెచ్ఎంసీ ఎన్నికల ముందు జరుగుతున్న ఈ ఉప ఎన్నిక అగ్నిపరీక్షలా మారింది.




# పెట్టుబడులకు ఇదే సమయం: మోదీ

దిల్లీ: మొబైల్‌ఫోన్ల నుంచి సెమీ కండక్టర్లు, ఎలక్ట్రానిక్స్ వరకు అన్ని రంగాల్లో 'మేక్ ఇన్ ఇండియా'పై దృష్టిపెట్టాలని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అన్నారు. తమ ప్రభుత్వం సంస్కరణలను వేగవంతం చేసిందని, భారత్‌లో పెట్టుబడులకు ఇదే అత్యుత్తమ సమయమని పారిశ్రామికవేత్తలకు పిలుపునిచ్చారు. ఈమేరకు ఇండియా మొబైల్ కాంగ్రెస్ ప్రారంభోత్సవ సభలో బుధవారం ఆయన మాట్లాడారు. పెట్టుబడులకు భారత్ అత్యంత అనుకూల గమ్యస్థానంగా అవతరించిందని ప్రధాని మోదీ పేర్కొన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థ, పెట్టుబడిదారులను ఆహ్వానించే ప్రభుత్వ విధానాలు, సులభతర వ్యాపార పద్ధతులు ఇందుక్కారణం అని తెలిపారు. వస్తు, సేవల పన్ను రేట్లను సవరించడం ద్వారా షాంపూ నుంచి టెలివిజన్ వరకు చాలా వస్తువులు చవకగా మారాయని చెప్పారు. భారత్‌లో సెమీ కండక్టర్లు, మొబైల్‌ఫోన్లు, ఎలక్ట్రానిక్స్ తయారీలో అపార అవకాశాలు ఉన్నాయని చెప్పారు. పారిశ్రామికవేత్తలు, ఆవిష్కర్తలు, స్టార్టప్‌లు ముందుకురావాల్సిన సమయం ఆసన్నమైందని పిలుపునిచ్చారు. గత దశాబ్దంలో మన దేశం డిజిటల్ రంగంలో సాధించిన విశేష ప్రగతిని ప్రస్తావిస్తూ.. భారత్‌లో ఒక జీబీ వైర్‌లెస్ డేటా ధర, ఒక కప్పు టీ ధర కంటే తక్కువని మోదీ వ్యాఖ్యానించారు. డిజిటల్ కనెక్టివిటీ ఇక విలాసమో, ప్రత్యేక హక్కో ఏమాత్రం కాదని, అది ప్రతి భారతీయుడి జీవితంలో విడదీయలేని భాగమైందని పేర్కొన్నారు. భారత్‌లో ప్రస్తుతం డెవలపర్ల సంఖ్య గణనీయంగా పెరుగుతోందని చెప్పారు. భారత్ ప్రపంచంలోనే రెండో అతిపెద్ద టెలికాం మార్కెట్, రెండో అతిపెద్ద 5జీ మార్కెట్‌గా నిలిచిందన్నారు. మానవ వనరులు, మొబిలిటీ, మైండ్‌సెట్.. ఈ మూడింటి శక్తి భారత్‌ను ముందుంచుతోందన్నారు. పూర్తి స్వదేశీ పరికరాలతో ఇటీవల బీఎస్ఎన్ఎల్ 4జీ సేవలు ప్రారంభించడం దేశ విజయమని పేర్కొన్నారు. ఈ విషయంలో ప్రపంచంలోని ఐదు దేశాల జాబితాలో భారత్ కూడా చేరిందని తెలిపారు. ఒకప్పుడు 2జీ కోసం కష్టపడిన దేశం, ఇప్పుడు దాదాపు ప్రతి జిల్లాలోనూ 5జీ సేవలు అందుతున్నాయని పేర్కొన్నారు.




టీవీకే చీఫ్ విజయ్ బుధవారం సుప్రీంకోర్టును ఆశ్రయించారు. కరూర్ తొక్కిసలాట ఘటనపై సిట్ దర్యాప్తునకు మద్రాస్ హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వును ఆయన అత్యున్నత న్యాయస్థానంలో సవాల్ చేశారు. పార్టీకి వ్యతిరేకంగా సిట్ పక్షపాత వైఖరిని అవలంబిస్తోందని ఆరోపించారు. సీనియర్ ఐపీఎస్ అధికారి అస్రాగార్గ్ ఆధ్వర్యంలో సిట్ ఏర్పాటైంది. పోలీసుల దర్యాప్తు, అధికారుల పాత్రపై తాము ఇదివరకే ప్రశ్నలు లేవనెత్తినప్పటికీ.. రాష్ట్ర పోలీసు అధికారులతోనే మద్రాస్ హైకోర్టు సిట్‌ను ఏర్పాటుచేసిందని టీవీకే తన పిటిషన్‌లో పేర్కొంది. తమ పార్టీపై సిట్ పక్షపాతంతో వ్యవహరిస్తోందని ఆరోపించారు. టీవీకే అధ్యక్షుడు విజయ్‌కు నాయకత్వ లక్షణాల్లేవని, ఘటన జరిగిన వెంటనే ఆ పార్టీ నేతలందరూ పారిపోయారని వ్యాఖ్యానించిన మద్రాసు హైకోర్టు... కరూర్ ఘటనపై ఆ పార్టీ తీరును తీవ్రంగా ఖండించిన సంగతి తెలిసిందే. తొక్కిసలాట తర్వాత అన్ని పార్టీలూ సహాయక చర్యలు చేపడితే, నిర్వాహకులు వెళ్లిపోయారని తప్పుపట్టిన సంగతి తెలిసిందే. ఈవిషయాన్ని టీవీకే పార్టీ తన పిటిషన్‌లో ప్రస్తావించింది. ఆ వ్యాఖ్యలు ఇప్పటికే దర్యాప్తును ప్రభావితం చేశాయని పేర్కొంది. తన ర్యాలీలో ఇబ్బందులు సృష్టించేందుకు ముందస్తు కుట్రలను తోసిపుచ్చలేమని ఆరోపించింది.

**తొక్కిసలాట ఘటనలో కలెక్టరు, ఎస్పీ తప్పిదం...** టీవీకే పార్టీ అధ్యక్షుడు విజయ్ కరూర్‌లో నిర్వహించిన ప్రచార ర్యాలీ తీవ్ర విషాదాన్ని నింపిన సంగతి తెలిసిందే. ఈ ఘటనలో 41 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ నేపథ్యంలో బాధిత కుటుంబాలను కలిసేందుకు తనకు అనుమతివ్వాలంటూ డీజీపీకి విజయ్ మెయిల్ పంపారు. విషాదంలో ఉన్న బాధిత కుటుంబాలను స్వయంగా కలిసి పరామర్శించాలని కోరుకుంటున్నట్లు అందులో పేర్కొన్నారు. దీనికిముందు ఆయన బాధిత కుటుంబాలతో వీడియో కాల్‌లో మాట్లాడారు. మృతుల కుటుంబ సభ్యులను ఓదార్చిన ఆయన.. త్వరలోనే వారివద్దకు వస్తానని హామీ ఇచ్చారు. ఈ ఘటనలో విజయ్ తప్పులేదని, ఆయన తన రాజకీయ ప్రయాణాన్ని కొనసాగించాలని వారు కోరారని టీవీకే నేత అరుణ్ రాజ్ వెల్లడించారు. ఇదిలాఉంటే.. తొక్కిసలాటలో మృతి చెందిన 13 ఏళ్ల బాలుడి తండ్రి సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ కేసును సీబీఐకి అప్పగించాలని కోరారు.

## ఛలో బస్ భవన్‌కు బీఆర్ఎస్ పిలుపు.. ఛార్జీలు తగ్గించాలని డిమాండ్




హైదరాబాద్: ఛలో బస్ భవన్‌కు బీఆర్ఎస్ పార్టీ పిలుపునిచ్చింది. ఈ మేరకు రేపు(గురువారం) బస్ భవన్ దగ్గర బీఆర్ఎస్ నేతలు నిరసన చేపట్టనున్నారు. సిటీలో ఆర్టీసీ ఛార్జీల పెంపును ఖండిస్తూ.. బీఆర్ఎస్ ఆందోళనకు దిగనుంది. ఈ నేపథ్యంలో మెహిదీపట్నం నుంచి బస్ భవన్ వరకు ఆర్టీసీ బస్సులో మాజీ మంత్రులు కేటీఆర్, హరీష్ రావు, ఇతర నేతలు ప్రయాణం చేయనున్నారు. బస్ భవన్‌కు చేరుకుని ఆర్టీసీ ఎండీకి ఛార్జీల పెంపుపై మెమోరాండం ఇవ్వనున్నారు. ఈ మేరకు బస్ భవన్ ముందు ధర్నా చేపట్టి సిటీ బస్సుల్లో పెంచిన ఛార్జీలు తగ్గించాలని బీఆర్ఎస్ డిమాండ్ చేయనుంది. కాంగ్రెస్ ప్రభుత్వం హైదరాబాద్, సికింద్రాబాద్ పరిధిలో నడిచే అన్ని బస్సుల్లో ఛార్జీలు పెంచిన విషయం తెలిసిందే. సిటీ ఆర్డినరీ, మెట్రో ఎక్స్‌ప్రెస్, ఈ-ఆర్డినరీ, ఈ-ఎక్స్‌ప్రెస్, మెట్రో డీలక్స్, ఈ-మెట్రో, ఏసీ సర్వీసుల్లో ఛార్జీలు పెంచింది. ఈ మేరకు మొదటి మూడు స్టేజిలకు రూ.5, 4వ స్టేజి నుంచి రూ.10 అదనపు ఛార్జీలు వసూలు చేస్తోంది. మెట్రో డీలక్స్, ఈ-మెట్రో ఏసీ సర్వీసుల్లో మొదటి స్టేజీకి రూ.5, రెండో స్టేజీ నుంచి రూ.10 అదనపు ఛార్జీలు తీసుకుంటుంది. ఈ నేపథ్యంలో పెంచిన బస్సు ఛార్జీలు తగ్గించాలని డిమాండ్ చేస్తూ.. బీఆర్ఎస్ పార్టీ ఛలో బస్ భవన్‌కు పిలుపునిచ్చింది.




## పసిడి సరికొత్త రికార్డ్.. రూ.1.25 లక్షలు దాటేసి ఇంకా పైపైకి!

బంగారం ధర రోజుకో సరికొత్త రికార్డును నమోదు చేస్తోంది. మొన్నటివరకు 10 గ్రాముల ధర రూ.లక్ష దాటితేనే ఔరా అనుకున్న వాళ్లంతా.. తాజాగా రూ.1.25 లక్షలకు చేరుకోవడం చూసి ముక్కున వేలేసుకుంటున్నారు. అంతర్జాతీయంగానూ పుత్తడి ఔన్సు తొలిసారి 4వేల డాలర్ల మార్కును దాటింది. అమెరికా ఫెడరల్ గవర్నమెంట్ షట్‌డౌన్, ఆ దేశ ఆర్థిక పరిస్థితిపై నెలకొన్న అనిశ్చితులు పసిడికి తాజాగా డిమాండ్ పెంచుతున్నాయి. హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో బుధవారం మధ్యాహ్నం 12 గంటల సమయానికి 24 క్యారెట్ల స్వచ్ఛమైన 10 గ్రాముల బంగారం ధర రూ.1,25,780 వద్ద కొనసాగుతోంది. 22 క్యారెట్ల పసిడి రూ.1,12,900 పలుకుతోంది. అటు వెండి సైతం కిలో రూ.1.56 లక్షలు దాటింది. అంతర్జాతీయ విపణిలో స్పాట్ గోల్డ్ ఔన్సు 4034 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. వెండి ఔన్సు 48.62 డాలర్ల వద్ద కొనసాగుతోంది. డాలరుతో రూపాయి మారకం విలువ 88.79గా ఉంది.

**ఏడాదిలో 50% పైనే...** అంతర్జాతీయంగా నెలకొన్న అనిశ్చిత పరిస్థితులు బంగారానికి డిమాండ్ పెంచుతున్నాయి. ముఖ్యంగా అంతర్జాతీయ వాణిజ్యంపై టారిఫ్‌ల ప్రభావం, భౌగోళిక రాజకీయ పరిస్థితులు, కేంద్ర బ్యాంకులు కొనుగోళ్ల కారణంగా సురక్షిత పెట్టుబడి సాధనంగా భావించే పుత్తడి వైపు పెట్టుబడులు మళ్లడమే దీనికి కారణం. దాదాపు రెండేళ్లక్రితం ఔన్సు బంగారం ధర 2 వేల డాలర్ల దిగువనే ఉండేది. అలాంటిది ఈ ఒక్క క్యాలెండర్ సంవత్సరంలోనే దాదాపు 50 శాతం మేర పెరగడం గమనార్హం. ఈ పెరుగుదలతో పసిడి కొనుగోళ్లకు ప్రజలు వెనకడుగు వేస్తున్నారు. పండగ సీజన్‌లో వ్యాపారాలు తగ్గడంతో ఆభరణ వ్యాపారులు సైతం ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.




హైదరాబాద్: మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కు వ్యక్తిగతంగా క్షమాపణలు చెబుతున్నట్లు మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. తెలంగాణ పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ నివాసంలో ఈ మంత్రులిద్దరూ భేటీ అయ్యారు.

ఈ సందర్భంగా పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. "నేను ఆ మాట అనకపోయినా క్షమాపణలు చెబుతున్నా. పత్రికా కథనాలతో మంత్రి అడ్లూరి మనస్తాపం చెందారు. అందుకే ఆయనకు క్షమాపణలు చెబుతున్నా. మంత్రి అడ్లూరికి, నాకు పార్టీ సంక్షేమం తప్ప మరో ఉద్దేశం లేదు. కాంగ్రెస్ నేతలమంతా సామాజిక న్యాయం కోసం పని చేస్తాం" అని తెలిపారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో జరిగిన ఓ సమావేశంలో మంత్రి పొన్నం ప్రభాకర్.. మరో మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌ను ఉద్దేశించి అన్నట్లుగా వ్యాఖ్యలు సోషల్‌మీడియాలో రావడం.. వాటిపై లక్ష్మణ్‌కుమార్ ఓ వీడియో విడుదల చేయడం చర్చనీయాంశంగా మారింది. తనపై పొన్నం అనుచిత వ్యాఖ్యలు చేశారని, మారకపోతే జరిగే పరిణామాలకు ఆయనే బాధ్యత వహించాలని అందులో ఆగ్రహం వ్యక్తం చేశారు.
దీంతో ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన ఈ ఇద్దరు మంత్రుల మధ్య ఉన్న విభేదాలు.. ఇప్పుడు బహిర్గతమయ్యాయన్న చర్చ జరిగింది. తాజాగా బుధవారం మహేశ్ కుమార్ గౌడ్, ముఖ్య నేతల చొరవతో పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ మధ్య వివాదం ముగిసింది.

## నాదర్‌గుల్‌లో హైడ్రా కూల్చివేతలు.. బాధితులకు న్యాయం




హైదరాబాద్, అక్టోబరు8 : రంగారెడ్డి జిల్లా లోని మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో గల నాదర్‌గుల్‌లో హైడ్రా అధికారులు అక్రమ నిర్మాణాలను(వెంచర్) ఇవాళ(బుధవారం) కూల్చివేశారు. ఇక్కడ 1986లో టెలికాం కో - ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ ఒక వెంచర్‌గా దాదాపు 100 ఎకరాల భూమిలో ప్లాట్లను ఏర్పాటు చేసి, సొసైటీ సభ్యులకు పంపిణీ చేసింది. అయితే, 2016లో ధరణి ద్వారా అక్రమ పాస్‌బుక్కులు సృష్టించి, సొసైటీకి చెందిన భూమిలో మరో నూతన వెంచర్‌ను ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో దాదాపు 23 ఇంటి నిర్మాణ అనుమతులని అక్రమంగా పొందారు.

ఈ అక్రమాలను గమనించిన అసలైన ప్లాట్ యజమానులు కలెక్టర్, మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ, ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో బాధితులు హైడ్రా ఆశ్రయం తీసుకున్నారు. ఈ విషయంపై హైడ్రా అధికారులు సమగ్ర విచారణ జరిపి, అక్రమంగా మంజూరైన పర్మిషన్లను రద్దు చేశారు. అనంతరం అసలైన యజమానులకు వారి ప్లాట్లను తిరిగి అందజేశారు. ఈ సందర్భంగా హైడ్రా కమిషనర్ రంగనాథ్, ఇతర అధికారులకు స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు. వారికి న్యాయం జరగడంపై బాధితులు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు హైడ్రా అధికారులు ఓ ప్రకటన విడుదల చేశారు.

## 2 లక్షల ఉద్యోగాలు ఇస్తామన్నారు.. కానీ పాతవే భర్తీ చేశారు: కవిత

హైదరాబాద్: గ్రూప్-1 అభ్యర్థులకు అండగా ఉంటామని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత అన్నారు. గన్ పార్కు అమరవీరుల స్తూపం వద్ద గ్రూప్-1 అభ్యర్థులు చేపట్టిన ఆందోళనలో ఆమె పాల్గొని మాట్లాడారు. ప్రిలిమ్స్ పరీక్షల నుంచే అవకతవకలు జరుగుతున్నాయని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ పేరు కోసం బోగస్ ఉద్యోగాలు ఇవ్వొద్దని చెప్పారు. అభ్యర్థులు ఏళ్ల తరబడి ఉద్యోగాల కోసం కష్టపడుతున్నారని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ నిరుద్యోగుల పేరు చెప్పుకొని అధికారంలోకి వచ్చిందని దుయ్యబట్టారు. రాహుల్ గాంధీ అశోక్ నగర్‌కు వచ్చి ఉద్యోగాలు ఇస్తామని చెప్పారని గుర్తుచేశారు. "పారదర్శకంగా పరీక్షలు పెట్టండి. 2 లక్షల ఉద్యోగాలు ఇస్తామన్నారు. అధికారంలోకి వచ్చాక పాత ఉద్యోగాలే ఇచ్చారు. ఇవి తప్పుడు పరీక్షలు. కాంగ్రెస్ కోసం వారిని ఎంపిక చేశారు. ప్రొఫెసర్ హరగోపాల్ మాట్లాడాలి. మిమ్మల్ని విద్యార్థులు నమ్మారు.. వారి పక్షాన నిలబడండి.




మూల్యాంకనం సరిగా జరగాలి. కోర్టుల్లో జడ్జీలకు అర్థం అయ్యేదాకా పోరాటం చేస్తాం. గ్రూప్-1 నియామకాలను రద్దు చేసి.. మళ్లీ పరీక్ష నిర్వహించాలి" అని కవిత డిమాండ్ చేశారు.

## తెలంగాణలో రెండు దగ్గు మందులపై నిషేధం



హైదరాబాద్: రెండు దగ్గు మందులను నిషేధిస్తూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రీలైఫ్, రెస్పీఫ్రెష్-టీఆర్‌ను విక్రయించొద్దంటూ అందులో పేర్కొంది. ఈ రెండు దగ్గు మందుల్లోనూ కల్తీ జరిగినట్లు గుర్తించారు. వీటిని గుజరాత్‌కు చెందిన ఫార్మా కంపెనీల ఔషధాలుగా పేర్కొన్నారు. ఇటీవల మధ్యప్రదేశ్, రాజస్థాన్ రాష్ట్రాల్లో 'కోల్డ్‌రిఫ్' అనే దగ్గు మందు వాడడం వల్ల పలువురు చిన్నారులు మృత్యువాత పడ్డట్లు ఆరోపణలు వచ్చాయి.

దీనిపై దర్యాప్తు జరుగుతోంది. ఈ నేపథ్యంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. ఇప్పటికే 'కోల్డ్ రిఫ్'ను పూర్తిగా నిషేధిస్తున్నట్టు ఔషధ నియంత్రణ విభాగం (డీసీఏ) ప్రకటించింది.





మెదక్: ఓ వైపు మంజీరా ఉద్ధృతి.. మరోవైపు దట్టమైన పొగమంచు.. అప్పుడే ఉదయిస్తున్న లే లేత కిరణాలు.. ప్రసిద్ధ పుణ్యక్షేత్రం ఏడుపాయల వనదుర్గ ఆలయంపై కనిపించిందీ దృశ్యం. వనదుర్గ ఆనకట్ట నుంచి 41,090 క్యూసెక్కుల వరదనీరు దిగువకు విడుదల చేయడంతో గర్భగుడి ముందు ఉన్న నదీపాయ ఉద్ధృతంగా ప్రవహిస్తోంది. దీంతో రాజగోపురంలో అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ఏర్పాటు చేసి భక్తులకు దర్శనం కల్పిస్తున్నారు. వరద తగ్గగానే ఆలయాన్ని శుభ్రపరచి మూలవిరాట్ దర్శనం కల్పిస్తామని ఆలయ ఈవో చంద్రశేఖర్ తెలిపారు.

చురకలు



# అణగారిన ప్రజల ఆశయాలకు ప్రతీక “చే” గువేరా

## విప్లవానికి ప్రతీక... “చే” గువేరా గాథ - అక్టోబర్ 9...విప్లవ యోధుడు చే గువేరా వర్ధంతి



చరిత్రలో కొందరు వ్యక్తులు కాలానికి అతీతంగా నిలుస్తారు. వారి ఆలోచనలు, త్యాగాలు, ఉద్యమాలు తరతరాలను ప్రేరేపిస్తాయి. అటువంటి అజరామరమైన విప్లవ నాయకుల్లో ఒకరు ఎర్నెస్టో “చే” గువేరా – లాటిన్ అమెరికా ఖండానికే కాకుండా, ప్రపంచంలోని అణగారిన ప్రజల ఆశయాలకు ప్రతీకగా నిలిచిన మహా యోధుడు. 1928 జూన్ 14న అర్జెంటీనాలోని రోసారియో పట్టణంలో ఒక మధ్యతరగతి కుటుంబంలో జన్మించిన ఎర్నెస్టో గువేరా డే లా సెర్నా చిన్నప్పటి నుంచే మేధావి, సంకల్పశక్తి కలవాడు. బాల్యంలో ఆస్తమా అనే దీర్ఘవ్యాధితో బాధపడినా, తన ధైర్యం, పట్టుదలతో దానిని అధిగమించాడు. వైద్యవిద్యను అభ్యసించిన ఆయన బ్యూనస్ ఎయిర్స్ విశ్వవిద్యాలయం నుండి 1953లో వైద్య పట్టా పొందాడు. మొదట మానవ సేవ ధ్యేయంగా వైద్యవృత్తి ద్వారా సమాజానికి సేవ చేయాలనుకున్న ఆయన, లాటిన్ అమెరికా పర్యటనల్లో పేదరికం, అన్యాయం, సామాజిక అసమానత, అమెరికా సామ్రాజ్యవాదం ఆధిపత్యం వంటి వాస్తవాలను ప్రత్యక్షంగా చూశాడు. ఈ అనుభవాలే ఆయన హృదయంలో విప్లవ జ్వాలలు రగిలించాయి. 1951–52లో తన స్నేహితుడు అల్బర్టో గ్రానాడోతో కలిసి మోటార్ సైకిల్‌పై దక్షిణ అమెరికా అంతటా చేసిన విస్తృత పర్యటన ఆయన జీవితానికి మలుపు తెచ్చింది. పెరూ, చిలీ, బొలీవియా, కొలంబియా వంటి దేశాల్లోని పేద ప్రజల దుస్థితిని గమనించి ఆయన మనసు మెలికలు తిరిగింది. ఈ అనుభవాలను ఆయన “ది మోటార్ సైకిల్ డైరీస్” అనే పుస్తకంలో అద్భుతంగా రాశాడు. ఆ యాత్ర ఆయనను ఒక వైద్యుడి నుండి ఒక విప్లవ యోధుడిగా మలిచింది. 1954లో గ్వాటెమాలాలో ప్రజాస్వామ్య ప్రభుత్వాన్ని అమెరికా మద్దతుతో కూలదోయడాన్ని చూసినప్పుడు ఆయనలో పెట్టుబడిదారీ వ్యవస్థపై వ్యతిరేకత మరింత పెరిగింది. మెక్సికోలో 1955లో ఫిడెల్ కాస్ట్రో మరియు రౌల్ కాస్ట్రోలను కలవడం ఆయన జీవితాన్ని పూర్తిగా మార్చేసింది. కాస్ట్రో నేతృత్వంలోని “జూలై 26 ఉద్యమం”లో చేరి క్యూబాలోని నియంత ఫుల్జెన్సియో బాటిస్టా ప్రభుత్వాన్ని కూలదోయడానికి గెరిల్లా యుద్ధంలో పాల్గొన్నాడు. మొదట వైద్యుడిగా, తర్వాత ధైర్యవంతమైన కమాండర్‌గా ఎదిగి “చే” అనే ముద్రను సంపాదించాడు – ఇది అర్జెంటీనా భాషలో “స్నేహితుడు” అనే అర్థమున్న పదం. 1956 నుండి 1959 వరకు సాగిన క్యూబా విప్లవ యుద్ధంలో చేగువేరా కీలక పాత్ర పోషించాడు. ఆయన వ్యూహాలు, క్రమశిక్షణ, త్యాగం విప్లవ విజయానికి దోహద పడ్డాయి. ముఖ్యంగా సాంటా క్లారా నగరాన్ని స్వాధీనం చేసుకోవడం బాటిస్టా పరాభవానికి ప్రధాన కారణమైంది. 1959 జనవరి 1న ఫిడెల్ కాస్ట్రో హవానాలో అధికారాన్ని చేపట్టగా, చేగువేరా క్యూబా ప్రభుత్వంలో ప్రధాన నాయకుడిగా ఎదిగాడు. ఆయన క్యూబా జాతీయ బ్యాంకు అధ్యక్షుడిగా, తరువాత పరిశ్రమల మంత్రిగా బాధ్యతలు చేపట్టాడు. క్యూబాను సామాజిక సమానత్వం, ఆర్థిక స్వావలంబన దిశగా తీసుకెళ్లడానికి పలు సంస్కరణలు అమలు చేశాడు. అక్షరాస్యత ఉద్యమాన్ని నడిపించి, భూ సంస్కరణలను ప్రోత్సహించి, పేదలకు గౌరవప్రద జీవనం అందించేందుకు కృషి చేశాడు. 1959 జూలైలో ఆయన భారతదేశం సహా అనేక దేశాలను సందర్శించి సోషలిజం పట్ల అవగాహనను పెంపొందించాడు. ఆయన “నూతన మానవుడు” అనే సిద్ధాంతాన్ని ప్రతిపాదించాడు – భౌతిక సంపదల కన్నా నైతిక విలువలకు ప్రాధాన్యం ఇచ్చే సమాజం ఏర్పడాలన్నది ఆయన కల. అధికారంలో ఉన్నా ఆయన మనసు విప్లవంలోనే మునిగిపోయి ఉండేది. క్యూబా స్వాతంత్ర్యం సాధించిన తరువాత కూడా లాటిన్ అమెరికా అంతటా ప్రజల విముక్తి కోసం పోరాటం కొనసాగించాలని ఆయన నిర్ణయించు కున్నాడు. 1965లో ఆయన క్యూబాను విడిచి ఆఫ్రికాలోని కాంగోలో విప్లవ ఉద్యమానికి పూనుకున్నాడు. అయితే అక్కడి పరిస్థితులు అనుకూలంగా లేక ఆ యత్నం విఫలమైంది. అయినప్పటికీ ఆయన వెనుదిరగ లేదు. 1966లో ఆయన రహస్యంగా బొలీవియాకు వెళ్లి అక్కడ గెరిల్లా యుద్ధం ప్రారంభించాడు. బొలీవియాలో పీడిత రైతులను చైతన్య పరిచి కొత్త విప్లవాన్ని సృష్టించాలని ప్రయత్నించాడు. కాని స్థానిక మద్దతు లభించక పోవడంతో యుద్ధం కష్టాల్లో పడింది. చివరికి అమెరికా సిఐఎ మద్దతు పొందిన బొలీవియన్ సైన్యం చేత ఆయన 1967 అక్టోబర్ 8న పట్టుబడ్డాడు. అక్టోబర్ 9న లా హిగురా అనే గ్రామంలో ఆయన్ని కాల్చిచంపారు. మరణం ఆయన ఆలోచనలను చంపలేదుబీ విప్లవానికి కొత్త జీవం పోశింది. ఆయన చివరి మాటలు – “నేను చనిపోతున్నాను, కానీ విప్లవం చనిపోదు” – ప్రపంచ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయాయి. విప్లవం, మానవతా భావం, సమానత్వం ఆయన ఆత్మలో పులకరించిన మూడు మూలస్తంభాలు. “ప్రపంచంలో ఎక్కడైనా అన్యాయం జరుగుతుంటే, అది ఎక్కడైనా ఉన్న న్యాయానికి ముప్పు” అనే ఆయన మాట నేటికీ సామాజిక చైతన్యానికి మార్గదర్శకం. అలాగే “నిజమైన విప్లవకారుడు గొప్ప ప్రేమతో నిండిన మనసు కలవాడు” అనే ఆయన వాక్యం యువతకు ప్రేరణగా నిలిచింది. చే గువేరా కేవలం ఒక విప్లవ నాయకుడు కాదుబీ ఆయన ఒక ఆలోచన, ఒక స్ఫూర్తి, ఒక ఉద్యమం. ఆయన ముఖచిత్రం బెరెట్ ధరించిన, ధైర్యవంతమైన చూపుతో ఉన్న ఆ చిత్రం ప్రపంచవ్యాప్తంగా తిరుగుబాటు, ధైర్యం, సమానత్వం, న్యాయానికి చిహ్నమైంది. ఆయన జీవితాన్ని ఆధారంగా తీసుకుని రూపొందించిన The Motorcycle Diaries, Che Part One, Che Part Two వంటి సినిమాలు ఆయన సిద్ధాంతాలను ప్రపంచానికి పరిచయం చేశాయి. చే గువేరా జీవితమే విప్లవానికి పాఠశాల. ఆయన త్యాగం ప్రపంచంలోని అణగారిన, నిరుపేద, సామాజిక న్యాయం కోసం పోరాడే ప్రతి మనిషిలో శాశ్వతంగా ప్రేరణగా వెలుగుతోంది. ఆయనను బుల్లెట్లతో హతమార్చినా, ఆయన ఆలోచనలను చంపలేకపోయారు. విప్లవం ఆయన రక్తంలో రాసిన శాశ్వత గాథగా మిగిలిపోయింది. **రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...9440595494**

# జూబ్లీహిల్స్ టీడీపీ ఓటర్లు ఎవరికి జైకొడతారు?



తెలంగాణలో జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో పోటీ చేయకూడదని టీడీపీ నిర్ణయించడంతో సరికొత్త చర్చ మొదలైంది. ఈ నియోజకవర్గంలో టీడీపీ ఓటర్లు ఎటువైపు మొగ్గుచూపుతారనేది ఆసక్తికరంగా మారింది. బీఆర్ఎస్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ ఆకస్మిక మరణంతో జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక జరుగుతోంది. వచ్చేనెల 11న జరిగే ఈ ఎన్నికల్లో పోటీ చేయాలని తెలంగాణ టీడీపీ తొలుత ఉత్సాహం ప్రదర్శించింది. అయితే కేడర్ సన్నద్ధంగా లేరన్న కారణంగా ఈ ఎన్నికకు దూరంగా ఉండాలని ఏపీ ముఖ్యమంత్రి, టీడీపీ అధినేత చంద్రబాబు నిర్ణయం తీసుకున్నారు. మంగళవారం అమరావతిలో ముఖ్యమంత్రి చంద్రబాబుతో తెలంగాణ టీడీపీ నేతలు సమావేశమయ్యారు. రాష్ట్ర విభజన తర్వాత తెలంగాణలో పట్టుకోల్పోతూ వస్తున్న టీడీపీ.. మళ్లీ పుంజుకోవాలనే ఆలోచనపై పెద్దగా ఆసక్తి చూపడం లేదని తాజా నిర్ణయంతో స్పష్టమైందని వ్యాఖ్యానిస్తున్నారు. అయితే ఇప్పటికీ రాష్ట్రంలో టీడీపీకి బలమైన కేడర్ ఉంది. ఆ పార్టీ సానుభూతిపరుల ఓట్లు కొన్ని నియోజకవర్గాల్లో గెలుపోటములను ప్రభావితం చేస్తాయన్న అంచనాలు ఉన్నాయి. అయితే టీడీపీ సొంతంగా పోటీ చేసి గెలిచే పరిస్థితి లేకపోవడం, ఆ పార్టీతో పొత్తు పెట్టుకోడానికి ఇతర పార్టీలు సాహసించలేని పరిస్థితులు ఉండటంతో ఒంటరి పోటీ సరైన నిర్ణయం కాదని టీడీపీ అధినేత చంద్రబాబు డిసైడ్ అయ్యారని అంటున్నారు. ఈ నేపథ్యంలో టీడీపీ సానుభూతిపరుల ఓట్లు ఎటువైపు మళ్లుతాయనే చర్చ ప్రధానంగా జరుగుతోంది. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో టీడీపీకి బలమైన ఓటు బ్యాంకు ఉన్నట్లు గత ఎన్నికలు నిరూపిస్తున్నాయి. 2014లో జరిగిన ఎన్నికల్లో ఈ స్థానాన్ని బీజేపీ మద్దతుతో టీడీపీ గెలుచుకుంది. ఆ తర్వాత పరిణామాలతో టీడీపీ రాష్ట్రవ్యాప్తంగా బలహీనపడగా, జూబ్లీహిల్స్ నుంచి గెలిచిన ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ బీఆర్ఎస్ లో చేరిపోయారు. ఇక 2018, 2023 ఎన్నికల్లో ఆయన బీఆర్ఎస్ తరఫున పోటీ చేసి గెలిచారు. అయితే మాగంటి గోపీనాథ్ మూడుసార్లు ఈ నియోజకవర్గం నుంచి గెలవడానికి టీడీపీ సానుభూతిపరుల ఓట్లు, కమ్మ సామాజికవర్గం మద్దతు కీలకంగా చెబుతున్నారు. టీడీపీకి వెన్నుదన్నుగా నిలిచే కమ్మ సామాజికవర్గం ఈ నియోజకవర్గంలో ప్రభావం చూపే సంఖ్యలో ఉండటంతో వీరి ఓట్లు ఇప్పుడు నిర్ణయాత్మకశక్తిగా మారే అవకాశం ఉందంటున్నారు. టీడీపీ పోటీ చేయకపోవడం, తమ అభిమాన నేత మాగంటి గోపీనాథ్ మరణంతో వారి ఓట్లు ఎటు మళ్లుతాయనేది ఇప్పుడు చర్చనీయాంశమవుతోంది. మాగంటి భార్య సునీత బీఆర్ఎస్ అభ్యర్థిగడా పోటీ చేస్తుండటంతో సానుభూతితో ఆమెకు మద్దతుగా నిలుస్తారా? లేక ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై ఉన్న సానుకూలతతో అటువైపు మొగ్గుతారా? అన్న సందిగ్ధత నెలకొంది. ఏపీలో బీజేపీతో పొత్తు ఉండటం వల్ల చివరి నిమిషంలో బీజేపీ అభ్యర్థికి పార్టీ మద్దతు ప్రకటిస్తే అటు వైపు నిలిచే అవకాశం ఉందా? అన్న చర్చ జరుగుతోంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఇప్పటిలానే టీడీపీ పోటీకి దూరంగా ఉండిపోయింది. ఎన్నికల ప్రచారంలో ఎక్కడా కనిపించని ఆ పార్టీ జెండాలు.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజయోత్సవంలో రెపరెపలాడాయి. జూబ్లీహిల్స్ లో రేవంత్ రెడ్డి నివాసం నుంచి గాంధీభవన్ వరకు జరిగిన ర్యాలీలో కాంగ్రెస్ జెండాలతోపాటు టీడీపీ పతాకం రెపరెపలాడింది. దీంతో ఈ ఎన్నికల్లో టీడీపీ ఓటర్లు ఎటువైపు అన్న ప్రశ్న అందరినీ తొలిచేస్తోంది.

# పల్లె ప్రాంతాల పండుగ అట్ల తద్ది



ఆంధ్ర దేశ విశిష్ట సాంప్రదా యాల్లో ‘అట్లతద్ది‘ జరుపు కోవడం ఒకటి. మనం జరుపు కునే అట్లతద్ది పండుగ ఉత్తర భారత దేశ స్త్రీలు చేసుకునే ‘కార్వా చౌత్‘ వేడుకతో సమానం. రోమ్ లో కూడా ఇలాంటి ఆచారం ఉంది. జనవరి 20, 21వ తేదీన వచ్చే ‘సెయింట్ ఆగ్నెస్ ఈవ్’ మన అట్లతద్ది పండుగ లాగే ఉంటుంది. పార్వతీదేవి (గౌరీ) శివుని భర్తగా పొందాలని కోరు కోగా, నారదముని విషయం తెల్సుకుని వచ్చి ఆమె కోరిక ఫలించడానికి “అట్లతద్ది వ్రతం” చేయ మని చెప్తాడు. పార్వతీ దేవి ఈ అట్లతద్ది వ్రతం చేసి మహాదేవుని భర్తగా పొందు తుంది. పార్వతిదేవి తొలుత చేసిన విశిష్టమైన వ్రతమే ఈ అట్లతద్ది. స్త్రీలు సౌభాగ్యం కోసం చేసుకొనే వ్రతం. తెలుగునాట మహిళలకే ప్రత్యేకమైన పండు గల్లో ‘అట్ల తద్ది’ ఒకటి. వివాహి తలు సౌభాగ్యాన్నీ, పెళ్ళి కావలసిన అమ్మాయిలు మంచి వరుడినీ ఆశిస్తూ చేసుకొనే వేడుక ఇది. ఆడవాళ్ళు తమ భర్తలు ఆయురా రోగ్యాలతో పదికాలాల పాటు సుఖంగా, సంతోషంగా ఉండాలని కోరుకుంటూ అట్లతద్ది జరుపు కుంటారు. పశ్చిమ దేశాల ప్రభావం తో ‘అట్లతద్ది’ లాంటి సంప్రదాయ పండుగలు జరుపుకునే ఆచారం సన్నగిల్లు తున్నప్పటికీ ఇంకా ఈ సంప్ర దాయం మరుగున పడలేదు. ఇప్పటికీ చాలామంది పెళ్ళ యిన స్త్రీలు ‘అట్లతద్ది’ జరుపు కుంటున్నారు. అట్ల తదియ లేక అట్లతద్ది పల్లె ప్రాంతాల తెలుగు వారి పండుగ. ఇది ఆశ్వయుజ బహుళ తదియ నాడు చేసు కుంటాం. పల్లె ప్రాంతాల్లో తెలుగింటి ఆడపడుచు లంతా తెల్లవారు ఝామున లేచి శుభ్రంగా తల స్నానం చేసి ఉపవాసంతో ఇంటిలో తూర్పున మంటపాన్నీ ఏర్పరచి గౌరీదేవిని ప్రతిష్టిస్తారు. ముందుగా వినాయకుని పూజించి, ఆయన తల్లి ఐన గౌరీదేవిని స్తుతించి, పాటలు పాడుతారు. సాయంత్రం వరకూ ఉపవాసం ఉండి, ఆకాశంలో చంద్రోదయ మయ్యాక మరలా గౌరీమాతను పూజించి,’ త్రిదశ పరివృతాం సేవితాం సిద్ధికామైః’ – అంటూ స్త్రీలంతా అట్లను అమ్మవారికి నైవేద్యంగా సమర్పించి ప్రార్థిస్తారు. పదిమంది ముత్తైదు వులకు బొట్టు, కాటుక ఇచ్చి, పాదాలకు పసుపు రాచి, ఒక్కోరికీ 11 అట్లు, 11 పండ్లు వాయనంగా ఇస్తారు. “ఇస్తినమ్మ వాయనం”, అంటూ చీరకొంగుతో పళ్ళెం పట్టుకుని ముత్తైదువుకు ఇస్తూ అంటారు, ముత్తైదువ “పుచ్చుకుంటినమ్మ వాయనం” అంటుంది. ఇలా మూడు మార్లు అన్నాక “ నా వాయనం పుచ్చుకునే దెవరూ” అని అంటే ఆ ముత్తైదువ “ నేనే గౌరీదేవిని, కోరిన కోరికలన్నీ తీరుస్తాను” అంటుండగా ఆమెకు నమస్కరించి, అక్షతలు శిరస్సున వేయించుకుని, అట్లతద్ది నోము కథ చెప్పు కుంటారు. పది పువ్వుల ముడితో తోరం కట్టుకుంటారు. చిన్న అమ్మాయిలు, కన్నె పిల్లలంతా సూర్యోదయానికి ముందే స్నానాలు చేసి చద్దన్నం, గోంగూర పచ్చడి, నువ్వుల పొడి, గడ్డ పెరుగుతో కడుపు నిండా తిని తాంబూలం వేసుకుని చేతులూ, కాళ్ల మాదిరి గానే నోరును కూడా ఎర్రగా పండించు కుంటారు. ఆ తరువాత తిన్నది జీర్ణమయ్యే దాకా ఆట లాడుతూ, తోటల్లో చెట్లకు వేసుకున్న ఊయ్యాలలు ఊగుతూ’ ‘అట్లతద్దోయ్ ఆరట్లోయ్ – ముద్ద పప్పోయ్ మూడట్లోయ్’ అంటూ పాటలు పాడుతూ ఆనందంగా గడుపుతారు. కొందరు అవకా శాన్ని బట్టి ముత్తైదువులకు నల్లపూసలు, లక్కకోళ్ళు, రవిక గుడ్డలు, దక్షిణ తాంబూలాలు ఇచ్చి భోజనాలు పెట్టిన తర్వాత తామూ భోజనము చేస్తారు. ఈపండుగలో విశేష మేమంటే 11 రకాల పళ్లు తినడం,11 సార్లు తాంబూలం వేసుకోడం,11 సార్లు ఉయ్యాల ఊగడం, గోరింటాకు పెట్టు కోవడం, ముఖ్య ఘట్టాలు. దీన్ని ‘ఉయ్యాల పండగ’ అనీ, ‘గోరింటాకు పండగ’ అనీ కూడా అంటారు. ఈ పండగ చేయడం వలన గౌరీదేవి అనుగ్రహంతో పెళ్ళి కాని అమ్మాయిలకు మంచి సుగుణాలు కలిగిన వ్యక్తి భర్తగా వస్తాడనీ, పెళ్ళైన వారికి పిల్లలు కలుగుతారని, ముత్తైదు తనం జీవితాంతం ఉంటుందనీ, పుణ్యం వస్తుందనీ విశ్వాసం. కన్నె పిల్లలంతా ఆడ పడుచు లకు బంధు వులకు ఇరుగు పొరుగులకు వాయినాలిస్తారు. సాయకాలం గోపూజ చేస్తారు. చెరువులో కానీ కాలువలలో కానీ నదుల్లో కానీ దీపాలను వదుల్తారు. ముందు రోజు రాత్రే అరచేతులకు గోరింటాకు పెట్టుకుని, ఉదయాన్నే బాగా పండిందాని చూసు కుంటారు. ముందు రోజు నుంచే పండుగ హడావిడి మొదలవు తుంది. ఒక్క గోరింట చెట్టుకూ ఆకులు మిగలకుండా కోసుకుని రోట్లో వేసి రుబ్బుకుంటారు. అన్నిట్లోనూ పోటీలే. ఇలా గోరింటాకు పెట్టుకోడంలో ఆరోగ్య సూత్రం కూడా ఉంది. పూర్వం మహిళలు పని చేసేప్పుడు ఎక్కువగా నీటిలో చేతులు, కాళ్ళు తడిసేవి. ఇలా గోరింటాకు పెట్టుకోడం వలన గోరింటలోని వ్యాధి నిరోధక శక్తివలన శరీరం చల్లబడి వివిధ రకాల క్రిముల వలన వేళ్ళకు, గోళ్ళకు, అరికాళ్ళకు కలిగే సమస్యల నుండి రక్షణ లభిస్తుంది. గోళ్ళు పుచ్చవు. ఇది స్త్రీలు సౌభాగ్యం కోసం చేసుకునే వ్రతంగా చెప్తారు. వివాహం కాని అమ్మాయిలు పూర్వం గ్రామాల్లో తప్పనిసరిగా మంచి భర్తకోసం ఈవ్రతాన్ని చేసేవారు. ఈవ్రతంలో చంద్రారాధన ప్రధానమైన పూజ. చంద్రకళల్లో కొలువై వున్న శక్తి అనుగ్రహం చేత స్త్రీసౌభాగ్యము పెరుగుతుంది. కుటుంబములో సుఖ శాంతులు స్థిరంగా ఉంటాయి. ఈ పండగలో అమ్మవారికి అట్లు నైవేద్యముగా పెట్టడములో ఒక అంతర్థాం కూడా ఉంది. నవగ్రహాల లోని కుజునికి అట్లంటే మహా ప్రీతి! అట్లను ఆయనకు నైవేద్యముగా పెడితే కుజదోష పరిహారమై సంసార సుఖములో ఎటువంటి అడ్డంకులు రావన్న విశ్వాసం. రజోదయమునకు కారకుడు కనుక ఋతుచక్రం సరిగా వుంచి ఋతు సమస్యలు రానివ్వకుండా కాపాడుతాడు. అందువలన గర్భ ధారణలో ఎటువంటి సమస్యలు ఎదురవ్వవు. మినప్పిండి, బియ్యప్పిండి కలిపి అట్లను తయారు చేస్తారు. మినుములు రాహువునకు, బియ్యము చంద్రునకు ఇష్టమైన ధాన్యాలు. గర్భ దోషాలు తొలగి పోవాలం టే ఈ అట్లనే వాయనముగా ఇవ్వాలి. గర్భస్రావము రాకుం డా, సుఖ ప్రసవం అయ్యేందుకు కూడా ఈ అట్లదానం దోహద పడుతుందని అంటారు. ముత్తైదువులకు అట్లను వాయనముగా ఇవ్వటం, వారి పాదాలు పట్టుకుని పసుపు రాయటం, గౌరవించడం వంటి పనుల వలన దానగుణం పెంచడంతో పాటుగా సమా నత్వం , స్వార్ధ రాహిత్యం కూడా పెరుగుతాయి. అట్లతద్ది లోని ‘అట్ల’కు ఇంతటి వైద్య విజ్ఞానం నిక్షిప్తం చేయబడి వుంది.

**రామ కిష్టయ్య సంగన భట్ల... 9440595494**

# పిల్లల అందం బాధ్యత తండ్రిదే.. పరిశోధనలు ఏం చెబుతున్నాయంటే?


మానవుని జననం వెనుక ఎంతో సైన్స్ దాగి ఉంటుంది. మనిషి పుట్టుక మొదలు.. చచ్చే వరకూ కూడా సైన్స్ తో ముడిపడి ఉంటుందన్న విషయం ప్రతి ఒక్కరికి తెలిసిందే ముఖ్యంగా ఒక ఆరోగ్యకరమైన శుక్రకణం.. ఒక అండంతో కలిసి ఫలదీకరణం పొందితే.. పిండంగా మారి..అది తొమ్మిది నెలల్లో పూర్తిస్థాయిలో ఒక బిడ్డగా రూపాంతరం చెందుతుంది. ఇదే క్రమంలో కడుపులో పెరుగుతున్న బిడ్డ తండ్రి నుంచి ఒక సెట్ జన్యువులను, తల్లి నుంచి ఒక సెట్ జన్యువులను పొందుతుంది.. అందుకే కొంతమంది కుటుంబ సభ్యులు చాలా వరకు ఒకే విధంగా కనిపిస్తారు. కొంతమందికి అమ్మమ్మగారింటి పోలికలు ఉంటే. మరి కొంతమందికి నాన్నగారి ఇంటి పోలికలు ఎక్కువగా వస్తాయి. తల్లి నుంచి, తండ్రి నుంచి పోలికలను పొంది బేబీ జన్మిస్తారు. అలాంటి ఈ సమయంలో బిడ్డ పుట్టిన వెంటనే ఎవరి పోలికలు వచ్చాయి అనేది చాలామంది చెక్ చేసుకుంటూ ఉంటారు.. ముఖ్యంగా బిడ్డ అందంగా కనిపిస్తే చాలు తల్లి పోలికలే వచ్చాయని మురిసిపోతూ ఉంటారు. కానీ నిజానికి పిల్లలు శారీరక సౌందర్యాన్ని, ఆకర్షణీయమైన లక్షణాలను తండ్రుల



నుంచే పొందుతారని పరిశోధకులు కనుగొన్నారు. ఇందులో ముఖ్యంగా ముఖ సౌష్ఠవం, ఎముకల నిర్మాణం, బలమైన దవడ గీతలు, కళ్ళ మధ్య దూరం వంటి లక్షణాలు పూర్తిగా తండ్రి జన్యువుల నుంచే సంక్రమిస్తాయట. ముఖ్యంగా పిల్లలు అందంగా కనిపిస్తున్నారంటే అందులో తండ్రి పాత్రే కీలకమని పరిశోధనలో తెలియజేశారు. అయితే ఈ పరిశోధన గురించి ప్రస్తుతం సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవ్వడంతో చాలామంది ఆశ్చర్యపోతున్నారు. ముఖ్యంగా చెప్పుకోవాలంటే చాలామంది తల్లి నుంచే అందమైన పోలికలు వస్తాయని అనుకునేవారు. కానీ ఇవి తండ్రి నుంచి వస్తాయని పరిశోధకులు తేల్చేయడంతో తల్లులు కూడా ఆశ్చర్యపోతున్నారు. ఇందులో మరో విషయం చెప్పాలంటే తల్లి నుంచి కేవలం ఎక్స్ క్రోమోజోమ్ మాత్రమే వస్తుందని, శిశువు ఆడ, మగ అనేది నిర్ధారణ అయ్యేది కూడా తండ్రి నుంచే సంక్రమిస్తుందనేది చాలామంది అర్థం చేసుకోరు. ప్రస్తుతం ఎంత టెక్నాలజీ వచ్చినా ఇప్పటికీ ఆడపిల్లలు జన్మించే ఇండ్లలో ఆడవాళ్ళనే నిందిస్తూ.. నీ వల్లే మా ఇంట్లో ఆడసంతానం వచ్చిందని మహిళలను వేధించే సందర్భాలు అనేకం ఉంటాయి. సైన్సు ప్రకారం చూస్తే.. మాత్రం తల్లి గర్భంలో పెరుగుతున్న బేబీ ఆడ,మగా అనేది మగవాళ్ళ నుండి వచ్చే క్రోమోజోమ్ పైనే ఆధారపడి ఉంటుందని తెలుసుకోవాలి. ఇక తాజాగా పరిశోధకులు చేసిన సర్వే ప్రకారం చూస్తే.. కేవలం లింగ నిర్ధారణ కాకుండా అందం ఇతర శరీర సౌష్టవం తండ్రి నుంచే ఎక్కువగా సంక్రమిస్తుందని తెలిపారు. దీన్ని అర్థం చేసుకొని అయినా ఆడపిల్లలను నిందించడం మానేయాలని నిపుణులు తెలియజేస్తున్నారు.

# వెండి పెట్టుబడిదారులకు శుభవార్త.. ఏకంగా 400% పెరిగే ఛాన్స్!

గత కొన్ని రోజులుగా బంగారం ధరలు ఎక్స్ ప్రెస్ లా పరిగెడుతుంటే.. దాని వెంటే వెండి కూడా పరిగెత్తడం అందరినీ ఆశ్చర్యానికి గురిచేస్తోంది. ఒకప్పుడు కేజీ వెండి అంటే సుమారుగా 80 వేల లోపే ఉండేది. కానీ ఇప్పుడు ఏకంగా 1,67 వేలకు చేరింది.. దీని బట్టి చూస్తే వెండి ధరలు కూడా ఏ రేంజ్ లో ఆకాశాన్ని అంటుతున్నాయో అర్థం చేసుకోవచ్చు. ఈ పెరుగుతున్న ధరల వల్ల ప్రజలు ఇబ్బందులు పడినా.. పెట్టబడిదారులకు మాత్రం శుభవార్త అనే చెప్పాలి. ముఖ్యంగా సేఫ్ పెట్టుబడి కోసం ప్రయత్నించే వారికి బంగారంతో పాటు వెండి ధరల పెరుగుదల చక్కటి శుభవార్తను కలిగించింది అని చెప్పాలి. ఇదిలా ఉండగా.. ఇప్పుడు తాజాగా అందుతున్న సమాచారం ప్రకారం.. వెండి పై పెట్టుబడి పెట్టాలనుకునే వారికి ఇదే చక్కని సమయం అని నిపుణులు చెబుతున్నారు. మరి నిపుణుల అంచనాల మేరకు భవిష్యత్తులో వెండి ధరలు పెరిగే అవకాశం ఉంది అని తెలుస్తోంది. అయితే ఈ పెరిగే ధరలు ఏ మేరా పెరగనున్నాయి? అసలు నిపుణులు ఏం చెబుతున్నారు అనే విషయం ఇప్పుడు చూద్దాం.. విషయంలోకి వెళ్తే.. “రిచ్ డాడ్ పూర్ డాడ్” రచయిత రాబర్ట్ కియోసాకి వెండి ధరలపై ఆసక్తికర వ్యాఖ్యలు




చేశారు. “ప్రస్తుతం వెండి ధరలు తక్కువగానే ఉన్నాయి . గత 12 నెలల్లో వెండి ధర 45% మాత్రమే పెరిగింది. కానీ మునుముందు 400% పెరగవచ్చు. అంటే వెండిపై పెట్టుబడులు పెడితే %వి%100 ఏడాదిలో %వి%500 పెరుగొచ్చు” అని అంచనా వేశారు.. దీంతో వెండి ధర కేజీకి రూ.5,00,000 దాటనుంది అనే చర్చ మొదలయ్యింది. ఇకపోతే అధిక ద్రవ్యోల్బణం, ఆర్థిక అనిశ్చితిలో మార్పులు.. ఇన్వెస్టర్స్ కూడా బంగారం, వెండి వైపు మొగ్గు చూపుతున్నారు. ఏది ఏమైనా బంగారంతో పాటు వెండి ధరలలో కూడా ఈ రకమైన మార్పులు పెట్టుబడిదారికి మంచి ఆనందాన్ని కలిగిస్తున్నాయి. ఒకవేళ మీరు కూడా సేఫ్ పెట్టుబడి కోసం ఆలోచన చేస్తున్నట్లయితే.. ఇలా వెండిపై పెట్టుబడి పెట్టడం మంచిదని నిపుణులు కూడా చెబుతున్నారు. ఇకపోతే వెండి ధరలు కూడా ఈ రేంజ్ లో పెరగడానికి కారణం పారిశ్రామిక డిమాండ్, పెట్టుబడిదారుల కొనుగోలు వంటి అంశాలు కారణమని నివేదికలు సూచిస్తున్నాయి. మార్కెట్లో ప్రస్తుతం వెండి కొరత ఏర్పడుతోంది. అటు పారిశ్రామిక అవసరాలకు వెండి డిమాండ్ పెరుగుతోంది. అంతేకాదు పెట్టుబడిదారులు కూడా వెండిని కొనుగోలు చేయడం వల్ల ధరలు పెరిగిపోతున్నాయి. అమెరికా ఫెడరల్ రిజర్వ్ తీసుకునే నిర్ణయాలు కూడా వెండి ధరలపై ప్రభావం చూపుతున్నట్లు సమాచారం.

చురకలు

## సంపాదకీయం

# పాతికేళ్ళ మోడీ...ఎవర్ గ్రీన్

అదేంటి నరేంద్ర మోడీకి పాతికేళ్ళ అని ఆశ్చర్యపోనవసరం లేదు. మోడీ వయసు అచ్చంగా మూడు పాతికలే. అంటే డెబ్బై అయిదేళ్లు. ఆయన ఈ మధ్యనే తన 75 ఏళ్ళ పుట్టిన రోజు వేడుకను ఎంతో ఉత్సాహంగా జరుపుకున్నారు. మరి ఈ పాతికేళ్ళు దేనికి సంకేతం అంటే అక్కడే ఉంది అసలు విషయం. మోడీ ప్రజా జీవితంలోకి అడుగు పెట్టి కీలకమైన ముఖ్యమంత్రి ప్రధాని వంటి పదవులు అలుపు ఎరగకుండా అవిశ్రాంతంగా నిర్వహిస్తూ పాతిక ఏళ్ళ మైలు రాయి వద్ద నిలిచారు. అందుకే మోడీ ఎవర్ గ్రీన్ అని చెప్పాల్సి వస్తోంది.

**ఎమ్మెల్యే కూడా కాకుండానే :** ఇదిలా ఉంటే నరేంద్ర మోడీ సరిగ్గా పాతికేళ్ళ క్రితం అంటే 2001 అక్టోబర్ 7న గుజరాత్ కి ముఖ్యమంత్రి అయ్యారు. అది అనూహ్యంగా జరిగిన పరిణామం. ఆనాటికి మోడీ ఎమ్మెల్యే కూడా కారు. అంతే కాదు ఆయన అంతకు ముందు ఎన్నడూ ఎన్నికల్లో పోటీ కూడా చేయలేదు. చట్ట సభలకు వెళ్ళలేదు. మంత్రిగా పనిచేసిన అనుభవం కూడా అంతకంటే లేదు. కానీ ఏకంగా గుజరాత్ లాంటి స్టేట్ కి సీఎం అయిపోయారు. అలా నెగ్గిన తరువాత రాజ్ కోట్ అసెంబ్లీ ఉప ఎన్నికల్లో గెలిచి ఎమ్మెల్యే అయ్యారు. అలా ఎవరికీ లేని విధంగా మొదలైన మోడీ రాజకీయ జీవితం పాతికేళ్లలో ఎన్నో మలుపులు తిరిగింది అని చెప్పాల్సిందే. గుజరాత్ ముఖ్యమంత్రిగా మోడీ 2014 మే 16 వరకూ కొనసాగారు.


**దేశ ప్రధానిగా :** ఇక మోడీ దేశానికే ప్రధాని అయ్యారు. ఆయన 2014 మే 16 నుంచి ఈ రోజు దాకా మొత్తం మూడు సార్లు ప్రధానిగా ప్రమాణం చేసి కొనసాగుతున్నారు. మూడు టెర్ములుగా ఆయన ప్రధానిగా ఉంటూ వచ్చినా ఎక్కడా దూకుడు అయితే తగ్గలేదు. అంతే కాదు ఆయన 2029 దాకా ఈ పదవిలో కొనసాగబోతున్నారు. ఇలా పాతికేళ్ళ తన ఉన్నత స్థాయి పదవుల జీవితంలో మోడీ ఎక్కడా అలసిపోలేదని చెబుతారు. ఆయన ఏ ఒక్క రోజూ సెలవు కూడా పెట్టలేదు. 2022లో తన తల్లి మరణించినపుడు కూడా ఆయన విధులలో పాల్గొనడం బట్టి చూస్తే మోడీ పనితీరు అర్థం అవుతుంది అంటారు.

**థాంక్స్ టూ నేషన్ :** తన పాతికేళ్ళ ప్రస్థానం మీద మోడీ సోషల్ మీడియా ద్వారా హర్షం వ్యక్తం చేశారు. ఆయన దేశ ప్రజలకే ధన్యవాదాలు తెలిపారు. తనకు ఇంతటి అవకాశం ఇచ్చినందుకు ధన్యుడిని అన్నారు. గుజరాత్ ముఖ్యమంత్రిగా తొలిసారి ప్రమాణం చేసినప్పటి నుంచి ప్రధానమంత్రిగా ఈ రోజు వరకూ తన సుదీర్ఘమైన ప్రయాణాన్ని ఆయన జనాలతో పంచుకున్నారు.

**డెబ్బై అయిదులో ఇరవై అయిదు :** మొత్తం మీద చూస్తే నరేంద్ర మోడీ రాజకీయ జీవితం చిత్రంగా తోస్తుంది. డెబ్బై అయిదు లో ఇరవై అయిదు ఏళ్ళు ముఖ్యమంత్రిగా ప్రధానిగా కొనసాగుతూ నాటౌట్ అంటూ దూకుడు చేయడం ఏ ఇతర రాజకీయ నాయకునికీ సాధ్యపడదు అనే చెప్పాల్సి ఉంది. అంతే కాదు మోడీ యాభై ఏళ్ళకు ఎమ్మెల్యే అయ్యారు. అదే సమయంలో ముఖ్యమంత్రిగా ఉన్నారు. అంటే సగం జీవితం అయ్యాక ఆయన పొలిటికల్ ఇన్నింగ్స్ ప్రారంభించినా అన్నీ సక్సెస్ లే అన్నీ సిక్సర్లే అంటే మోడీ పొలిటికల్ లైఫ్ కానీ ఆ గ్రాఫ్ కానీ ఎవరికీ రావు అంటే అది అతిశయోక్తి కాదేమో అనిపిస్తుంది. దటీజ్ మోడీ అనాలనిపిస్తుంది.

# “తోకలేని పిట్ట తొంభై ఆమడలు దూరం” - అక్టోబర్ 9... ప్రపంచ తపాలా దినోత్సవం

“ తోకలేని పిట్ట తొంభై ఆమడలు దూరం పోతుంది” అన్న సామెతను అక్షరాలా నిజం చేస్తూ అతి తక్కువ ధరకే సేవలందిస్తున్న తపాలాకు, గ్రామీణ ప్రజలకు మధ్య అనుబంధం శతాబ్దాల నాటిది. ఐక్యరాజ్య సమితి చేపట్టిన తీర్మానాన్ని అనుసరించి ప్రతి సంవత్సరం అక్టోబర్ 9వ తేదీని అంతర్జాతీయ తపాలా దినోత్సవంగా జరుపుకోవడం ఆనవాయితీగా వస్తున్నది. చరిత్రను తిరిగి చూస్తే లోకి “మెసెంజర్ల” రూపంలో తపాలా సర్వీసులుండేవి. వీళ్లు నడిచి లేదా గుర్రాల మీద వెళ్లి రాత ప్రతుల్ని అటూ ఇటూ చేర వేసేవారు. 1600 – 1700 సంవత్సరాలలో అనేక దేశాల వారు జాతీయ తపాలా వ్యవస్థలను నెలకొల్పుకొని ఆయా దేశాల నడుమ తపాలా సౌకర్యాల్ని అందించు కునేందుకు “ద్వైపాక్షిక ఒప్పందాలు” చేసుకున్నారు. 1800 సంవత్సరం నాటికి ఇలా ద్వైపాక్షిక ఒప్పందాలు చేసుకున్నవారు. భారీగా తేలారు. దీంతో అంతర్జాతీయ తపాలా పంపిణీ క్లిష్టంగా, అసంపూర్తిగా, అసమర్థ వంతంగా మారి పోయింది. అమెరికాకు చెందిన పోస్ట్ మాస్టర్ జనరల్ మాంట్ గోమెరి బ్లెయిర్ 1863 లో 15 యూరోపియన్ దేశాలు, అమెరికన్ దేశాల ప్రతినిధులతో ఓ సమావేశాన్ని ఏర్పాటు చేసాడు . ఈ సదస్సులో అంతర్జాతీయ పోస్టల్ సర్వీసులపై పరస్పర ఒప్పందాల కోసం ప్రతినిధులు అనేక సాధారణ సూత్రాలను వెల్లడించారు. కాని ఒక అంతర్జాతీయ ఒప్పందం మాత్రం కుదరలేదు. 1874 లో నార్త్ జర్మన్ కాన్ ఫెడరేషన్‌కు చెందిన ఓ సీనియర్ పోస్టల్ అధికారి హెయిన్ రిచ్ బనీ స్టీఫెన్ స్విట్జర్లాండ్ లోని బెర్నెలో 22 దేశాల ప్రతినిధులతో ఒక సదస్సు ఏర్పాటు చేశాడు. ఆ ఏడాది అక్టోబరు తొమ్మిదో తేదీన ప్రతినిధులు “బెర్నె ఒప్పందం”పై సంతకాలు చేసి జనరల్ పోస్టల్ యూనియన్‌ను నెలకొల్పారు. ఈ యూనియన్ లో సభ్య దేశాలు క్రమంగా పెరుగుతూ వచ్చాయి. యూనియన్ పేరు 1878 లో “యూనివర్షల్ పోస్టల్ యూనియన్” గా మారింది. ఇది 1948 లో ఐక్య రాజ్య సమితికి ప్రత్యేక ఏజెన్సీగా రూపాంతరం చెందింది. 1969 లో అక్టోబరు 1 నుంచి నవంబరు 16 వ తేదీ వరకు జపాన్ టోక్యో లో 16 వ యూనివర్షల్ పోస్టల్ యూనియన్ కాంగ్రెస్ ను నిర్వహించారు. ఈ కాన్ఫరెన్సులో ప్రతినిధులు అక్టోబరు 9 వ తేదీన “వరల్డ్ పోస్టల్ డే” ని నిర్వహించాలని తీర్మానించారు. అప్పటి నుండి, తపాలా సేవల యొక్క అవసరాన్ని గుర్తిస్తూ ప్రపంచవ్యాప్తంగా ప్రతి సంవత్సరం అక్టోబరు 9 న ఈ ప్రపంచ తపాలా దినోత్సవమును జరుపు కుంటున్నారు. “దినాదినాభివృద్ధి చెంది, రోజువారీ ప్రజల జీవితాలు మరియు వ్యాపారాలలో తపాలాశాఖ పోషించే పాత్రను గూర్చి ప్రజల్లో అవగాహనను రేకెత్తించడం మరియు దేశాల ఆర్థిక, సామాజిక అభివృద్ధిలో తపాలా శాఖ ఔన్నత్యాన్ని తెల్పడం కోసం ఈ రోజును జరుపు కుంటారు. ఒక చిన్న పాయగా మొదలైన తపాలా విధానం తరువాత అన్ని దేశాలకు వేగంగా పాకి పోయింది. 1800 నాటికి ప్రపంచ తపాలా వ్యవస్థ ఏర్పడింది. కాగా 1837లో మన దేశంలో తపాలా వ్యవస్థ ప్రారంభమైంది. “భారత తపాలా శాఖ”ను అప్పటి బ్రిటీష్ ప్రభుత్వం



అక్టోబర్ 1,1854న ఏర్పాటు చేసింది. తపాలా బిళ్ళ (పోస్టల్ స్టాంప్) అప్పటి సింధ్ (ఇప్పటి పాకిస్తాన్) ప్రాంతంలో తొలుత వాడుకలోకి వచ్చింది. పోస్టల్ వ్యవస్థ సక్రమంగా ఏర్పాటు కాకముందే భారత్‌లో మొదటిసారి “వారెన్ హేస్టింగ్స్” కోల్‌కత కార్యాలయంలో 1774లో “మొదట తపాలా కార్యాలయాన్ని” తెరిచారు. ప్రపంచం లోని తపాలా శాఖలన్నింటిలో భారత తపాలా రారాజు లాంటిది. భారత దేశంలో మార్చి 31,2015 నాటికి 1,54,939 తపాలా కార్యాలయాలు ఉన్నాయి. ఇందులో 1,39,222(89.86%) గ్రామీణ ప్రాంతాల్లో ఉన్నాయి. దేశానికి స్వాతంత్రం వచ్చినప్పుడు ఉన్న తపాలా కార్యాలయాలు 23,344 మాత్రమే. చిన్ననాటి నుండి పాఠశాల రోజుల్లో రాసిన హెడ్‌మాస్టర్‌కు సెలవు చీటీ నుంచి కాలేజీ రోజుల్లో ఖర్చుల కోసం తల్లిదండ్రులకు రాసే ఉత్తరం, స్నేహితులతో సత్సంబంధాలు పాదు కొల్పేందుకు, అనంతరం జీవితానికో అర్థం తెచ్చి పెట్టే ఉద్యోగం కోసం చేసే దరఖాస్తుకు అంటించే తపాలా బిళ్ళలు... ఇలా ఎన్నెన్నో విషయాలు జీవితాలతో ముడి వేసుకున్నాయి. ఉత్తరం అందుకోవడం, రహస్యంగా విప్పి చదువు కోవడం, ఎవరైనా వస్తుంటే దిండు కింద దాచుకోవడం ప్రేమికులకు ఖర్చులేని ఓ మధురానుభూతి. దూరంగా సైన్యంలోనో, మరో ఉద్యోగంలోనో ఉన్న భర్తో, కొడుకో ఉత్తరం రాస్తాడనీ, క్షేమ సమాచారం చెబుతాడనీ వీధి వంక చూస్తూ గడిపే కాలం ఇంకా మధురమైనది. తరతరాలుగా తమ జీవన స్రవంతిలో ఈ తపాలా ఉత్తరం పట్ల తమకు గల మమకారాన్ని చిన్నా, పెద్దా తేడా లేకుండా స్త్రీ, పురుష బేధం పాటించకుండా ప్రతి ఒక్కరూ చాటుకున్నారు. అయితే సాంకేతికత అందుబాటు లోకి రావడంతో ఉత్తరాలు రాసుకునే తరం అంతరించి పోయింది. ఇంటికి వచ్చిన ఉత్తరాలను పొడవాటి ఇనుప కమ్మీకి గుచ్చిఉంచడం. అవసర మైనపుడు మళ్లీ తీసి చదువు కోవడం రెండు మూడు దాశాబ్దాల క్రితం ప్రతి ఇంటా ఉండేది. ఆడపిల్ల చదివి ఊళ్లేలాలా%ా% ఉత్తరాలు చదువుకో గలదు చాలు అన్న కాలం కూడా అదే%ా% రోజులు మారి, కంప్యూటర్, మొబైల్ ఫోన్లు, అంతర్జాలం అందుబాటులోకి వచ్చిన నేటికాలంలో ఉత్తరాలు రాయటం దాదాపు లేదనే చెప్పాలి. ఇపుడు పోస్ట్ అంటే బ్యాంకు నుంచి, సెల్ ఫోన్ కంపెనీల నుంచీ వచ్చే పార్శల్లు, బిల్లులు, డేటా వివరాలు మాత్రమే. కానీ ఆ రోజుల్లో చాలా తక్కువ ఖర్చుతో సమాచారాలు అందేవి. వందల, వేల మైళ్లు ప్రయాణం చేసి వచ్చే ఆ తోక లేని పిట్ట కోసం ఆతృతగా ఎదురు చూసి “పోస్ట్” అన్న కేక వినగానే ఉరుకులు, పరుగులతో అందుకునే ఉత్తరాల్లో ఎన్నో విశేషాలు , అనేక కమ్మని కబుర్లు, కెరీర్ కు బాటలు... మంచి ఉత్తరం అందుకున్నప్పుడు కలిగే సంతోషం అంతా ఇంతా కాదు. అలాగే మనియార్డర్లు.. సంతోషంతో పోస్ట్ మ్యాన్ కు ఈనాం ఇచ్చే ఆనవాయితీ నెలకొని పోయింది. గతంలో సమాచార మార్పిడికి, క్షేమ సమాచారము తెలుసు కునేందుకు పోస్టు కార్డే(ఉత్తరం) ప్రధాన ఆధారం. పేదల నుండి ధనికుల వరకు ఎక్కువగా దీనిపైనే ఆధార పడేవారు. సమాచార రంగంలో రానురాను విప్లవాత్మక మార్పులు వచ్చాయి. ఉత్తరం ప్రాధాన్యం తగ్గుతున్న నేపథ్యంలో మార్పులను అంది పుచ్చుకుంటూ మనుగడను కొనసాగిస్తూనే ప్రత్యేకతను నిలబెట్టు కుంటోంది భారత తపాలశాఖ. పావురాల ద్వారా బట్వాడా నుంచి.. స్పీడు పోస్టు.. ఈ–మెయిల్ ఇలా దూసుకెళ్తున్న భారత తపాలా వ్యవస్థ అంతర్జాతీయ స్థాయిలో కీర్తిని మూట గట్టుకుంది. ఉత్తర ప్రత్యుత్తరాల వారధులుగా అశేష సేవలందిస్తున్న ఈ విభాగం ప్రస్థానం “ఇంతింత్కై వటుడింత్కై” అన్నట్లు సాగింది. ప్రయివేటు రంగం నుంచి వచ్చిన పోటీని తట్టుకొని నిలబడుతోంది. రెండో అతి పెద్ద వ్యవస్థ తపాలశాఖ గతంలో ఉత్తరాలు బట్వాడాకే పరిమితం కాగా కాలక్రమంలో అనేక సేవల్లోకి మారింది. ప్రస్తుతం దేశంలో సుమారు ఆరు లక్షల మంది తపాలా సిబ్బంది 1.10 లక్షల కార్యాలయాలతో సేవలందిస్తోంది. దేశంలో రైల్వే తర్వాత ఇదే అతి పెద్ద వ్యవస్థ. స్పీడు పోస్టు కోసం మనదేశంలో 180 కేంద్రాలున్నాయి. 100కు పైగా దేశాలకు ఈ సౌకర్యం ఉంది. ప్రపంచంలో ఏమూల నుంచ్కైనా “ఇ పోస్టు” చేస్తే క్షణాల్లో ఎంపిక చేసిన పట్టణాల్లో పోస్టుమన్ ద్వారా ఇంటికి అందుతుంది. బంగారు నాణాలు, ఫారెన్ ఎక్ఛేంజ్ కరెన్సీ మార్చుకోవడం లాంటి అనేక సౌకర్యాలు అందిస్తుంది. బిల్ మెయిల్ సర్వీసు. పెద్ద పెద్ద సంస్థలు, ఫ్యాక్టరీలు తమ సంస్థ ఆర్థిక నివేదికలు, బిల్లులు, ఇతరత్రా చేరవేత, గ్రామీణ మార్కెటింగ్ విధానంలో మార్పులకు శ్రీకారం చుట్టిన మేఘదూత్ పోస్టుకార్డు, మరో ఎక్స్‌ప్రెస్ పార్సిల్ పోస్టు..2006లో ఇన్‌స్టెంట్ మనీ ఆర్డర్ సర్వీసు ఇలా సౌకర్యాలను మెరుగు పరుస్తోంది. కాలగమనం లో వచ్చిన మార్పులు దీనిపై పెను ప్రభావం చూపాయి . సెల్ ఫోన్లూ, కంప్యూటర్లూ, ఇతర సాంకేతిక సాధనాలు అందుబాటులోకి వచ్చాక కార్డు అవసరం తగ్గి, ఇ–మెయిల్స్ చాలా వరకు ప్రస్తుతం పోస్టుకార్డు పాత్రను పోషిస్తున్నాయి. కొన్ని ప్రదేశాల్లో మాత్రం ఇప్పటికీ పోస్టుకార్డునే వినియోగిస్తున్నారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**


# స్వచ్ఛంద సేవకు సైనిక రూపం... భారత ప్రాదేశిక సైన్యం వైభవం

## దేశ రక్షణలో ప్రజల భాగస్వామ్యం... జాతీయ ప్రాదేశిక సైనిక దినోత్సవం - అక్టోబర్ 9....జాతీయ ప్రాదేశిక సైనిక దినోత్సవం



భారతదేశంలో ప్రతి సంవత్సరం అక్టోబర్ 9న జాతీయ ప్రాదేశిక సైనిక దినోత్సవాన్ని ఘనంగా జరుపు కుంటారు. ఈ రోజు దేశ రక్షణలో సాధారణ పౌరులకూ సేవ అవకాశం కల్పించిన “పౌరుల సైన్యం”గా ప్రసిద్ధి చెందిన ప్రాదేశిక సైన్యం స్థాపన దినోత్సవం. దేశం పిలుపు వస్తే ఎటువంటి ప్రతిఫలం ఆశించకుండా, తమ కుటుంబం, వృత్తి, జీవితాన్ని పక్కన పెట్టి తల్లి భూమిని కాపాడటానికి సిద్ధపడే వీర సైనికుల సమూహం ఇది. వీరి సేవలు యుద్ధ సమయాల్లో మాత్రమే కాక, శాంతి సమయాల్లో కూడా దేశ భద్రతకు, సామాజిక శ్రేయస్సుకు మూల స్తంభాలుగా నిలుస్తాయి. భారత స్వాతంత్ర్యం అనంతరం రక్షణ వ్యవస్థ పునర్నిర్మాణ దశలో ఉన్నప్పుడు, దేశ భద్రతకు కేవలం రెగ్యులర్ సైన్యం సరిపోదని, పౌరుల సహకారం కూడా అవసరమని ప్రభుత్వం నిర్ణయించింది. ఆ ఆలోచనకే రూపం ఇచ్చి 1948లో పార్లమెంటు ప్రాదేశిక సైన్యం చట్టాన్ని ఆమోదించింది. తదనంతరం 1949 అక్టోబర్ 9న అప్పటి భారత గవర్నర్ జనరల్ శ్రీ సి. రాజగోపాలాచారి ప్రాదేశిక సైన్యాన్ని అధికారికంగా ప్రారంభించారు. అప్పటి నుండి ప్రతి సంవత్సరం అక్టోబర్ 9 ఈ దినోత్సవంగా జరుపుకుంటూ భారత పౌరులలో దేశభక్తి, సేవాస్ఫూర్తి విలువలను స్మరించు కుంటున్నారు. ప్రాదేశిక సైన్యం భారత సైన్యంలో రెండవ రక్షణ శ్రేణిగా వ్యవహరిస్తుంది. ఇది పూర్తి కాల సైనిక దళం కాదుబీ ఇందులో చేరే వారు సాధారణ పౌరులే. వీరు తమ సాధారణ వృత్తులు, ఉద్యోగాలు కొనసాగిస్తూనే అవసరమయినప్పుడు సైనిక విధుల్లో పాల్గొంటారు. వీరిని “సిటిజన్ సోల్జర్స్” అని పిలుస్తారు. యుద్ధం, సరిహద్దు సంక్షోభాలు, అంతర్గత అల్లర్లు, ప్రకృతి వైపరీత్యాలు, లేదా దేశ అత్యవసర పరిస్థితులు ఎదురైనప్పుడు వీరు ముందుకు వచ్చి దేశానికి సేవలందిస్తారు. వీరి నినాదం “సావధానీ వా శూర్తా” ు అంటే “జాగ్రత్త మరియు శౌర్యం”. ఇది వీరి ధైర్యం, క్రమశిక్షణ, నిస్వార్థ సేవాస్ఫూర్తిని ప్రతిబింబిస్తుంది. ప్రాదేశిక సైన్యం ప్రధాన విధుల్లో ఒకటి రెగ్యులర్ సైన్యానికి ఉపశమనం కల్పించడం. సరిహద్దుల్లో, వ్యూహాత్మక ప్రాంతాల్లో రెగ్యులర్ సైన్యం విధులు నిర్వర్తిస్తున్నప్పుడు, వీరు ప్రత్యామ్నాయంగా కొంత భారం మోస్తారు. సహజ విపత్తుల సమయంలో పౌర పరిపాలనకు సహాయంగా, రక్షణ చర్యల్లో, పునరావాసంలో వీరి పాత్ర ఎంతో కీలకం. వరదలు, తుఫానులు, భూకంపాలు వంటి విపత్తుల సమయంలో ప్రాదేశిక సైన్యం అత్యవసర సేవలను అందించి అనేక ప్రాణాలను రక్షించింది. అదేవిధంగా పర్యావరణ పరిరక్షణలో భాగంగా ఏర్పాటు చేసిన ఎకాలజికల్ బెటాలియన్లు అటవీ పెంపకం, జల వనరుల పునరుద్ధరణ, గంగా ప్రక్షాళన వంటి పర్యావరణ ప్రాజెక్టులలో చురుకుగా పాల్గొంటున్నాయి. ప్రాదేశిక సైన్యంలో డిపార్ట్‌మెంటల్ యూనిట్లు కూడా ఉన్నాయి. రైల్వేలు, ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్, ఆయిల్ అండ్ నేచురల్ గ్యాస్ కార్పొరేషన్ వంటి కీలక సంస్థల రక్షణ, మౌలిక వసతుల పరిరక్షణలో వీరి పాత్ర ప్రధానమైనది. అదేవిధంగా ఇన్ఫెంట్రీ, ఆర్మర్డ్ రెజిమెంట్లు, ఇంజినీరింగ్ యూనిట్లు, సిగ్నల్ యూనిట్లు, మెడికల్ యూనిట్లు, ఎయిర్ డిఫెన్స్ యూనిట్ల రూపంలో వీరు దేశ వ్యాప్తంగా సేవలందిస్తున్నారు. భారతదేశం ఎదుర్కొన్న 1962 చైనా–భారత్ యుద్ధం, 1965 మరియు 1971 ఇండో–పాక్ యుద్ధాలు, 1999 కార్గిల్ యుద్ధం (ఆపరేషన్ విజయ్) వంటి ప్రతి ప్రధాన యుద్ధంలో ప్రాదేశిక సైన్యం శౌర్యాన్ని ప్రదర్శించింది. సరిహద్దుల్లో వీరు చూపిన ధైర్యం, క్రమశిక్షణ, సేవాభావం వల్ల అనేక మంది సైనికులు గల్లంట్రీ అవార్డులు, విశిష్ట సేవా పతకాలు అందుకున్నారు. ఈ విధంగా వీరు రెగ్యులర్ సైన్యానికి ఏమాత్రం తీసిపోరని నిరూపించారు. ప్రాదేశిక సైన్యంలో సభ్యులుగా పలువురు ప్రముఖులు కూడా చేరడం వీరి ప్రతిష్టను మరింత పెంచింది. భారత క్రికెటర్ ఎం.ఎస్. ధోని, మలయాళ నటుడు మోహన్‌లాల్ వంటి ప్రముఖులు గౌరవ లెఫ్టినెంట్ కల్నల్ హోదాలో సేవలు అందించారు. అంతకు ముందు క్రికెట్ దిగ్గజం కపిల్ దేవ్, కొన్ని పరిశ్రమల ప్రముఖులు, వైద్యులు, ఇంజినీర్లు కూడా ఈ దళంలో భాగమయ్యారు. వీరందరూ తమ తమ రంగాల్లో విజయవంతులైనప్పటికీ, దేశ సేవలో కూడా తమ భాగస్వామ్యాన్ని చూపడం ప్రాదేశిక సైన్యం విలువలను ప్రతిబింబిస్తుంది. ప్రతి సంవత్సరం అక్టోబర్ 9న ప్రాదేశిక సైనిక దినోత్సవం సందర్భంగా దేశవ్యాప్తంగా పలు కార్యక్రమాలు నిర్వహిస్తారు. సైనిక పరేడ్‌లు, గౌరవ వందనలు, ప్రమాణ స్వీకారాలు, పతక ప్రదానాలు, శౌర్య ప్రదర్శనలు జరుగుతాయి. రాష్ట్రపతి, రక్షణ మంత్రి, సైన్యాధికారులు ఈ సందర్భంలో ప్రాదేశిక సైనికులకు అభినందనలు తెలియజేస్తారు. దేశం కోసం తమ వృత్తులను పక్కన పెట్టి స్వచ్ఛందంగా సేవ చేస్తున్న వీర సైనికుల త్యాగం ఈ రోజున ప్రత్యేకంగా గుర్తు చేసుకుంటారు. ప్రాదేశిక సైన్యం దేశ ప్రజల్లో దేశభక్తి, క్రమశిక్షణ, సేవాస్ఫూర్తిని బలపరుస్తుంది. ఇది “దేశ సేవ ప్రతి పౌరుని బాధ్యత” అనే ఆలోచనను సమాజంలో వ్యాప్తి చేస్తుంది. కేవలం ఓటు వేయడం, పన్నులు చెల్లించడం మాత్రమే కాదు, అవసరమైతే దేశం కోసం ఆయుధం ధరించడం కూడా పౌర బాధ్యత అని ఈ సంస్థ మనకు నేర్పింది. జాతీయ ప్రాదేశిక సైనిక దినోత్సవం సందర్భంగా భారత పౌరులు దేశం కోసం తమ కర్తవ్యాన్ని ఆలోచించే అవకాశం పొందుతారు. “దేశం ముందు %–% మనం తరువాత” అనే తాత్విక వాక్యం ఈ రోజు స్ఫూర్తిగా మారుతుంది. దేశ భద్రత, ఐక్యత, అభివృద్ధికి ప్రతి పౌరుడి భాగస్వామ్యం అవసరమని గుర్తు చేసే ఈ దినోత్సవం భారతదేశపు ప్రజాస్వామ్య స్ఫూర్తికి ప్రతీక. అక్టోబర్ 9 కేవలం ఒక సైనిక దినం కాదుబీ అది దేశప్రేమ, క్రమశిక్షణ, సేవా భావాల సమ్మేళనం. ఈ రోజు మన పౌర సైనికుల ధైర్యాన్ని స్మరించుకోవడం ద్వారా ప్రతి భారతీయుడు “సేవ హి పరమో ధర్మః” అనే విలువను మరలా మనసులో నాటుకోవాలి. **రామ కిష్టయ్య సంగన భట్ల సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...9440595494**

# క్యారక్టర్ ఆర్టిస్టుగా మారిన మిస్టర్ హైదరాబాద్ - అక్టోబర్ 9... నటుడు శ్రీహరి వర్ధంతి



సినిమాల్లో “తెలంగాణ యాస”కు గొప్ప గౌరవాన్ని తీసుకువచ్చిన ప్రముఖ నటుడు శ్రీహరి. ఢీ, కింగ్, డాన్ శీను, బృందావనం, తుఫాన్ వంటి చిత్రాలలో ఆయన పలికించిన సంభాషణలు తెలంగాణ యాసలో ఉన్న సౌందర్యాన్ని ఆవిష్కరించాయి. నిజ జీవితంలో హైదరాబాదీ తెలంగాణ యాసలో ఆయన సంభాషణ అందరినీ ఆకట్టుకునేలా సాగేది. శ్రీహరి (ఆగష్టు 15, 1964 – అక్టోబరు 9, 2013) తెలుగు సినిమా నటుడు. ప్రతినాయకునిగా తెలుగు తెరకు పరిచయమై తరువాత నాయకుడిగా పదోన్నతి పొందిన నటుడు. శ్రీహరి మంచి వ్యక్తిత్వం కలిగిన నటుడు, సాయం కోసం తన దగ్గరకు వెళ్లిన వారికి లేదు అనకుండా సాయం చేసే గుణం కలిగిన మనిషి. శ్రీహరి తాత రఘుముద్రి అప్పలస్వామికి ఐదుగురు కుమారులు, నలుగురు కుమార్తెలు. శ్రీకాకుళం జిల్లా నుంచి కృష్ణా జిల్లా పెదపారుపూడి మండలం యలమర్రు గ్రామానికి వలస వచ్చారు. వీరిలో నాలుగవ కుమారుడు శ్రీహరి తండ్రి సత్యన్నారాయణ, తల్లి సత్యవతి. 1964 ఆగస్టు 15న జన్మించాడు. రోడ్డు పక్కన చిన్న పాక వేసుకొని సైకిలు షాపు, సోడాలు అమ్మి జీవనం సాగించారు. శ్రీహరికి శ్రీనివాసరావు, శ్రీధర్ అన్నదమ్ములు. శ్రీహరి ఆంధ్రప్రదేశ్ లోని కృష్ణ జిల్లా విజయవాడ సమీపంలో జన్మించారు. 1977 లో యలమర్రు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శ్రీహరి ఏడవ తరగతి ఉత్తీర్ణుడు అయినాడు. ఆయన తల్లిదండ్రులు గుడివాడకు చెందినవారు కాగా, తరువాత గ్రామంలోని అరెకరం భూమిని అమ్ముకొని హైదరాబాదుకు మకాం మార్చారు. అలా ఆయన చిన్నతనంలోనే బాలానగర్లో స్థిరపడ్డారు. స్టంట్ ఫైటర్‌గా శ్రీహరి కెరీర్‌ను ప్రారంభించాడు. ఆయన జిమ్నాస్టిక్లో అథ్లెట్ కూడా. సబ్–ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ మరియు రైల్వే ఆఫీసర్ వంటి ఉద్యోగాలు లభించాయి, కాని ఆయన నటనా వృత్తిని కొనసాగించ డానికి ఆసక్తి చూపినందున ఆయన ఆ ఆఫర్లను తిరస్కరించాడు. ఏటా యలమర్రు గంగానమ్మ జాతరకు శ్రీహరి తప్పనిసరిగా వెళ్ళేవాడు. యుక్తవయసు నుండే శారీరక ధారుడ్యంపై ఎంతో ఆసక్తి కలిగి వుండేవాడు. ఉదయం చదువుకుంటూ, సాయంత్రం శోభన థియేటర్ ఎదురుగా ఉన్న అన్న శ్రీనివాసరావు షెడ్డులో మెకానిక్ గా పనిచేస్తూ ఖాళీ దొరికిన సమయంలో సినిమాలు శోభన థియేటర్ లో చూసేవాడు. హైదరాబాద్ లో నిర్వహించిన అనేక శారీరక ధారుడ్య పోటీలలో పాల్గొని ‘మిస్టర్ హైదరాబాద్’గా ఏడుసార్లు అవార్డును సొంతం చేసుకున్నాడు. విశ్వ విద్యాలయం తరపున రెండు సార్లు జాతీయ స్థాయి పోటీలలో పాల్గొని, బహుమతులు గెలుచు కున్నాడు. ఏషియన్ గేమ్స్ లో భారతదేశం తరపున ఆడాలనే కోరిక ఉన్నా అది తీరలేదు. 1986లో సినిమాలోకి స్టంట్ మాస్టర్‌గా కెరీర్ మొదలు పెట్టిన శ్రీహరి, అంచెలంచెలుగా నటుడిగా ఎదిగారు. 1989లో తమిళ సినిమా మా పిళ్ళై, తెలుగు ‘ధర్మక్షేత్రం’ చిత్రం ద్వారా సినీ రంగ ప్రవేశం చేసిన ఆయన విలన్‌గా, క్యారెక్టర్ ఆర్టిస్టుగా, హీరోగా, నిర్మాతగా వివిధ రకాలుగా రాణించాడు. పోలీస్ చిత్రంతో హీరోగా ఆయనకు మంచి పేరు లభించింది. హీరోగా చేసిన మొదటి చిత్రం ‘పోలీస్’ అయితే.. హీరోగా చేసిన చివరి చిత్రం ‘పోలీస్ గేమ్’ కావడం విశేషం. క్యారెక్టర్ ఆర్టిస్టుగా చివరి చిత్రం తుఫాన్. 28 చిత్రాల్లో హీరోగా నటించాడు. రియల్ స్టార్‌గా ఖ్యాతి గడించారు. ఆయన దాదాపు వంద చిత్రాల్లో నటించాడు. జిమ్నాస్టిక్స్‌లో రాష్ట్ర స్థాయి చాంపియన్ అయిన శ్రీహరి అథ్లెట్ కావాలను కున్నాడు. జాతీయ స్థాయి జిమ్నాస్టిక్స్‌లో పాల్గొనాల్సి ఉన్నా....సినిమాలపై మక్కువతో ఈ రంగంవైపు అడుగులు వేసాడు. దాసరి దర్శకత్వంలో వచ్చిన ‘బ్రహ్మ నాయుడు’లో ఆయనకు తెలుగు సినిమాలో నటుడిగా అవకాశం దక్కింది. తాజ్ మహల్ చిత్రంలో పూర్తిస్థాయి విలన్ పాత్రలో కనిపించాడు. 2000వ సంవత్సరంలో వచ్చిన ‘పోలీస్’ చిత్రం ద్వారా హీరోగా పరిచయం అయ్యాడు. గణపతి, ఆయోధ్య రామయ్య, శ్రీశైలం, భద్రాచలం, హనుమంతు, విజయ రామరాజు చిత్రాల్లో హీరోగా నటించారు. హీరోగా చేస్తూనే క్యారెక్టర్ ఆర్టిస్టుగా నువ్వొస్తానంటే నేనొద్దంటానా, బృందావనం, ఢీ, కింగ్, మగధీర, తుఫాన్ చిత్రాల్లో నటించి మంచి పేరు తెచ్చు కున్నాడు. పృథ్వీ పుత్రుడు సినిమా ద్వారా వెండితెరకు పరిచయమైన శ్రీహరి క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా, హీరోగా ఎన్నో సినిమాల్లో నటించి తెలుగు ప్రేక్షకులను మెప్పించాడు. రామ్ చరణ్ హీరోగా నటించిన మగధీరలో షేర్ ఖాన్ పాత్రతో అందరినీ ఆకట్టుకున్న శ్రీహరి, ఇటీవల రామ్ చరణ్ హీరోగా నటించిన తుఫాన్, రఫ్ (2014) సినిమాల్లో నటించాడు. శ్రీహరి 1991 లో డిస్కో శాంతిగా ప్రసిద్ధి చెందిన దక్షిణ భారత నటి శాంతిని వివాహం చేసుకున్నాడు. వీరికి ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె అక్షర. నాలుగు నెలలకే కుమార్తె అకాల మరణం చెందగా, తన కూతురు అక్షర పేరుతో ఫౌండేషన్ నెలకొల్పి, మేడ్చల్ పరిధిలోని నాలుగు గ్రామాలను దత్తత తీసుకొని అక్కడి ప్రజలకు మినరల్ వాటర్ ను అందించడంతో పాటు గ్రామంలో అనేక మౌలిక సదుపాయాల సాధనకు కృషి చేశాడు. తమ గ్రామానికి చెందిన శ్రీహరి రాష్ట్ర స్థాయికి ఎదిగి గ్రామం పేరును నలుదిశలా చాటినందుకు గర్వంగా యలమర్రు గ్రామ ప్రముఖులు 1989 సంవత్సరంలో శ్రీహరిని హైదరాబాద్‌లో ఘనంగా సన్మానించారు. ప్రభుదేవా దర్శకత్వంలో తెరకెక్కుతున్న “రాంబో రాజ్‌కుమార్” సినిమా షూటింగ్ నిమిత్తం ముంబై వెళ్లిన శ్రీహరి, అక్కడ తీవ్ర అస్వస్థతకు గురవడంతో వెంటనే లీలావతి ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో అక్టోబరు 9, 2013 న కాలేయ సంబంధ వ్యాధి వలన ముంబై లో కన్నుమూసాడు. 2005 లో నువ్వొస్తానంటే నేనొద్దంటానా చిత్రానికి ఉత్తమ సహాయ నటుడిగా నంది పురస్కారం అందు కున్నాడు. ఫిల్మ్‌ఫేర్ ఉత్తమ సహాయ నటుడు అవార్డు (తెలుగు) – నువొస్తానంటే నేనొద్దంటానా (2005)బీ ఉత్తమ విలన్ గా నంది అవార్డు – తాజ్ మహల్ (1995)బీ నంది స్పెషల్ జ్యూరీ అవార్డు – శ్రీ రాములయ్య (1998)బీ నంది స్పెషల్ జ్యూరీ అవార్డు – పోలీస్ , రామ సక్కనోడు (1999)బీ నంది స్పెషల్ జ్యూరీ అవార్డు – విజయ రామరాజు (2000)బీ ఉత్తమ సహాయ నటుడిగా నంది అవార్డు – నువొస్తానంటే నేనొద్దంటానాకు (2005) లభించాయి.. **రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

# దసరా దాటినా.. పూర్తికాని కలెక్టరేట్ భవన నిర్మాణం

కరీంనగర్ : జిల్లా కలెక్టరేట్ భవనాన్ని దసరా నాటికి పూర్తి చేసి అందుబాటులోకి తీసుకొస్తామని గతంలో ఇంజినీరింగ్ అధికారులు చెప్పిన విషయం తెలిసిందే. అయితే ఇప్పుడు పండగ దాటినా పూర్తి కాలేదు. దాదాపు రూ.50 కోట్లతో పాత కలెక్టరేట్ ఆవరణలో నిర్మాణం ప్రారంభించారు. ప్రస్తుతం 90 శాతం వరకు పనులు పూర్తయ్యాయి. పాత భవన సముదాయంలో కొన్ని, ఇతర భవనాల్లో మరికొన్ని అరకొర వసతుల మధ్య ప్రభుత్వ శాఖల కార్యాలయాలు కొనసాగుతున్నాయి. గుత్తేదారు ప్రతిపాదిత నిధుల్లో 15 శాతం తక్కువ టెండర్ కోడ్ చేసి కాంట్రాక్ట్‌ను దక్కించుకున్నారు. దాదాపు రూ.43 కోట్ల పనులు జరిగాయని, మరో రూ.7 కోట్ల పనులు పూర్తి



కావాల్సి ఉందని ఆర్అండ్‌బీ అధికారులు చెబుతున్నారు. టెండర్ వేసినప్పుడు తగ్గించిన నిధులను మిగిలిన పనుల కోసం కేటాయిస్తే సెక్యూరిటీ భవనం, ప్రహరీ, తదితర పనులను పూర్తి చేస్తామని కోరుతున్నారు. నిధులను ఖర్చు చేసేందుకు ఆర్థిక శాఖ ఆమోదం తెలిపితే పనులు వేగంగా జరుగుతాయి. ఈ విషయంపై జిల్లా రోడ్లు, భవనాల శాఖ కార్యనిర్వాహక ఇంజినీర్ నరసింహాచారితో మాట్లాడగా ప్రస్తుతం పనులు కొనసాగుతున్నాయని, డిసెంబరులోగా పూర్తవుతాయని కు తెలిపారు.

# ఆలయ జీర్ణోద్ధరణకు అడుగులు

ధర్మపురి : ధర్మపురిలోని ఉగ్ర నారసింహస్వామి ఆలయ జీర్ణోద్ధరణ కోసం రూ.6 కోట్ల నిధుల మంజూరుకు అనుమతిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. మంత్రి లక్ష్మణ్‌కుమార్ ప్రతిపాదనలకు దేవాదాయశాఖ కమిషనర్ అనుమతి ఇచ్చారు. ఆ శాఖ స్తపతి, ఆగమశాస్త్ర పండితులు ఆలయాన్ని ఇటీవల సందర్శించి పనులు చేపట్టాలని నిర్ణయించారు. ధర్మపురి దేవస్థానంలో పాత ఆలయం యోగానందస్వామి క్షేత్రంకాగా కొత్తది ఉగ్ర నారసింహస్వామి మందిరం. ఈ ఆలయం వర్షం కురిసిందంటే చాలా చోట్ల ఉరుస్తోంది. అంతర్గత ఆలయంలో గోడలపై నీరంతా చేరుతుంది. ప్రాకారాల క్షీణత, లీకేజీలు, ఇతర సమస్యలున్నాయి. ఈ నేపథ్యంలో స్థానికులు, భక్తులు ఆలయ జీర్ణోద్ధరణ చేపట్టాలని కోరుతూ వచ్చారు. గత ప్రభుత్వ



హయాంలో నిధులు మంజూరు కాగా టెండర్లు, గుత్తేదారు ఎంపిక ప్రక్రియ పూర్తయింది. ఆఖరులో పనులు చేపట్టేందుకు గుత్తేదారులు ముందుకు రాకపోవడంతో రద్దయింది.


**ముఖ్య కార్యదర్శి సమీక్షతో..** కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఆలయ సంరక్షణ, జీర్ణోద్ధరణపై రాష్ట్ర దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలాజారామయ్యర్ సమీక్ష నిర్వహించారు. మంత్రి సూచన మేరకు నిధులకు ప్రతిపాదించడంతో మంజూరయ్యాయి. త్వరలో టెండర్ ప్రక్రియ, గుత్తేదారు ఎంపిక జరగనుందని ఈవో శ్రీనివాస్ తెలిపారు. ఉగ్ర నారసింహ ఆలయ జీర్ణోద్ధరణ పూర్తయితే ధర్మపురి దేవస్థానం కొత్త కళ సంతరించుకోనుంది.

# బాలామృతం.. వినియోగిస్తేనే సత్ఫలితం

సిరిసిల్ల : చిన్నారులకు అందించే ఆహారం వారి శారీరక, మానసిక ఎదుగుదలపై ప్రభావం చూపుతుంది. సమతుల ఆహారం అందని పిల్లల్లో రోగనిరోధక శక్తి మందగించి భవిష్యత్తులో అనారోగ్యం బారిన పడే అవకాశాలు లేకపోలేదు. అలాంటి పరిస్థితులకు స్వస్తి పలికేందుకు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులకు అవసరమైన పోషకాహారాన్ని పంపిణీ చేస్తున్నారు. శారీరక ఎదుగుదలకు అనుబంధంగా బాలామృతం అందిస్తున్నారు. కానీ క్షేత్రస్థాయిలో తల్లిదండ్రులు చిన్నారులకు తినిపించడంలో ఆసక్తి చూపడం లేదు. దీంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆశించిన మేర ఫలితాలు కనిపించడం లేదు.

అవగాహన అవసరం

జిల్లాలో 587 అంగన్‌వాడీల పరిధిలో 33,088 మంది చిన్నారులు నమోదయ్యారు. ప్రతినెలా చిన్నారుల ఎదుగుదలను ఆయా కేంద్రాల బాధ్యులు పర్యవేక్షిస్తుంటారు. బాలబాలికల ఎత్తు, బరువు, ఆకలి పరీక్షలు నిర్వహిస్తూ రికార్డుల్లో నమోదు చేస్తారు. ఆరు నెలల నుంచి



మూడేళ్లలోపు పోషక లోపాలున్న చిన్నారులకు అవసరమైన మేరకు బాలామృతం, బాలామృతం ప్లస్‌ను అందిస్తుంటారు.

కేంద్రాల్లో పంపిణీ చేసే బాలామృతం పొట్లాలను వినియోగించేందుకు చాలామంది తల్లులు ఆసక్తి చూపడం లేదు. బయట లభించే ప్రైవేటు కంపెనీల తృణధాన్యాల ఉత్పత్తులను ఇస్తుంటారు. పప్పులు, బియ్యంతో చేసిన ఉగ్గును తినిపిస్తుంటారు.

ప్రభుత్వం అందించే పోషక విలువలతో కూడిన బాలామృతం పొట్లాలను ఇతర అవసరాలకు వినియోగిస్తున్నారు.. బాలామృతంతో కలిగే లాభాలు తెలియకపోవడమే దీనికి ప్రధాన కారణం. ఫలితంగా చిన్నారుల శారీరక ఎదుగుదలకు అవసరమైన పోషకాలు, విటమిన్లు అందక పోషకలోపాలు ఏర్పడుతున్నాయి.

బాలామృతం వినియోగిస్తే చిన్నారుల ఆకలి పెరుగుతుంది. పోషకాలు, విటమిన్‌ల కారణంగా రక్తహీనత, బలహీనత సమస్యలు ఉండవు. రోగనిరోధక శక్తి పెరిగి శారీరక, మానసిక ఎదుగుదలకు తోడ్పాటు అందిస్తుంది. కంటిచూపు మెరుగవుతుంది. బాలామృతంతో కలిగే ఫలితాలను తల్లులకు అవగాహన కల్పిస్తే మెరుగైన ఫలితాలు వచ్చే అవకాశం ఉంది.

# 'పంటి'బిగువున భరించొద్దు!



తాండూరు : చాలా మంది మహిళలు ఇంటి పనుల్లో పడి పంటి సమస్యలను పట్టించుకోవడం లేదు. వంట వండుకోవడం, ఇల్లు శుభ్రపర్చుకోవడం, దుస్తులు ఉతకడం, పిల్లలను బడికి సిద్ధం చేయడం లాంటి పనులతోనే రోజంతా గడిచిపోతోంది. పంటి సమస్యే కదా.. ఏం చేస్తుందిలే అని నిర్లక్ష్యం వహిస్తున్నారు. తీవ్రమైన నొప్పులున్నా పంటిబిగువున భరిస్తున్నారు. 'స్వస్థ్ నారి సశక్త్ పరివార్' కార్యక్రమంలో భాగంగా జిల్లాలో గతనెల 27 నుంచి ఈనెల 2వ తేదీ వరకు 44,156 మంది మహిళలకు ప్రభుత్వం వైద్య పరీక్షలు నిర్వహించింది. వారిలో 2,459 మంది తీవ్రమైన దంత సమస్యలతో బాధపడుతున్నట్లు వైద్యులు గుర్తించారు. పలువురికి చికిత్స చేసి దంత రక్షణకు సూచనలు, సలహాలిచ్చారు.

**ప్రధాన కారణాలివే..**

పళ్లు పుచ్చిపోవడం
చిగుళ్ల సమస్యలు
జ్ఞాన దంతంతో ఇబ్బందులు
దంతాల ఎముక సమస్యలు
దవడ ఎదుగుదల, వంకరగా మారడం
పళ్లు సరైన వరుస క్రమంలో రాకపోవడంతో నొప్పి
ప్రమాదాల్లో పళ్లు విరిగినప్పుడు నిర్లక్ష్యంతో సమస్య తీవ్రం కావడం
పంటి నుంచి రక్తం కారడం, దుర్వాసన రావడం
ఎత్తు పళ్లను సరిచేయించుకోవడంతో ఇబ్బందులు

నివారణ ఇలా..

రోజూ ఉదయం, సాయంత్రం పళ్లు శుభ్రం చేసుకోవాలి.
తిన్న ఆహారం పళ్లలో ఇరుక్కోకుండా తోముకోవాలి.
క్యాల్షియం, విటమిన్–3 పదార్థాలు ఎక్కువగా తీసుకోవాలి.
పళ్లపై నలుపు, పసుపు చారలు వస్తే చికిత్స చేయించుకోవాలి.
గర్భిణులు ఆహార విషయాల్లో జాగ్రత్త తీసుకోవాలి.
తమలపాకులు, జర్దా, పొగాకు నమిలితే వెంటనే శుభ్రపర్చుకోవాలి.

**నిర్లక్ష్యమే సమస్యకు కారణం..**

–స్రవంతి, దంత వైద్యురాలు, తాండూరు జిల్లా ఆస్పత్రి

పళ్ల సమస్య ఉందని గుర్తించిన వెంటనే ఆస్పత్రికి వచ్చి చికిత్స చేయించుకుంటే వెంటనే నయమవుతుంది. చాలామంది సమస్య తీవ్రంగా లేదని నిర్లక్ష్యం వహిస్తున్నారు. దీంతో పన్ను పూర్తిగా తీయించుకునే పరిస్థితి వస్తోంది. తాండూరు జిల్లా ఆస్పత్రికి రోజూ 40 మంది వరకు చికిత్స కోసం వస్తారు. ఇందులో 30 మంది వరకు మహిళలే ఉంటున్నారు. జాగ్రత్తలు తీసుకోవడం, వెంటనే చికిత్స చేయించుకుంటే సమస్య ఉత్పన్నం కాకుండా ఉంటుంది.

# కొత్త బస్సులు.. ఇంకెప్పుడు?



జగిత్యాల : జిల్లా కేంద్రం కావడంతో జగిత్యాల ఆర్టీసీ బస్టాండుకు ప్రయాణికుల తాకిడి పెరుగుతోంది. దీనికితోడు మహాలక్ష్మి పథకం కారణంగా మహిళా ప్రయాణికుల సంఖ్య గణనీయంగా పెరిగింది. అయితే ఇదేస్థాయిలో బస్సులు సరిపడా లేకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. మహాలక్ష్మి పథకం ప్రారంభమైన కొద్దిరోజులకు స్థానిక పరిస్థితులకనుగుణంగా అదనపు బస్సుల మంజూరుకు చేసిన ప్రతిపాదన కాగితాలకే పరిమితమైంది. అటు ప్రయాణికులు ఇబ్బందులు పడుతుండగా.. ఇటు ఆర్టీసీ ఆదాయం కోల్పోతుంది.

**ఆదాయానికి గండి**

జగిత్యాల ఆర్టీసీ డిపోలో ప్రస్తుతం 115 బస్సులున్నాయి. వీటిలో పల్లె వెలుగు 35, ఎక్స్‌ప్రెస్‌లు 6, సూపర్ లగ్జరీలు 16, రాజధాని 4, అద్దెకు తీసుకున్న పల్లెవెలుగు 35, హైర్ ఎక్స్‌ప్రెస్‌లు 19 ఉన్నాయి. మొత్తం అన్ని రూట్లలో కలిపి రోజుకు 115 షెడ్యూళ్ల చొప్పున నడుస్తున్నాయి. ఇలా రోజుకు 47 వేల కిలోమీటర్లు తిరుగుతూ ప్రయాణికులను గమ్యానికి చేరుస్తున్నాయి. అయితే ఆర్టీసీ ప్రణాళిక, ప్రయాణికుల అవసరాలకనుగుణంగా బస్సుల సంఖ్య లేకపోవడంతో కొన్ని రూట్లలో సర్దుబాటు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. దీంతో ఆర్టీసీ ఆదాయానికి గండి పడుతోంది.

**రూ.13 లక్షలకే పరిమితం**

ప్రస్తుతం మహిళా ప్రయాణికుల సంఖ్య పెరగడంతో ఆక్యుపెన్సీ రేషియో ఏకంగా 95 శాతానికి చేరింది. పండగ వేళలు, ప్రత్యేక సందర్భాల్లో మాత్రం ఇది వందశాతం వరకు ఉంటోంది. ఆర్టీసీ రోజుకు సగటు నగదు ఆదాయం రూ.16 లక్షలు ఆశిస్తుండగా, కేవలం రూ.13 లక్షలు మాత్రమే ఉంటోంది. అదనంగా మరో 20 బస్సులు మంజూరైతే మరింత ఆదాయం సమకూరే అవకాశాలు పెరుగుతాయని ఆర్టీసీ వర్గాలు భావిస్తున్నాయి.

**ఏడాదిన్నర దాటినా ఊసే లేదు** జగిత్యాల ఆర్టీసీ డిపో పరిస్థితులకు అనుగుణంగా అదనంగా 20 బస్సులు కావాలని ఏడాదిన్నర క్రితం నివేదిక సమర్పించారు. కనీసం 12 ఎక్స్‌ప్రెస్‌లు, మరో 8 పల్లెవెలుగు బస్సులు మంజూరు చేయాలని కోరారు. ఈ మేరకు కొత్త బస్సులు మంజూరైతే రోజుకు సగటున రూ.5 లక్షల నుంచి రూ.7 లక్షల వరకు ఆదాయం పెరిగే అవకాశముంది. ప్రజాప్రతినిధులు చొరవ చూపి కొత్త బస్సుల మంజూరుకు కృషి చేయాల్సిన అవసరముంది.

# యథేచ్ఛగా అక్రమ నిర్మాణాలు



కరీంనగర్ : జిల్లాలోని కరీంనగర్ నగరపాలక సంస్థతో పాటు పురపాలికల్లో నివాసిత, వాణిజ్య అవసరాల భవన నిర్మాణాలను ఇష్టానుసారంగా నిర్మించుకుంటున్నారు. భవన అనుమతుల సమయంలో తీసుకునే నక్ష(ప్లాన్)కు విరుద్ధంగా యథేచ్ఛగా నిర్మాణాలు చేసుకుంటున్నారు. ప్రశ్నించే వరకు చూద్దామనే ధోరణిలో ఉండి అడ్డదిడ్డంగా నిర్మిస్తూ రోడ్డు మీదకు వచ్చి నిబంధనలు ఉల్లంఘిస్తున్నారు. గత నాలుగైదు ఏళ్లుగా బహుళ అంతస్తులు, నివాసిత, వాణిజ్య భవన నిర్మాణాలపై వందల సంఖ్యలో ఫిర్యాదులు వస్తున్నా సరైన విధంగా చర్యలు లేకపోవడంతో ఒకరిని చూసి మరొకరు అన్నట్లు అనుమతులకు విరుద్ధంగా అక్రమ నిర్మాణాలు చకచకా కొనసాగిస్తున్నారు.

**అనుమతుల తర్వాత పర్యవేక్షణేదీ?**

నగరంలో రహదారులు ఎంతమేర ఉండాలో అంతే మేర ఉండగా, వాహనాల సంఖ్య విపరీతంగా పెరిగింది. వ్యాపార, వాణిజ్య సముదాయాలన్నీ ఒకే చోట ఏర్పాటు చేస్తుండటం, ఆ ప్రాంతాల్లోనే నూతన భవనాలు నిర్మిస్తుండటంతో రాకపోకలు సాగించే ప్రజలతో ట్రాఫిక్ పెరిగింది. అనుమతులు తీసుకున్న తర్వాత నిర్మాణాలు పరిశీలించకపోవడంతోనే అసలు సమస్యలకు కారణంగా మారుతోంది. నిబంధనలు ఉల్లంఘించడం, సెట్‌బ్యాక్ లేకపోవడం, మెట్లు బయటకు రావడం, గేట్లు రోడ్డు వైపు తెరుచుకోవడం, రోడ్డు ఆక్రమించుకోకపోవడం వంటివి పట్టణ ప్రణాళిక విభాగానికి కనిపించడం లేదు. ఫిర్యాదులు వస్తే నోటీసు ఇచ్చి చేతులు దులుపుకొంటున్నారు. ఆ తర్వాత చర్యలేవీ ఉండటం లేదు.

**అంతా మామూలుగానే.. తనిఖీలు**

భవన నిర్మాణాలు చేపడుతున్న సమయంలో అనుమతులు, ఉల్లంఘనలపై అడ్డుకోవడానికి పట్టణ ప్రణాళిక అధికారులు దృష్టి సారించడం లేదు. నిర్మాణాలు పూర్తయిన తర్వాత రోడ్డు మీదకు పిల్లర్ వచ్చిందని, సెట్‌బ్యాక్ లేదంటూ కొందరు అత్యుత్సాహం చూపిస్తున్నట్లు బహిరంగంగానే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. వీరికి తోడుగా సిబ్బంది మామూలుగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి.

**పూర్తి కాకుండానే స్వాధీన పత్రం**

బహుళ అంతస్తులు, మార్టిగేజ్ చేసిన భవనాలకు సంబంధించి నిర్మాణాలు పూర్తయిన తర్వాతనే ఆక్యుపెన్సీ సర్టిఫికెట్లు (ఓసీ) జారీ చేయాల్సి ఉంటుంది. ఇటీవల ఓ ప్రాంతంలో పనులు పూర్తి కాకుండా స్వాధీనపత్రం కోసం దరఖాస్తు చేయడాన్ని కమిషనర్ తీవ్రంగా పరిగణించినట్లు సమాచారం. దీనికి బాధ్యులైన అధికారులపై శాఖాపరంగా చర్యలు తీసుకున్నట్లు తెలిసింది. స్వయంగా తనిఖీలు చేస్తూ కొలతల ప్రకారం నిర్మిస్తున్నారా లేదా? అనేది పరిశీలిస్తున్నారు.

**చర్యలు తప్పవు**

అనుమతులకు విరుద్ధంగా భవనాలు నిర్మిస్తే భవిష్యత్తులో ఇబ్బందులు పడాల్సి వస్తుంది. ఫిర్యాదులు వస్తే కచ్చితంగా చర్యలుంటాయి. ఇప్పటికే 53 భవనాలకు నోటీసులు జారీ చేశాం. సరైన సమాచారం ఇవ్వకపోతే త్వరలోనే కూలుస్తాం.

బషీర్, డీసీపీ, కరీంనగర్ నగరపాలిక

# తగ్గిన కేంద్రాలు.. సామగ్రి అంతంతే!

భగత్‌నగర్: వానాకాలం ధాన్యం కొనుగోళ్లకు జిల్లా యంత్రాంగం రంగం సిద్ధం చేసింది. వర్షాకాలంలో ప్రారంభంలో వానాలు లేక జిల్లాలో వ్యవసాయ పనులు ఆలస్యంగా ప్రారంభమయ్యాయి. యూరియా కొరత రైతాంగాన్ని తీవ్ర ఇబ్బందులకు గురి చేసింది. సీజన్ ముగుస్తుండగా భారీ వర్షాలు ముంచెత్తాయి. ఇలా రైతన్నకు అడుగడుగునా అడ్డంకులు ఎదురయ్యాయి. ఈసారి భారీగా ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా వేసి అధికారులు కొనుగోళ్లకు ప్రణాళికలు తయారు చేశారు. అయితే పూర్తి స్థాయి సామగ్రిని సమకూరిస్తేనే రైతులకు ఇబ్బందులు తప్పుతాయి.

**గతంలో 340.. ఇప్పుడు 325..**

జిల్లాలో ఈ వర్షాకాలంలో 2,75,398 ఎకరాల్లో వరి పంట వేయగా దొడ్డు రకం 1,57,929 ఎకరాల్లో, సన్నరకం 1,17,469 ఎకరాల్లో సాగు చేశారు. ఇందులో దొడ్డు రకం ధాన్యం 3,57,274 మెట్రిక్ టన్నులు, సన్న రకం 2,40,072 మెట్రిక్ టన్నులు దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేశారు. స్థానిక అవసరాలకు పోను దొడ్డు రకం 1,68,025 మె.ట, సన్న రకం 1,33,855 మె.ట కొనుగోలు కేంద్రాలకు వచ్చే అవకాశం ఉందంటున్నారు. దీనికి అనుగుణంగా ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లాలో 325 కొనుగోలు కేంద్రాలను ప్రారంభించబోతున్నారు. ఇందులో ఐకేపీ–101, ప్యాక్స్–184, డీసీఎంఎస్–36, హకా–4 ఏర్పాటు చేయనున్నారు. గత వానాకాలంలో 340 కేంద్రాలు ప్రారంభించగా ఈసారి 15 కేంద్రాలు తగ్గించారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని మర ఆడించడానికి 127 రైస్ మిల్లులు అందుబాటులో ఉన్నాయి. ఇందులో 79 బాయిల్డ్ రైస్ మిల్లులు కాగా



48 రా రైస్ మిల్లులున్నాయి. ఆయా మిల్లుల్లో 5,92,000 మె.ట ధాన్యం మర ఆడించవచ్చు.

**వీటిని సమకూర్చుకోవాలి**

కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం శుభ్రం చేసుకోవడానికి ఆటోమేటిక్ ప్యాడీ క్లీనర్లు 187 కావాల్సి ఉండగా, 16 మాత్రమే అందుబాటులో ఉన్నాయి. వీటిని సమకూర్చుకోవాల్సి ఉంది. అకాల వర్షాల నుంచి ధాన్యాన్ని కాపాడుకోవడానికి 10,522 టార్పాలిన్లు అవసరం కాగా 6,948 అందుబాటులో ఉన్నాయి. గ్రెయిన్ కాలిఫర్, తేమ కొలిచే, తూకం యంత్రాలు, హస్క్ రిమూవర్లు, ఫీల్డ్ బ్యాలెన్స్‌లు ఉన్నాయి. ధాన్యం ప్యాకింగ్‌కు 75,47,000 గన్నీ సంచులు అవసరంకాగా 52,29,000 ఉన్నాయి.

**15 నుంచి ప్రారంభం**

ధాన్యం కొనుగోళ్లకు కావాల్సిన ఏర్పాట్లు పూర్తి చేశాం. ఈ నెల 15 నుంచి పూర్తి స్థాయిలో కొనుగోళ్లు ప్రారంభమయ్యే అవకాశముంది. రైతులు ముందస్తుగా కేంద్రాలకు ధాన్యం తీసుకొచ్చినా కొనుగోలు చేసేలా ఏర్పాట్లు చేశాం.

రజనీకాంత్, జిల్లా మేనేజర్, పౌర సరఫరాల సంస్థ

# వనమంటే అభిమానం

సారంగాపూర్: అటవీ భూములు కనపడితే చాలు, ఆక్రమణకు పాల్పడుతున్న రోజులివి.. కానీ వేల ఎకరాలను కంటికి రెప్పలా కాపాడుకోవడమే కాదు.. అటవీ సంపదను సంరక్షిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారా గ్రామస్థులు.. జగిత్యాల జిల్లాలో 59,735 హెక్టార్ల విస్తీర్ణంలో అటవీ ప్రాంతం విస్తరించగా అత్యధికంగా బీర్‌పూర్ మండలంలో 8,365 హెక్టార్ల భూములున్నాయి. ఇందులో వివిధ గ్రామాల పరిధిలోని 3,662 ఎకరాల్లో అటవీ భూమి ఆక్రమణకు గురైనట్లు అధికారుల సర్వేలో తేలింది. అయితే ఇదే మండలం కొల్వాయి గ్రామానికి కేటాయించిన 2 వేల ఎకరాలకు పైగా అటవీ భూములను స్థానికులు హద్దులు ఏర్పాటు చేసుకొని సంరక్షించుకుంటున్నారు.

**సమష్టి కృషితో ఆక్రమణలకు అడ్డుకట్ట**

కొల్వాయికి చెందిన అటవీ భూములను ఇతర గ్రామాల వారు ఆక్రమిస్తే స్థానికులు అడ్డుకొని అటవీ అధికారుల సాయంతో తిరిగి స్వాధీనం చేసుకున్నారు. మండలంలోని రేకులపల్లెకు చెందిన కొంతమంది ఇళ్ల స్థలాల కోసం ఆక్రమణకు యత్నించగా అడ్డుకున్నారు. తుంగూరుకు చెందిన కొందరు టేకు వనాలను నరికి సాగుకు యత్నించగా పోరాటం చేసి కాపాడుకున్నారు.

**మొక్కల పెంపకంతో వనాల విస్తరణ**

పర్యావవరణ కాలుష్యంతో వాతావరణ మార్పులు.. తద్వారా ఎదురవుతున్న పరిణామాల నేపథ్యంలో కొల్వాయి గ్రామస్థులంతా ఏకమై అటవీ సంపదను సంరక్షించుకోవాలని నిర్ణయించుకున్నారు.



ఇందుకు అనుగుణంగా అప్పటికే సహజసిద్ధంగా ఉన్న అడవులతో పాటు ఖాళీ ప్రదేశాల్లో అటవీ శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక నర్సరీలు ఏర్పాటు చేసి మొక్కల పెంపకం చేపట్టింది. దాదాపు 100 ఎకరాల్లో నీలగిరి, టేకు, ఇతర మొక్కలు నాటారు.

హద్దుల చుట్టూ కాంటూరు కందకాల తవ్వకంతో భూముల ఆక్రమణకు అడ్డుకట్ట వేయడంతో పాటు వాన నీటి సంరక్షణకు బాటలు వేశారు. వాన నీటి సంరక్షణకు పర్క్యులేషన్ ట్యాంకుల నిర్మాణం చేపట్టడంతో భూగర్భ జలాలు పెరిగాయి. కొల్వాయి చుట్టుపక్కల గ్రామాల్లో ఖాళీ స్థలాలు లేక పశువులకు, జీవాల మేతకు అటవీ ప్రాంతం ఎంతో ఉపయోగపడుతోంది. అటవీ ప్రాంతంలోని వందల ఎకరాల్లో గీతకార్మికులకు ఉపాధి కోసం ప్రత్యేకంగా ఈత, తాటి వనాలు పెంచుతున్నారు. స్థానిక యువకుల కోసం అటవీ స్థలంలో ప్రత్యేకంగా క్రీడా మైదానాన్ని ఏర్పాటు చేసుకున్నారు.

చురకలు



# అభ్యర్థుల ఎంపికే సవాల్

గోదావరిఖని: 'అనుకున్నదొక్కటి.. అయినది ఒక్కటి.. బోల్తా కొట్టిందిలే బుల్‌బుల్ పిట్ట..' సినిమా పాటకు సరిపడ్డట్లు స్థానిక ఎన్నికల రిజర్వేషన్లు నాయకులకు అనుకూలంగా రాకపోవడంతో అయోమయంలో పడ్డారు. బలమైన అభ్యర్థి ఉన్న చోట రిజర్వేషన్ సరిపోవడం లేదు. పట్టున్న చోట నాయకుడు లేని పరిస్థితి ఎదురవుతోంది. జిల్లా పరిషత్తు, ప్రాదేశిక నియోజకవర్గాల రిజర్వేషన్లు ప్రధాన పార్టీలకు తలనొప్పిగా మారాయి. ఉమ్మడి జిల్లాలో 60 జడ్పీటీసీ స్థానాలతో పాటు 646 ఎంపీటీసీ స్థానాలు, 1226 గ్రామ పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించేందుకు నోటిఫికేషన్ విడుదలైంది. ఇందులో రిజర్వేషన్ల ప్రకారం పోటీ చేయాల్సిన నాయకులకు చాలా చోట్ల ప్రధాన పార్టీలకు బలమైన అభ్యర్థుల కొరత కనిపిస్తోంది. స్థానిక ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని కొంత మంది నాయకులు ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలందించారు.

**కసరత్తు ప్రారంభం** రిజర్వేషన్లు ఖరారు కావడంతో జడ్పీటీసీ స్థానాలతో పాటు ఎంపీటీసీ స్థానాలు ఎక్కువ మొత్తంలో దక్కించుకునేందుకు ప్రధాన పార్టీలు కసరత్తు ప్రారంభించాయి. బలమైన అభ్యర్థులను పోటీలో దింపేందుకు ప్రయత్నిస్తున్నా రిజర్వేషన్‌తో అక్కడ నాయకత్వ ఇబ్బంది ఏర్పడింది. రిజర్వేషన్ల ప్రకారం మండల ప్రాదేశిక నియోజకవర్గాల్లో ప్రధాన పార్టీలకు సరైన అభ్యర్థులు లేకుండాపోయారు. ఎంపీపీ రిజర్వేషన్ ప్రకారం కొన్ని మండలాల్లో ఒకే ఒక ఎంపీటీసీకి కేటాయించడంతో అక్కడ గెలిచిన వారికే పీఠం దక్కనుంది. దీంతో ప్రధాన పార్టీలు అలాంటి స్థానాల్లో అభ్యర్థులను ఆచితూచి ఎంపిక



చేసే అవకాశం ఉంది.

**21 మందికి అవకాశం**

ఉమ్మడి జిల్లాలోని నాలుగు జడ్పీ ఛైర్మన్ పదవులకు రిజర్వేషన్ ప్రకారం పది మందికే అవకాశం ఉంది. వీరితో పాటు మరో 11 ఇతర స్థానాల్లో గెలిచిన వారూ పోటీలో ఉండే పరిస్థితి ఉంది. మొత్తం 60 జడ్పీటీసీ స్థానాల్లో 21 మందికి మాత్రమే జడ్పీ ఛైర్‌పర్సన్లుగా పోటీ చేసే అర్హత ఉంది. ఉమ్మడి జిల్లాలో కరీంనగర్, జగిత్యాల స్థానానికి ముగ్గురు చొప్పున, సిరిసిల్ల, పెద్దపల్లి స్థానానికి ఇద్దరు చొప్పున అవకాశం ఉంది. ఇక్కడ అనుకూలించకపోయినా మరో 11 మండలాల్లో గెలిచిన వారు కూడా జడ్పీ అధ్యక్ష పదవికి అర్హులవుతారు.

కరీంనగర్ స్థానాన్ని బీసీ జనరల్‌కు కేటాయించారు. ఈ జిల్లాలో చొప్పదండి, ఇల్లందకుంట, వీణవంక మండలాల్లో గెలిచిన వారు రిజర్వేషన్ ప్రకారం జడ్పీ ఛైర్మన్ పోటీకి అర్హత సాధిస్తారు. ఇదే జిల్లాలో బీసీ మహిళకు కేటాయించిన జమ్మికుంట, తిమ్మాపూర్, శంకరపట్నం మండలాల్లో గెలిచిన వారు కూడా పోటీలో ఉండొచ్చు.

జగిత్యాల జిల్లా జడ్పీ ఛైర్మన్ స్థానం జనరల్ మహిళకు కేటాయించారు. రిజర్వేషన్ ప్రకారం బుగ్గారం, మల్లాపూర్, కథలాపూర్ మండలాల్లో గెలిచిన వారే ఛైర్మన్‌గా పోటీ చేసే అవకాశం ఉంది. అయితే మహిళా జనరల్ స్థానానికి ఎస్సీ, బీసీ మహిళలు కూడా అర్హులే. మల్యాల, పెగడపల్లి, జగిత్యాల అర్బన్, బీమారం, మేడిపల్లి మండలాల్లో గెలిచిన వారు కూడా జడ్పీ ఛైర్మన్ పదవి దక్కించుకోవచ్చు.

సిరిసిల్ల జిల్లాలో ఎస్సీ జనరల్‌కు కేటాయించడంతో కోనరావుపేట, వేములవాడ గ్రామీణ మండలాల్లో గెలిచిన ఇద్దరిలో ఒకరికి పీఠం దక్కనుంది. ఇల్లంతకుంట ఎస్సీ మహిళకు కేటాయించడంతో ఇక్కడ గెలిచిన వారూ పోటీ పడవచ్చు. పెద్దపల్లి జిల్లాలో జనరల్ మహిళకు కేటాయించడంతో కమాన్‌పూర్, ఓదెల మండలాల్లో గెలిచిన వారికే పదవి దక్కే అవకాశం ఉంది. అయితే బీసీ మహిళకు కేటాయించిన శ్రీరాంపూర్, పెద్దపల్లి, అంతర్గాం మండలాల నుంచి గెలిచిన వారు కూడా బరిలో నిలిచేందుకు అవకాశం ఉంది.

# ప్రాదేశికం.. పల్లె ప్రగతిలో కీలకం

కూసుమంచి : ఉమ్మడి ఏపీలో '1994–పంచాయతీరాజ్ చట్టం' ద్వారా జిల్లా ప్రాదేశిక, మండల ప్రాదేశిక నియోజకవర్గాలు ఏర్పడ్డాయి. అంతకుముందు గ్రామ సర్పంచులు మండల ప్రజా పరిషత్తులో, మండల ప్రజా పరిషత్తు అధ్యక్షులు జిలా ప్రజా పరిషత్తులో సభ్యులుగా ఉండేవారు. ప్రాదేశిక ఎన్నికలకు సమయం సమీపిస్తున్న నేపథ్యంలో జడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యుల ప్రాధాన్యంపై ప్రత్యేక కథనం..

**ఎంపీటీసీ సభ్యుల విధులు.. అధికారులు**

మండల పరిషత్తు సమావేశాల్లో మెజారిటీ సభ్యుల ఆమోదంతోనే తీర్మానాలు పట్టాలెక్కుతాయి. ఎంపీటీసీ సభ్యుడు తన ప్రాదేశిక నియోజకవర్గంలోని గ్రామ పంచాయతీల్లో శాశ్వత ఆహ్వానితుడు. పంచాయతీ సమావేశాలకు హాజరు కావచ్చు. ఓటు హక్కు మాత్రం ఉండదు. మండల పరిషత్తు అభివృద్ధి, సమీక్ష సమావేశాలకు హాజరై తన పరిధిలోని సమస్యలను ప్రస్తావిస్తూ, నిధులు మంజూరుకు కృషి చేయాలి. అభివృద్ధి పనుల్లో అక్రమాలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లవచ్చు. తన పరిధిలోని పాఠశాలలను సందర్శించి విద్యా ప్రమాణాల మెరుగుకు సూచనలు అందించవచ్చు. మండల పరిషత్తు నిధుల విషయంలో అధికారులను ప్రశ్నించవచ్చు. అభివృద్ధి కార్యక్రమాల అమలు తీరును పరిశీలించి సమస్యలు వారి దృష్టికి తీసుకెళ్లే అధికారం ఉంటుంది.

**జడ్పీటీసీ సభ్యులు**

జిల్లా పరిషత్తు తీర్మానాల ఆమోదంలో మెజారిటీ జడ్పీటీసీ సభ్యుల ఆమోదం తప్పనిసరి.

తమ మండల పరిషత్తు సమావేశాలకు హాజరై అక్కడ పరిష్కారం పొందలేని సమస్యలు జడ్పీ సమావేశాల్లో ప్రస్తావించవచ్చు.

పనుల నిర్వహణలో లోపాలు, నిధుల దుర్వినియోగం లాంటివి జడ్పీ ఛైర్మన్, లేదా సీఈవో దృష్టికి తీసుకెళ్లవచ్చు.

జడ్పీ అజెండాలో సమస్యలను చేర్చే, తీర్మానాలను ప్రతిపాదించే అధికారం ఉంటుంది. ముందస్తు నోటీసుతో జడ్పీ పరిపాలనకు సంబంధించిన అంశాలపై ప్రశ్నించవచ్చు. ఆర్థిక నివేదికను పరిశీలించి సూచనలు చేయొచ్చు.

జడ్పీ పాఠశాలలను సందర్శించి మెరుగుదలకు సూచనలు ఇవ్వవచ్చు.

మండల, నియోజకవర్గ నీటి వినియోగ పరిరక్షణ కమిటీ సభ్యుడిగా నీటి పరిరక్షణ చర్యలు చేపట్టే అవకాశం ఉంటుంది.

# మామూళ్లు ఇచ్చుకో.. మట్టి తవ్వుకో



హైదరాబాద్ : కొత్వాల్‌గూడకు సమీపంలోని హిమాయత్ సాగర్ ఎఫ్‌టీఎల్ సరిహద్దు సమీపంలో మట్టి తవ్వకాలివి. పట్టపగలే పొక్లెయిన్‌తో మట్టిని తవ్వేసి టిప్పర్ల ద్వారా తరలిస్తున్నా జలమండలి అధికారులు చూడడం లేదు. టిప్పర్లు, మట్టి తవ్వకాలు జలమండలికి సంబంధం కదా.. మాకెందుకని రెవెన్యూ, మైనింగ్ అధికారులు పట్టించుకోవడం లేదు. రెండు, మూడు రోజుల్లోనే నాలుగైదు అడుగుల లోతు మట్టిని అక్రమార్కులు తీసేశారు.

ఈ అక్రమ మట్టి తవ్వకం హిమాయత్‌సాగర్ సహా శంషాబాద్, షాబాద్, మహేశ్వరం మండలాల్లోని కొన్ని గ్రామాల్లో యథేచ్ఛగా కొనసాగు తోంది. కొందరు ప్రజాప్రతినిధులు, నాయకులు సూత్రధారులు. రాత్రివేళల్లో మట్టిని తవ్వేసి పరిశ్రమలు, ప్రైవేటు నర్సరీలకు విక్రయిస్తున్నారు. రోజూ 500 నుంచి 700 ట్రిప్పుల మట్టిని తవ్వేస్తున్నా రు. నెలకు రూ.8 కోట్ల నుంచి రూ.12 కోట్ల వరకూ ఆర్జిస్తున్నారు.

పరిశ్రమల ఏర్పాటు నేపథ్యంలో..

ఫ్యూచర్‌సిటీ, ఫ్యాబ్‌సిటీ నిర్మాణాల నేపథ్యంలో శంషాబాద్, షాబాద్, ఇబ్రహీంపట్నం, మహేశ్వరం మండలాల్లో పరిశ్రమలు ఏర్పాటవుతు న్నాయి. పునాదులు తీశాక నాణ్యమైన మట్టిని వాటిల్లో వేయాలని ఇంజినీర్లు సూచించడంతో 10, 15 కిలోమీటర్ల దూరంలోని హిమాయ త్ సాగర్, అసైన్డ్ భూములను ఎంచుకుని వాటిని తవ్వేస్తున్నారు. నర్సరీలకూ సరఫరా చేస్తున్నారు. షాబాద్ పరిధి సోలిపేట్‌లోని సర్వే నంబరు 350లో 110 ఎకరాల అసైన్డ్ భూములు, తుమ్మలూర్ సర్వే నంబర్ 315లో వంద ఎకరాల్లో మట్టి తవ్వుతున్నారు. ఒక లారీ ఎర్రమట్టి రూ.5వేల చొప్పున రోజుకు గరిష్ఠంగా 700 ట్రిప్పులు అనుకుంటే.. రోజుకు వారి ఆదాయం రూ.49లక్షలు.

**అన్నీ తెలుసు.. అయినా అలుసు**

శంషాబాద్, మహేశ్వరం, షాబాద్ మండలాల్లోని గ్రామాల్లో మట్టి తవ్వకాలపై కొందరు రెవెన్యూ, మైనింగ్ అధికారులు, సిబ్బందికి తెలుసు. వీరిలో కొందరు అధికారులు రాత్రివేళల్లో మట్టి తవ్వుకుంటే అభ్యంతరం లేదంటూ అభయమిస్తున్నారు. దీంతో అక్రమార్కులు ఒక టిప్పర్‌కు ఇంత చొప్పున మామూళ్లు సమర్పించుకుంటున్నారు. మట్టితో వెళ్తున్న టిప్పర్లను గస్తీ పోలీసులు గమనిస్తే.. వారికి ప్రజాప్రతి నిధులు ఫోన్లు చేసి సాఫీగా వెళ్లేలా చూస్తున్నారు.

# ఖర్చులు భారమాయె.. కడచూపు కరవాయె!



హైదరాబాద్ : ఇంటి యజమాని కూలీ పనికి వెళ్లి అక్కడ జరిగిన ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. ఉస్మానియా ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ కన్నుమూశాడు. సొంతూరికి మృతదేహాన్ని తీసుకెళ్లాలంటే ప్రైవేటు అంబులెన్సులకు తక్కువలో తక్కువ రూ.5 నుంచి 8 వేలు ఇవ్వాల్సిందే. అప్పు చేసైనా సరే.. వారు అడిగినంత చేతిలోనే పెట్టాల్సిందే. లేదంటే మృతదేహం మార్చురీ దాటి బయటకు రాదని కుటుంబసభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**మూలకు చేరిన ఉచిత వాహనాలు..**

పేదలు, దిక్కులేని వారు ఎవరైనా ప్రభుత్వ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతూ చనిపోతే.. ఆయా మృతదేహాలను తమ తమ గ్రామాలకు సాఫీగా తరలించడానికి గతంలో ప్రభుత్వం ఉచిత వాహనాలను సమకూర్చింది. ఉస్మానియా, గాంధీ, నిమ్స్‌లో ఈ సేవలు ఒకట్రెండేళ్లు సాఫీగా సాగినా.. ఆయా వాహనాల్లో చాలావరకు పాడయ్యాయి. ప్రస్తుతం ఉస్మానియాలోని వాహనాల్లో సగం మూలన పడ్డాయి. మరికొన్నింటిలో ఫీజర్లు పనిచేయడం లేదు. కొన్నిచోట లఉచితంగా తరలించేందుకు డ్రైవర్లు ముందుకు రావడం లేదనే ఫిర్యాదులున్నాయి. గాంధీలో కూడా ఒకట్రెండు మాత్రమే నడపగలిగే రీతిలో ఉన్నాయి. కూలీనాలీ కోసం నగరానికి వచ్చిన వారి కుటుంబంలో ఎవరైనా ఆసుపత్రిలో చనిపోతే.. మృతదేహాలను సొంతూళ్లకు తరలించడానికి ఒడిశా, బిహార్ రాష్ట్రాలైతే రూ.40–60 వేలు డిమాండ్ చేస్తున్నారు. అంత డబ్బు పెట్టుకోలేక.. ఇక్కడే ఖననం లేదా దహనం చేస్తున్నారు.

**ప్రైవేటు దందా ఇలా...**

ఉచిత వాహనాలను బయటకు తీయాలంటే డ్రైవర్లు సాకులు చెబుతున్నారు. ప్రైవేటు అంబులెన్సుల మాఫియా ఒత్తిడితో ఇలా వ్యవహరిస్తున్నట్లు ఆరోపణలున్నాయి. వారికి వచ్చిన దాంట్లో ఉచిత అంబులెన్సులు నడిపే వారికి కొంత కమీషన్లు ఇస్తున్నట్లు తెలుస్తోంది. ప్రైవేటు అంబులెన్సు డ్రైవర్లు అంతా ఒకే రేటు. ఒకరి వద్ద బేరం కుదరకపోతే.. వేరే డ్రైవర్ రావడంలేదు.

# ప్రజాహితం.. కబ్జాలతో మాయం



బాలాపూర్ : కోట విలువ చేసే పార్కు స్థలాల పరిరక్షణకు తీసుకుంటున్న చర్యలు నామమాత్రమే. కొన్ని లొసుగులను అడ్డం పెట్టుకుని లేఅవుట్లలో ఉన్న ఖాళీ స్థలాలను యథేచ్ఛగా ప్లాట్లుగా చేసి అమాయకులకు విక్రయిస్తున్నారు. ఫిర్యాదులపై అధికారులు బోర్డులు ఏర్పాటు చేసి చేతులు దులుపుకొంటున్నారు. పదేళ్లలో బడంగ్‌పేట కార్పొరేషన్ పరిధిలో వేల గజాల స్థలాలు కబ్జాకు గురికాగా మరికొన్నింటిని అమ్మేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. అధికారులు దృష్టి సారించకుంటే రూ.50 కోట్లకుపైగా విలువైన స్థలాలు మాయమయ్యే అవకాశం ఉంది. కార్పొరేషన్ పరిధిలో బడంగ్‌పేట, అల్మాస్‌గూడ, గుర్రంగూడ, నాదర్‌గుల్, కుర్మల్‌గూడ, బాలాపూర్, వెంకటాపూర్, మామిడిపల్లి గ్రామాలున్నాయి. పదేళ్ల క్రితం పంచాయతీగా ఏర్పడినప్పుడు పట్టణ ప్రణాళికా విభాగం 147 పార్కులను గుర్తించి బోర్డులు ఏర్పాటు చేసింది. 4 చోట్లే అభివృద్ధి చేశారు. భూముల ధరలు పెరిగి ఆక్రమణదారుల కన్ను పడింది. 'ఖాళీ స్థలం' అనే పదాన్ని ఆసరాగా చేసుకుని అవి తమవే అన్న ధీమాతో భూయజమానులు స్థానిక నాయకుల సహకారంతో చాలా ఖాళీ స్థలాలను ప్లాట్లుగా విభజించి విక్రయించేశారు. వాటిల్లో ఇంటి నిర్మాణాలూ పూర్తి కావడం గమనార్హం.

**కబ్జాల పర్వం ఇలా...**

బడంగ్‌పేటలో మున్సిపల్ కాలనీ లేఅవుట్లలో 5 వేల గజాలు వేర్వేరుగా ఓపెన్ స్థలాలుగా చూపించారు. దీనిపై కన్నేసిన యజమానులు అన్ రిజిస్టర్డ్ అగ్రిమెంట్ ఆఫ్ సేల్ పత్రం ఆధారంగా 3622 గజాలకు సంబంధించి 23 ప్లాట్లకు టీఎస్‌బీపాస్‌లో 2023లో అనుమతులు పొందారు. ఈ స్థలాల విలువ సుమారు రూ.14 కోట్లు ఉంటుంది.

విశాఖనగర్‌లోని చెరువుకు ఆనుకుని ఉన్న 3 వేల గజాల్లో ఓ ఇంటిని నిర్మించారు. ఇదే కాలనీలో మరో చోట 1200 గజాల్లో 600 గజాల స్థలం కాలనీ ఆధీనంలో ఉండగా, మిగిలిన స్థలం స్థానికుల చేతుల్లో ఉంది. మరోచోట 1200 గజాలకు డాక్యుమెంట్లు తయారు చేయగా, మరో 600 గజాలు అమ్మేందుకు ప్రయత్నాలు జరుగుతున్నట్లు తెలిసింది. శ్రీహిల్స్ కాలనీలో ఒక చోట 2200 గజాలు కబ్జా అయ్యింది. మరోచోట 2200 గజాల్లో ఆక్రమణకు గురికాగా, 600 గజాలు మిగిలింది. స రాజీవ్ గృహకల్ప పక్కనే ఇటీవల అధికారులు పార్కు స్థలంలో బోర్డు పాతినా స్థల యజమానులు దానిని తొలగించారు. నాదర్‌గుల్ వివేకానందనగర్‌లో 500 గజాలు, సిద్ధార్థనగర్ కాలనీలో 200 గజాల స్థలం కబ్జాకు గురైంది. బడంగ్‌పేట ఎంసీఆర్ కాలనీలో 700 గజాల స్థలం కబ్జాకు గురవుతుందని కాలనీ వాసులు ఇటీవల కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు.

# కొత్త మార్కెట్‌పై దృష్టి

గోదావరిఖని: సింగరేణి వ్యాపార విస్తరణ దిశగా అడుగులు వేస్తోంది. ఉత్పత్తి చేసిన బొగ్గును మార్కెట్ చేసుకోవడంపై దృష్టి సారించింది. కొత్త వినియోగదారులను సమకూర్చుకునే పనిలో పడింది. తాజాగా తమిళనాడు పవర్ కార్పొరేషన్‌కు 2.88 మిలియన్ టన్నుల బొగ్గు రవాణాకు ఒప్పందం చేసుకొంది. ఒడిశాలోని నైనీ నుంచి జీ–11 గ్రేడ్ బొగ్గు సరఫరాకు ఆ సంస్థతో ఒప్పందం కుదిరింది. తమిళనాడు నార్త్ చెన్నై విద్యుత్తు కేంద్రానికి 1.75 మిలియన్ టన్నుల బొగ్గు సరఫరా చేస్తోంది. కొత్త మార్కెట్‌ను సమకూర్చుకుంటున్న సింగరేణి నైనీ బ్లాకు నుంచి ఈ ఏడాది 4 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యంగా నిర్దేశించుకొంది. ఇంకా 1.12 మిలియన్ టన్నుల బొగ్గు సరఫరాకు కొత్త వినియోగదారులను సమకూర్చుకొనే దిశగా ప్రయత్నాలు చేస్తోంది.

**నగదు వినియోగదారులపై దృష్టి**

సంస్థ నగదు వినియోగదారులపై ఎక్కువ దృష్టి సారించింది. ఇప్పటికే బొగ్గు సరఫరా చేయడం ద్వారా రావాల్సిన బకాయిలు రూ.కోట్లలో పేరుకుపోయాయి. బకాయిలు చెల్లించకపోవడంతో సంస్థ ఆర్థికంగా



ఇబ్బందులు ఎదుర్కొంటుంది. దీంతో కొత్తగా మార్కెట్ విస్తరిస్తూ బొగ్గు సరఫరా చేయడం ద్వారా వెంటనే డబ్బులు చెల్లించే సంస్థలకు బొగ్గు సరఫరా చేయనుంది. ప్రస్తుతం ఎన్టీపీసీ మాత్రమే సింగరేణికి వెంటనే బిల్లులు చెల్లిస్తోంది. ఏటా 12 మిలియన్ టన్నుల బొగ్గును తీసుకుంటున్న ఎన్టీపీసీ ఏ రోజుకారోజు చెక్కులు అందజేస్తోంది. మహారాష్ట్ర, కర్ణాటక, గుజరాత్ రాష్ట్రాల్లోని విద్యుత్తు సంస్థలు కూడా దాదాపుగా వెంట వెంటనే బిల్లులు చెల్లిస్తున్నాయి. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ జెన్‌కోల నుంచే భారీ మొత్తంలో బకాయిలు రావాల్సి ఉంది.

**అందుబాటులోకి ధరలు** వినియోగదారులకు బొగ్గు ధరలు అందుబాటులోకి తెచ్చేందుకు సంస్థ ఆలోచన చేస్తోంది. దీని ద్వారా మార్కెట్‌ను మరింత పటిష్ఠం చేసుకునేందుకు కసరత్తు చేస్తోంది. ప్రస్తుతం మార్కెట్‌లో కోల్ ఇండియా కంటే సింగరేణి బొగ్గు ధర ఎక్కువగా ఉండటంతో వినియోగదారులు ముందుకు రావడం లేదు. బొగ్గు ధర తగ్గించుకోవడం ద్వారా కొత్త వినియోగదారులను తమ వైపు తిప్పుకోవడానికి సంస్థ ప్రయత్నిస్తోంది. సాధారణంగా కోల్ ఇండియాతో పోల్చితే సింగరేణి బొగ్గు ధర టన్నుకు రూ.1000 నుంచి రూ.2000 వరకు ఎక్కువగా ఉంది. దీంతో వినియోగదారులకు సింగరేణి బొగ్గు భారంగా మారుతుంది. రానున్న కాలంలో కొంత వరకు బొగ్గు ధరను తగ్గించి సరఫరా చేసే యోచన చేస్తోంది.

# ఆర్వోబీ పనులకు 'గేట్' పడింది

పెద్దపల్లి : జిల్లా కేంద్రంలో కూనారం రైల్వే గేట్ కష్టాలు తొలగించేందుకు రెండేళ్ల కిందట చేపట్టిన ఆర్వోబీ నిర్మాణ పనులు ఆరు నెలలుగా నిలిచిపోయాయి. భూసేకరణ ప్రక్రియ పూర్తి కాకపోవడంతో పనులు ముందుకు సాగడం లేదు. గేట్ వేసిన ప్రతీసారి వాహనదారులకు గంటల తరబడి నిరీక్షణ తప్పడం లేదు.

**నిర్వహణలో ఆలస్యం**

పెద్దపల్లిలోని కూనారం రోడ్డులో రూ.199.5 కోట్ల అంచనా వ్యయంతో ఆర్వోబీ నిర్మాణ పనులకు 2022లో ప్రారంభించారు. రైల్వే నియంత్రణలోని వంతెన నిర్మాణ పనులు తుది దశకు చేరగా ఆర్‌అండ్‌బీ పరిధిలో రెండువైపులా అప్రోచ్ వంతెనల పనులకు భూసేకరణ అవరోధంగా మారింది. కూనారం వైపు నిర్మించిన ఓ వంతెనకు 14 పిల్లర్లు, మరో వంతెనకు 13 పిల్లర్లు మాత్రమే నిర్మించారు. ఇక్కడ ఓ గ్యాస్ గోదాంకు సంబంధించిన స్థలానికి చెల్లింపులు జరగకపోవడంతో పనులు ముందుకు సాగడం లేదు. రెండు వైపులా సర్వీస్ రోడ్డు నిర్మాణానికి 3 ఎకరాల స్థలం సేకరించాల్సి ఉంది. ఓ వైపు భూసేకరణ పూర్తి కాకపోవడం, మరోవైపు చెల్లింపులో జాప్యం జరుగుతుండటంతో గుత్తేదారు తప్పుకుంటున్నట్లు ఉన్నతాధికారులకు మౌఖిక సమాచారం ఇవ్వడంతో అధికారులు మల్లగుల్లాలు పడుతున్నారు.

**ఇక్కడ సైతం ఇబ్బందే..**

పాలకుర్తి మండలంలోని కన్నాల, పెద్దపల్లి మండలంలోని దేవునిపల్లి, గౌరెడ్డిపేట, చీకురాయి, ఓదెల మండలంలోని పొత్కపల్లి, కొలనూరు, ఓదెల వద్ద రైల్వేగేటు కష్టాలు నిత్యకృత్యం. ఓదెల మండలం ఉప్పరపల్లి,



పెద్దపల్లి మండలం కొత్తపల్లి వద్ద నిర్మించిన ఆర్‌యూబీలు వర్షాకాలంలో నీట మునుగుతుండటంతో కష్టాలు తప్పడం లేదు. ఇటీవల వినియోగంలోకి వచ్చిన కొత్తపల్లి అండర్‌పాస్‌లో మూడు వైపుల నుంచి దారులుండగా ఆర్‌యూబీ ప్రమాదకరంగా మారింది.

**ప్రతి పది నిమిషాలకు..**

కాజీపేట–బల్లార్ష సెక్షన్‌లో రైళ్ల రద్దీ అధికంగా ఉండటంతో ప్రతీ పది నిమిషాలకు ఒకసారి గేటు పడుతూ ఉంటుంది.

పెద్దపల్లి మండలంలోని హన్మంతునిపేట, రాంపల్లి, మారేడుగొండ, గుర్రాంపల్లి గ్రామాలతోపాటు కాల్వశ్రీరాంపూర్ పూర్తిగా, ముత్తారం మండల కేంద్రంతోపాటు మరికొన్ని గ్రామాలకు అత్యవసర పరిస్థితుల్లో గేటు అవరోధంగా మారింది. గేటు పడితే 108 వాహనాల్లో తీసుకొచ్చిన వారిని అవతలవైపు ఇతర వాహనాల్లోకి మార్చి తరలించిన రోజులున్నాయి. ఈ పరిస్థితులు చక్కదిద్దేలా పనులను వేగిరం చేయాల్సిన అవసరముంది.

# పెర'గాలి' స్వచ్ఛత!

హైదరాబాద్: నగరంలో వాయునాణ్యత మెరుగుపరిచేందుకు నేషనల్ క్లీన్ ఎయిర్ ప్రోగ్రామ్(ఎన్‌సీఏపీ) కింద 2019 నుంచి ఇప్పటి వరకు రూ.727.18 కోట్లు మంజూరయ్యాయి. అందులో వినియోగించింది కేవలం రూ.484.56 కోట్లు మాత్రమే. గత ఐదేళ్లలో రూ.వందల కోట్లు వెచ్చించినా వాయునాణ్యత మెరుగుపరచడంలో నగరం వెనుకబడి ఉంది. ఇటీవల వెల్లడించిన స్వచ్ఛ వాయు సర్వేక్షణ్-2025 ర్యాంకులే అందుకు నిదర్శనం.



**ఇలా చేస్తే బాగు**

ఎలక్ట్రిక్ వాహనాల సంఖ్య పెంచేలా ప్రభుత్వం ప్రోత్సాహకాలు ఇవ్వడం జీహెచ్‌ఎంసీ చేపట్టిన గ్రీన్‌బెల్ట్, వేస్ట్ ప్రాసెసింగ్, ఆర్టీసీ ఎలక్ట్రిక్ బస్సుల వినియోగం పెరగాలి. ఎన్‌సీఏపీ నిర్దేశించిన లక్ష్యం ప్రకారం ఘనపు మీటరు గాలిలో పీఎం-10, ఘనపు మీటరు గాలిలో 60 మైక్రోగ్రాములుగా ఉండాలి. 2017-18లో 110 మైక్రోగ్రాములుగా నమోదవ్వగా.. ప్రస్తుతం 82 మైక్రోగ్రాములకు చేరుకుంది.

**ర్యాంకు ఎలా నిర్ధారిస్తారంటే..** జనాభా ఆధారంగా 10లక్షలకు పైబడిన, 3 నుంచి 10లక్షలు, 3లక్షల లోపు నగరాలుగా విభజించి కాలుష్య నియంత్రణ చర్యల ఆధారంగా ర్యాంకు నిర్దేశించారు. ఘన వ్యర్థాల నిర్వహణ, ఉద్గారాలు, పరిశ్రమల కాలుష్యంపై ప్రజలకు అవగాహన కల్పించడం, సూక్ష్మధూళి కణాల నియంత్రణ, వాయునాణ్యత పెంపు వంటి వాటి ఆధారంగా ర్యాంకులు కేటాయిస్తారు. అందులో మిలియన్ ప్లస్ జనాభా ఉన్న 41 నగరాల్లో హైదరాబాద్‌కి 22వ ర్యాంకు రాగా.. ఇందోర్ మొదటి స్థానం దక్కించుకుంది.

# గురువులకూ డిజిటల్ పాఠాలు

వెల్గటూరు : : ఈ చిత్రంలోని ఉపాధ్యాయులంతా పాఠశాలల్లో డిజిటల్ బోధన కోసం పాఠశాల సముదాయ సమావేశాల్లో కొంగొత్త పాఠాలు నేర్చుకుంటున్నారు. వెల్గటూరు ఉన్నత పాఠశాలలో జరిగిన సముదాయ సమావేశాల్లో చోటు చేసుకున్న సన్నివేశం ఇది. కృత్రిమ మేధ(ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్-ఏఐ)పై అవగాహన కల్పించేందుకు భవిష్యత్తు సంసిద్ధతా కార్యక్రమాలను పటిష్ఠంగా అమలు చేసేందుకు విస్తృత చర్యలు చేపట్టారు.

కొవిడ్ అనంతర పరిస్థితులు విద్యా బోధనలో గణనీయ మార్పులు తీసుకువచ్చాయి. ప్రధానంగా కొవిడ్ సమయంలో ఆన్‌లైన్ పాఠాలతో విద్యార్థులకు డిజిటల్ సాధనాల వాడకంపై ఆసక్తి పెరిగింది. ఈ నేపథ్యంలో విద్యార్థులను డిజిటల్ పాఠాల వైపు ఆకర్షితులను చేయడంతోపాటు పాఠశాల స్థాయి నుంచే సాఫ్ట్‌వేర్ ఇంజినీరింగ్ స్థాయి బోధన అందించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది.

ఇందులో భాగంగా కాంప్లెక్స్‌కు ఇద్దరు ఉపాధ్యాయుల చొప్పున గత నెలలో జిల్లా స్థాయిలో శిక్షణ ఇచ్చారు.

క్షేత్ర స్థాయిలో విద్యార్థులకు డిజిటల్ బోధన కోసం సముదాయ సమావేశాల్లో ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. 'ఫ్యూచర్ రెడీనెస్ ఆఫ్ తెలంగాణ ఫర్ ఏఐ' పేరుతో 1-5 తరగతుల విద్యార్థులకు గణిత బోధన కోసం ప్రత్యేక సిలబస్ రూపొందించారు. వెనుకబడిన (సీ గ్రేడ్) పిల్లల కోసం సిలబస్‌తో సంబంధం లేకుండా తెలుగు, గణితం



నేర్చుకోవడానికి ఏఎక్స్‌ఎల్‌ను అమలు చేస్తున్నారు.

1, 2 తరగతుల పిల్లలు విద్యా సంవత్సరం మొత్తంలో నాలుగు గంటల సమయాన్ని ఏఐ బోధన కోసం వెచ్చించాలి. ఇందులో రెండు గంటలు థియరీ రెండు గంటలు సాధన(ప్రాక్టికల్స్) ఉంటాయి. విద్యార్థుల శాశ్వత విద్యా సంఖ్య(పెన్ నంబర్)తో ఉపాధ్యాయులు తమ ఎంప్లాయ్ ఐడీతో సంబంధిత వెబ్‌సైట్, యాప్‌లలో లాగిన్ కావాల్సి ఉంటుంది. 3-5 తరగతుల విద్యార్థులు విద్యా సంవత్సరంలో 10 గంటలు ఏఐ బోధనకు వెచ్చించాలి. సీగ్రేడ్ విద్యార్థులు మాత్రం వడు నెలల్లో 20 నిమిషాలకు ఒక పీరియడ్ చొప్పున 20 కాలాంశాలు ఏఎక్స్‌ఎల్‌లో తెలుగు, గణితం నేర్చుకోవాలి.

దీని కోసం జీ-కంప్రిస్(%G-compris%) ఎడ్యు ఆక్టివ్8(యాప్‌లు, కోడ్‌మిత్ర వెబ్‌సైట్‌ను రూపొందించారు.

వీటి ఆధారంగా చిన్నారులు ప్రాథమిక స్థాయి నుంచే కంప్యూటర్ విద్యపై అవగాహన పెంపొందించుకుంటారు. దీంతోపాటు గణిత సామర్థ్యాలు, తార్కిక, సృజనాత్మక ఆలోచనలు, చిత్రాలు, పటాలు గీయడంలో నైపుణ్యాలను సాధిస్తారు.

# నీరు చెప్పింది నిజం

నల్గొండ: చెరువుల పరిరక్షణకు ప్రభుత్వం హైడ్రా పేరుతో రాజధానిలో ప్రత్యేక చర్యలు తీసుకుంటుండగా.. జిల్లాలో పరిస్థితి ఇందుకు విరుద్ధంగా ఉంది. ఎఫ్‌టీఎల్‌లోనే అనధికారిక లేఅవుట్ నిర్మించినా.. అధికార యంత్రాంగం ఎలాంటి చర్యలు తీసుకోకుండా చోద్యం చూస్తోంది. భువనగిరి పట్టణానికి ఆయువు పట్టైన పెద్దచెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో ఎలాంటి నిర్మాణాలు చేపట్టవద్దని నిబంధనలు చెబుతున్నప్పటికి.. వాటికి తిలోదకాలు ఇస్తూ స్థిరాస్తి వెంచర్ ఏర్పాటు చేశారు. పక్కా రహదారులు, డ్రైనేజీ వ్యవస్థ నిర్మించి విద్యుద్దీపాలు ఏర్పాటు చేశారు. లేఅవుట్ పరిధిలో ప్లాట్లు నీటిలో మునిగిపోయాయి. రెండు పెద్దవర్షాలు పడితే నిండిపోయే ఈ చెరువులో ఏకంగా లేఅవుట్లు నిర్మించి కొల్లగొట్టినప్పటికీ హెచ్‌ఎండీఏ, రెవెన్యూ, పురపాలక, నీటిపారుదల శాఖాధికారులు ఏ మాత్రం స్పందించకపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. లేఅవుట్‌కు 2012 సంవత్సరంలో అప్పటి కలెక్టర్, జిల్లా నీటిపారుదలశాఖ ఉన్నతాధికారులు నిరభ్యంతర పత్రాలు(ఎన్‌వోసీ) జారీ చేశారు. 2021లో చెరువులో అక్రమ లేఅవుట్‌పై ప్రచురితమైన కథనానికి స్పందించిన అప్పటి భువనగిరి నీటిపారుదల శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని తహసీల్దార్, ఇతర ఉన్నతాధికారులకు పలుమార్లు లేఖలు రాసినా స్పందన లేకపోవడం గమనార్హం.

# నమ్మకంగా చేరి.. పనికానిచ్చేస్తున్నారు!



హైదరాబాద్: "జూన్‌లో కాచిగూడలో ఓ వ్యాపారి ఇంట్లో పనివాళ్లుగా చేరిన నేపాలీలు నమ్మకంగా మెలిగారు. ఆహారంలో మత్తు పదార్థం కలిపి రూ.కోట్ల విలువైన సొత్తు దోచుకెళ్లారు. నిందితులు ఇప్పటికీ దొరకలేదు." "ఫిబ్రవరిలో నారాయణగూడ ఠాణా పరిధిలో ఓ వ్యాపారి ఇంట్లో చోరీ జరిగింది. నిందితులు రూ.కోట్ల విలువైన బంగారం, వజ్రాలు, రూ.25 లక్షల నగదు చోరీ చేశారు. పనివాళ్లలా వచ్చిన నిందితులు ఇంట్లో యజమానులు లేని సమయం చూసి దోపిడీ చేశారు." డబ్బు, నగల కోసం కూకట్‌పల్లిలో ఇద్దరు పనివాళ్లు ఇంటి యజమానురాలిని దారుణంగా హతమార్చిన విషయం తెలిసిందే. నగరంలో ఈ తరహా నేరాలు తరచూ వెలుగుచూస్తున్నాయి.

జీతం తక్కువని.. పనివాళ్లలా చేరి చోరీలు చేస్తున్న ఉదంతాల్లో నిందితులు ఎక్కువగా ఇతర రాష్ట్రాలకు చెందిన వారు ఉంటున్నారు. వారు సెలవులు తీసుకోకుండా ఇళ్లు, దుకాణాలు, పరిశ్రమల్లో తక్కువ జీతానికే పనిచేస్తుంటారు. ఈ కారణంతో యజమానులు వారి కనీస వివరాలు సేకరించకుండా పనిలో పెట్టుకోవడం పెద్ద సమస్యగా మారుతోంది. నగరంలో నిర్మాణ రంగంతో పాటు అపార్టుమెంట్లలో పనిచేసేందుకు స్థానికంగా మానవ వనరుల కొరత ఉండటంతో.. ఇతర రాష్ట్రాల నుంచి ఎంతోమంది ఉపాధి కోసం వస్తున్నారు. వీరు వచ్చే ముందే అప్పటికే ఇక్కడ ఉన్న తమ పరిచయస్థుల సాయంతో నేరుగా యజమానుల వద్ద చేరుతున్నారు. ఏ పని చెప్పినా చేస్తూ కొన్నాళ్లు నమ్మకంగా ఉంటున్నారు. బంగారం, డబ్బు భారీగా ఉన్నట్లు గమనిస్తే... ఇంట్లో ఎవరూ లేని సమయం, వృద్ధులు ఉన్నప్పుడు దాడి చేసి దోచుకుంటున్నారు. కొన్ని ముఠాలు దోపిడీల కోసమే పనివాళ్లలా చేరుతున్నారు. మహిళలు యజమానుల్ని వలపు వలతో మోసగించి దొంగిలిస్తున్న ఘటనలూ నమోదవుతున్నాయి.

**నిఘా నామమాత్రం**

నగరానికి ఉపాధి, వివిధ అవసరాల నిమిత్తం వచ్చే వారి మీద నిఘా నామమాత్రంగా ఉంటోంది. కొత్త వ్యక్తుల రాకపోకల మీద సెక్టార్, బీట్ స్థాయిలో పోలీసులు స్థానికుల ద్వారా ఎప్పటికప్పుడు సమాచారం తీసుకోవాల్సి ఉన్నా ఆ ప్రక్రియ జరగడం లేదు. వాస్తవానికి నగరానికి వచ్చి గదులు అద్దెకు తీసుకునేవారి వివరాలను హొటళ్లు, లాడ్జీల నిర్వాహకులు కచ్చితంగా సేకరించాలి. బస చేసేవారి వివరాలు తూతూమంత్రంగా సేకరిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి.

**జాగ్రత్తలివీ...**

కొత్త వ్యక్తుల్ని పనిలో పెట్టుకునే ముందు ఒకటికి రెండుసార్లు ఆలోచించాలి. కచ్చితంగా నేపథ్యం తెలుసుకోవాలి.

తెలిసిన వారు సూచించినా.. ఆధార్‌కార్డు, తాజా ఫొటోలు, స్వగ్రామం అన్ని వివరాలు సేకరించాలి. పరిమితులేంటో నిర్దేశించాలి.


బంగారు ఆభరణాలు, నగదు ఎక్కువ మొత్తంలో ఇంట్లో ఉంచకుండా బ్యాంకు లాకర్లలో భద్రపరచాలి.

పనిలో పెట్టుకోవాలనుకున్న వ్యక్తి నేపథ్యం తెలుసుకోవడానికి.. అతడి ఆధార్‌కార్డు సమాచారంతో హ్యాక్ ఐ యాప్‌లో దరఖాస్తు చేసుకుంటే పదిరోజుల్లో వివరాలు అందిస్తామని పోలీసులు తెలిపారు.

దొంగతనం కేసులు

| | |
|---|---|
| 2023 | 116 |
| 2024 | 173 |

# మత్తు ఉచ్చు.. ఇంటింటా చిచ్చు



హైదరాబాద్: మాయదారి మత్తు ఇంటింటా చిచ్చుపెడుతోంది. హాయిగా సాగుతున్న కాపురాలను కుప్పకూల్చుతోంది. చదువులో టాపర్లు.. ర్యాంకర్లను కిందపడేస్తుంది. కార్పొరేట్ సంస్థల్లో ఉన్నతోద్యోగులను బానిసలుగా మార్చుతోంది. మహానగరం నలువైపులా వ్యాపిస్తున్న డ్రగ్స్ ఆందోళన కలిగిస్తోంది. మాదకద్రవ్యాల ఉచ్చులో చిక్కిన తమ వారిని ఏదో విధంగా బయటపడేసి కాపాడమంటూ రోజూ హెచ్‌న్యూ, ఈగల్ పోలీసులకు వందలాది ఫోన్‌కాల్స్ వస్తున్నాయి. దారికి రాకుంటే జైల్లో ఉంచైనా మహమ్మారి నుంచి కాపాడాలని ప్రాధేయపడుతున్నారంటూ పోలీసు ఉన్నతాధికారి తెలిపారు.

**తెలంగాణ ఈగల్ లెక్కలు**

తెలంగాణ ఎలైట్ యాక్షన్ గ్రూప్ ఫర్ డ్రగ్ లా ఎన్‌ఫోర్స్‌మెంట్(ఈగల్) ఇప్పటివరకూ రాష్ట్రవ్యాప్తంగా నమోదైన 15,847 కేసుల్లో 32,546 మందిని అరెస్ట్ చేశారు. రూ.150 కోట్ల విలువైన డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈగల్ గణాంకాల ప్రకారం కొనుగోలుదారుల వివరాలిలా ఉన్నాయి.

**మత్తు ప్రపంచంలో మాయలెన్నో..**

ఇప్పటివరకూ కేవలం ఒత్తిడి నుంచి ఉపశమనం.. కొత్త ఆనందాన్ని వెతుక్కునేందుకు డ్రగ్స్ రుచిచూస్తున్నట్టు భావించారు. తాజాగా పట్టుబడిన 20 మంది పురుషుల్లో 12 మంది శృంగార సామర్థ్యం కోసం గంజాయి, ఎండీఎంఏ వాడుతున్నట్టు చెప్పటంతో పోలీసులు ఉలిక్కిపడ్డారు. అదంతా అపోహ అంటూ వైద్యుల ద్వారా వారికి కౌన్సెలింగ్ ఇప్పించాల్సి వచ్చిందని పోలీసు అధికారి ఒకరు తన అనుభవాన్ని పంచుకున్నారు. డేటింగ్‌యాప్‌లు, వాట్సప్ గ్రూపుల్లో పరిచయాలతో సహజీవనం సాగిస్తున్న జంటల్లో అధికశాతం మాదకద్రవ్యాల అలవాటు ఉన్నవారే ఉన్నట్టు దర్యాప్తులో గుర్తించారు. హైటెక్ సిటీలో ఇటీవల ఈగల్ బృందం గంజాయి కొనుగోలు చేస్తున్న 100 మందిని అదుపులోకి తీసుకున్నారు. వారిలో నలుగురు భార్యాభర్తలు కలిసే మత్తు పదార్థాలు తీసుకుంటున్నట్టు గుర్తించారు. కొనుగోలుదారులపై కేసు నమోదు చేసి కౌన్సెలింగ్‌కు కుటుంబ సభ్యులను రప్పించినపుడు తమ ఇంట్లోనే డ్రగ్స్ తీసుకునే వ్యక్తులున్నట్టు తెలిసి కన్నీరు పెట్టుకుంటున్నారు.

# పుష్కరాల ఏర్పాట్లకు కసరత్తు



ధర్మపురి : గోదావరి పుష్కరాలు 2027 జులైలో జరగనున్నాయి. దీని కోసం రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటి నుంచే సన్నద్ధమవుతోంది. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రాలైన ధర్మపురి, కోటి లింగాల, మంథని, భూపాలపల్లి జిల్లాలోని కాళేశ్వరంలో పుష్కరఘాట్లు, వసతుల కల్పనపై ఉన్నతాధికారులు కసరత్తు ప్రారంభించారు. సరస్వతీ పుష్కరాల్లో హడావుడిగా చేపట్టిన పనుల్లో నాణ్యత లోపించింది. సమయం ఉన్నందున గోదావరి పుష్కరాల నిర్వహణను చరిత్రలో నిలిచిపోయేలా చేపట్టాలని ప్రభుత్వం భావిస్తోంది. 2015లో వచ్చిన గోదావరి పుష్కరాల్లో అప్పటి రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ కుటుంబ సమేతంగా ధర్మపురిలో పుష్కర స్నానాలు చేసి పూజలు చేశారు. ఈ నెల 17న రాష్ట్ర స్థాయి అధికారులతో ధర్మపురిలోనే పుష్కరాల ఏర్పాట్ల సన్నద్ధతపై ప్రత్యేక సమావేశం జరగనుంది. ఉమ్మడి జిల్లాలో ఎర్దండి, వాల్గొండ, వెంకట్రావుపేట, బోర్నపల్లి, కమ్మునూర్, రాజారాం, దమ్మన్నపేట, ధర్మపురి, కోటిలింగాల, రాయపట్నం, గోలివాడ, గోదావరిఖని, సుందిల్ల, మంథని, కాళేశ్వరం పుష్కర కేంద్రాలను ప్రాథమికంగా గుర్తించగా ఏర్పాట్లపై చర్చించనున్నారు.

**ధర్మపురి**

ఘాట్లు: 4 హాజరైన భక్తులు(2015 పుష్కరాలు): 70 లక్షలు

వచ్చే పుష్కరాలకు భక్తుల అంచనా : కోటికి పైగానే

ప్రస్తుత పరిస్థితులు: నాలుగు ఘాట్లకు స్వల్ప మరమ్మతు చేపట్టాల్సి ఉంది. 20 తాగునీటి ట్యాంకులు వృథాగా ఉన్నాయి. దుస్తులు మార్చుకునే గదులు లేవు. పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా ఉంది. మురుగు గోదావరిలో కలుస్తోంది.

పట్టాల్సిన పనులు: నది వద్దకు రహదారి అధ్వానంగా ఉంది. ధర్మపురికి రవాణా పరంగా ఇబ్బందులు ఉన్నాయి. పట్టణంలో అన్ని రహదారులను విస్తరించాలి. పురాతన తితిదే ధర్మశాల వద్ద నూతన వసతి గృహాలను ఏర్పాటు చేయాలి.

**కోటిలింగాల**

ఘాట్లు: 2 హాజరైన భక్తులు(2015 పుష్కరాలు): 30 లక్షలు

వచ్చే పుష్కరాలకు భక్తుల అంచనా : 40 లక్షలు

ప్రస్తుత పరిస్థితులు: దుస్తులు మార్చుకునే గదులను శాశ్వతంగా నిర్మించాలి. 20 మరుగుదొడ్లను ఏర్పాటు చేయాలి. తాగు నీటి కోసం శాశ్వత ప్రాజెక్టు చేపట్టాలి.

చేపట్టాల్సిన పనులు: ఆలయం వరకు రహదారి విస్తరణ చేపట్టాలి. నూతన విద్యుత్తు లైన్లు ఏర్పాటు చేయాలి.

**మంథని**

ఘాట్లు: ఒకటి

హాజరైన భక్తులు(2015 పుష్కరాలు): 12 లక్షలు

వచ్చే పుష్కరాలకు భక్తుల అంచనా : 24 లక్షలు

ప్రస్తుత పరిస్థితులు: గోదావరి తీరంలో మరిన్ని స్నాన ఘట్టాలు ఏర్పాటు చేయాలి. దుస్తులు మార్చుకునే గదులు, తాగు నీటి సమస్యలు ఉన్నాయి.

చేపట్టాల్సిన పనులు: రహదారి విస్తరణ చేపట్టాలి. విద్యుత్తు లైన్లను ఏర్పాటు చేయాలి.

**గోదావరిఖని**

ఘాట్లు: ఒకటి

హాజరైన భక్తులు(2015 పుష్కరాలు): 10 లక్షలు

వచ్చే పుష్కరాలకు భక్తుల అంచనా : సుమారు 20 లక్షలు

ప్రస్తుత పరిస్థితులు: పుష్కర స్నానాలకు అనుకూలంగా ఘాట్లు, మహిళలు దుస్తులు మార్చుకునే షెడ్లు ఉన్నాయి. గత పుష్కరాల సందర్భంగా హైదరాబాద్ ప్రాంతం నుంచి ఎక్కువ మంది వచ్చి స్నానాలు చేశారు. చేపట్టాల్సిన పనులు: రాజీవ్ రహదారి నుంచి పుష్కరఘాట్ వద్దకు రహదారికి మరమ్మతు, పారిశుద్ధ్యం, విద్యుత్తు సదుపాయాలు కల్పించాలి. **అద్భుతంగా తీర్చిదిద్దుతాం** రానున్న గోదావరి పుష్కరాలను అద్భుతంగా నిర్వహించేందుకు ప్రభుత్వం సన్నద్ధమవుతోంది. పుష్కరక్షేత్రాల అభివృద్ధికి సీఎం కృతనిశ్చయంతో ఉన్నారు. ఇప్పటికే ధర్మపురిపై రాష్ట్ర స్థాయిలో సమీక్ష జరిగింది. కోటిలింగాల, గోదావరిఖని, మంథని పుణ్యక్షేత్రాలను పుష్కరాలలోపు అద్భుతంగా తీర్చిదిద్దుతాం. ధర్మపురి దేవస్థానంలో ఆగమ పండితులు, వేద పండితుల సలహాలు స్వీకరించి దేవస్థానాన్ని అభివృద్ధి పరుస్తాం. లక్ష్మణ్‌కుమార్, రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి

# డబుల్ ధమాకా

భగత్‌నగర్ :"డబుల్ ధమాకా అంటే ఇదే కాబోలు.. దసరా వచ్చిందంటే ఆయా కంపెనీలు పోటాపోటీగా ఆఫర్లు ప్రకటించడం తెలిసిందే. విజయాలను తీసుకొచ్చే విజయదశమికి కొత్త వాహనాలు, వస్తువులను కొనుగోలు చేస్తుంటారు. ప్రజల సెంటిమెంటును దృష్టిలో పెట్టుకొని కంపెనీలు రాయితీలతో ఆకర్షిస్తుంటాయి. కంపెనీలు ప్రకటించే ఆఫర్లతోపాటు కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ తగ్గింపును ఈనెల 22 నుంచి వర్తింపజేయడంతో రెండు విధాలుగా వినియోగదారులకు కలిసిరానుంది. వాహనాలు, వస్తువులు, గృహోపకరణాల ధరలు తగ్గే అవకాశముంది. ఇప్పటికే పలు వాహన తయారీ కంపెనీలు జీఎస్టీ తగ్గింపుతో రూ.లక్ష నుంచి రూ.1.40 లక్షల వరకు ధరలు దిగివచ్చే అవకాశం ఉందంటూ ప్రకటనలు జారీ చేస్తున్నాయి.

**బుకింగ్ ఫుల్.. డెలివరీ నిల్**

కరీంనగర్‌లోని ఓ ప్రముఖ వాహన విక్రయ సంస్థ యజమాని తెలిపిన ప్రకారం.. కేంద్ర ప్రభుత్వం ఈనెల 3న జీఎస్టీ తగ్గింపు ప్రకటన ఇచ్చిన నాటి నుంచి వాహనాల బుకింగ్ జోరుగా సాగుతోందని.. ప్రస్తుతం వాహనాల డెలివరీ జరగడంలేదన్నారు. ఇప్పటి వరకు 50 వాహనాలు కొనుగోలు చేసిన వారు ఈనెల 22 తర్వాత డెలివరీ ఇవ్వాలని కోరుతున్నారని తెలిపారు. వివిధ మోడల్ కార్లను రోజుకు




సగటున 4 నుంచి 5 విక్రయిస్తే, జీఎస్టీ తగ్గింపుతో రాబోయే రోజుల్లో రోజుకు 8 నుంచి 10 వాహనాలు అమ్మే అవకాశముందని అంచనా వేస్తున్నామన్నారు.

**విపణిలో స్తబ్ధత..**

ఆన్‌లైన్ విక్రయాలు జరిపే సంస్థలు ఇప్పటికే పండగ ఆఫర్లను ప్రకటించి వినియోగదారులను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తున్నాయి. పేరొందిన కంపెనీల షోరూంలలో ఆఫర్ ప్రకటనలు జారీ చేయడానికి సిద్ధమవుతున్నాయి. వినియోగదారులు వస్తువుల ధరలు ఏమేర తగ్గుతాయా? అని అంచనా వేస్తూ కొనుగోలుకు ఎదురుచూస్తున్నారు. దీంతో ప్రస్తుతం మార్కెట్‌లో స్తబ్ధత నెలకొంది. వ్యాపారాలు వెలవెలబోతున్నాయి. కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ తగ్గింపు ప్రకటన జారీ నుంచి పలువురు కొనుగోలును వాయిదా వేస్తున్నారు. ఏదిఏమైనా ఈ దసరా పండగ కొనుగోలుదారులకు కలిసిరానుంది.

# స్థానికంగా కీమోథెరపీ

గోదావరిఖని : రాష్ట్రంలోని 34 బోధనాసుపత్రుల్లో డేకేర్ కేంద్రాలను ఏర్పాటు చేయడంతో ఆయా ప్రాంతాల్లోని క్యాన్సర్ బాధితులకు ఊరట కలగనుంది. సంగారెడ్డిలో మంగళవారం రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ వర్చువల్‌గా ప్రారంభించగా అందుబాటులోకి వచ్చాయి. కీమోథెరపీ చికిత్స కోసం హైదరాబాద్‌కు వెళ్లాల్సిన అవసరం లేకుండా బోధనాసుపత్రిలోని డేకేర్ కేంద్రాల్లో చికిత్స పొందనున్నారు. దీంతో క్యాన్సర్ బాధితులకు దూరాభారం తప్పనుంది. ఉమ్మడి జిల్లాలోని గోదావరిఖని, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్‌లోని బోధనాసుపత్రుల్లో డేకేర్ కేంద్రాలు అందుబాటులోకి వచ్చాయి.




**20 పడకలు..** ప్రతి బోధనాసుపత్రిలో 20 పడకలతో క్యాన్సర్ బాధితుల కోసం డేకేర్, పాలియేటివ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇద్దరు జనరల్ సర్జన్లతో పాటు అయిదుగురు నర్సింగ్ అధికారులకు ఇటీవల హైదరా బాదులోని ఎంఎన్‌జే క్యాన్సర్ ఆసుపత్రిలో రెండు రోజుల పాటు ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. కేంద్రాల నిర్వహణను పర్యవేక్షించేందుకు ఆసుపత్రి జనరల్ సర్జరీ విభాగాధిపతిని నోడల్ అధికారిగా నియమించారు. క్యాన్సర్ నిర్ధారణతో పాటు ప్రధాన చికిత్స ఎంఎన్‌జే ఆసుపత్రిలో అందిస్తారు. ఒక పర్యాయం కీమోథెరపీ ఇచ్చాక బాధితులను సంబంధిత జిల్లాలోని బోధనాసుపత్రికి పంపిస్తారు. ఎంఎన్‌జే ఆసుపత్రి వైద్యులు ఇచ్చిన మార్గదర్శనం(ప్రిస్కిప్షన్) ప్రకారంగానే డేకేర్ కేంద్రాల్లోని వైద్యులు చికిత్స అందిస్తుంటారు. పరిస్థితి తీవ్రతను బట్టి అవసరమైతే మళ్లీ వారిని ఎంఎన్‌జే ఆసుపత్రికి పంపిస్తారు. ఉదయం ఆసుపత్రిలో చేర్చుకొని కీమోథెరపీ చికిత్స ఇచ్చి సాయంత్రం ఇంటికి పంపిస్తారు. క్యాన్సర్ తీవ్రతతో చివరిదశలో ఉన్నవారికి పాలియేటివ్ కేర్ కేంద్రంలో చేర్చుకొని చికిత్స అందిస్తారు.

# క్రిప్టో కరెన్సీ పేరిట మోసం

కరీంనగర్ : క్రిప్టో కరెన్సీ పేరిట మోసాలు చేస్తూ నగదు వసూలు చేసిన నలుగురు నిందితులను కరీంనగర్ పోలీసులు పట్టుకున్నారు. మెటా ఫండ్ అనే నకిలీ ఆన్‌లైన్ ట్రేడింగ్ కంపెనీ పేరుతో ప్రజల్ని మభ్యపెట్టిన వారిని సీసీఎస్ పోలీసులు అరెస్ట్ చేశారు. సీసీఎస్ సీఐ ప్రకాశ్ కథనం మేరకు.. కరీంనగర్‌కు చెందిన పలువురిని హైదరాబాద్‌కు చెందిన వరాల లోకేశ్వర్‌రావు అనే వ్యక్తి కరీంనగర్‌లో కొందరి మధ్యవర్తుల ద్వారా మోసగించాడు. మెటా ఫండ్ యాప్‌లో పెట్టుబడి పెడితే పెట్టిన దానికి వడింతలు లాభం వస్తుందని నమ్మించాడు. ఇతనికి కరీంనగర్‌కు చెందిన బూర శ్రీధర్, తులసి ప్రకాశ్, దాసరి రమేశ్, దాసరి రాజులు సహకరించారు. వీరంతా కలిసి నగరంలోని 8 మంది బాధితుల నుంచి రూ.54.65 లక్షలు వసూలు చేశారు. స్థానికంగా ఉన్న శ్రీరామ టింబర్ డిపోలో ఈ నగదుని తీసుకుని బాధితులకు నకిలీ ఐడీలను అందించారు. అయితే కొన్నాళ్లకు మోసపోయామని తెలుసుకున్న బాధితులు ఈ నలుగురిని సంప్రదించగా తమకు తెలియదనడంతో పోలీసులను ఆశ్రయించారు. దీంతో జులై 17న ఈ నలుగురిపై కరీంనగర్ రెండో ఠాణాలో కేసు నమోదవగా నిందితులు పరారయ్యారు. హైదరాబాద్, విజయవాడలో పలుచోట్ల ఉన్నట్లు గుర్తించిన పోలీసులు ప్రత్యేక బృందాలుగా వెళ్లి అదుపులోకి తీసుకున్నారు. మొదట ఈ కేసును రెండో ఠాణా పోలీసులు దర్యాప్తు చేశారు. ఎక్కువ మంది ఉండే అవకాశం ఉండటంతో సీపీ గౌష్ ఆలం ఈ కేసుని సీసీఎస్ పోలీసులకు అప్పగించారు. ఈ కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న లోకేశ్వర్ రావు పరారీలో ఉండగా.. అతనికి సహకరించిన బూర శ్రీధర్, తులసి ప్రకాశ్, దాసరి రమేశ్, దాసరి రాజులను అరెస్ట్ చేసి న్యాయస్థానంలో హాజరు పర్చారున్యాయవర్తి ఆదేశాలతో వారిని జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించారు.

## ఖాళీ స్థలం.. అర్హులకు పట్టం

కర్నూలు : ఇళ్లు కాదు.. ఊళ్లు నిర్మిస్తున్నామంటూ గత ప్రభుత్వం 'గూడు'పులాటి నడిపింది.. సెంటు, సెంటున్నర చొప్పున ఇళ్ల స్థలాలు కేటాయించింది. పట్టాలు పొందిన వారిలో ఎక్కువమంది అనర్హులే ఉండటం.. స్థలాలు గ్రామాలకు దూరంగా ఉండటంతో చాలామంది నిర్మించుకోలేదు. ఆయా లేఅవుట్లలో ఖాళీగా ఉన్న స్థలాలను పట్టణ ప్రాంతాల్లో 2 సెంట్లు, గ్రామాల్లో 3 సెంట్ల చొప్పున అర్హులకు ఇచ్చేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధమవుతోంది.

**రద్దు చేసి.. కొత్త వారికిస్తారా**

గత ప్రభుత్వంలో అందరికీ ఇళ్లు పథకం కింద ఉమ్మడి జిల్లాలో 1,04,893 మందికి పట్టాలు మంజూరు చేశారు. 18,623 మంది పట్టాలు తీసుకోలేదు. పట్టాలను తీసుకున్నవారిలో 63,622 మంది ఇప్పటికీ నిర్మాణాలు చేపట్టలేదు.లబ్ధిదారులు 24 నెలల్లోగా ఇళ్లు నిర్మించుకోవాల్సి ఉంది. ఐదేళ్లయినా చాలామంది పనులు చేపట్టలేదు.



వారి పట్టాలను కూటమి ప్రభుత్వం రద్దు చేసి అర్హులకు ఇస్తుందా? లేక పాతవారే ఇళ్లు కట్టుకునేలా అవకాశం ఇస్తుందా అన్నది తేలాల్సి ఉంది.

**2,609 మంది అనర్హులకు ఇచ్చేశారు**

నివేశన స్థలం లేని నిరుపేదలకు పట్టాలు పంపిణీ చేయాల్సి ఉండగా.. గత ప్రభుత్వ హయాంలో వైకాపా నాయకులు, వాలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు కలిసి ఒకట్రెండు ఇళ్లున్న వారికి సైతం పట్టాలు పంపిణీ చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విజిలెన్స్ అధికారులతో విచారణ చేయించగా అక్రమాలు వెలుగులోకి వచ్చాయి. కర్నూలు జిల్లాలో 921, నంద్యాల జిల్లాలో 1,688 మంది కలిపి మొత్తం 2,609 మందిని అనర్హులుగా తేల్చారు.

**కుప్పలు తెప్పలుగా దరఖాస్తులు** 'హౌసింగ్ ఫర్ ఆల్' పథకానికి కూటమి ప్రభుత్వం ఈ ఏడాది ఆగస్టులో శ్రీకారం చుట్టింది. ఇంటి స్థలాలు లేని పేదల నుంచి దరఖాస్తులు ఆహ్వానించింది. ఉమ్మడి కర్నూలు జిల్లాలో 24,118 దరఖాస్తులు రాగా.. అందులో 2,246 వరకు ఆమోదం తెలిపారు. 2,770 దరఖాస్తులను తిరస్కరించారు. మిగిలిన వాటిపై విచారణ చేయాల్సి ఉంది.

## అనుగ్రహించాలి.. ఆ'మోదించాలి

శ్రీశైలం : శ్రీశైల క్షేత్ర అభివృద్ధికి పలు ఆటంకాలు ఎదురవుతున్నాయి. బృహత్తర ప్రణాళిక అమలుకు నిధుల కొరత వేధిస్తోంది. క్షేత్ర పరిసరాలు నల్లమల అడవుల్లో ఉండడంతో రహదారుల విస్తరణ కష్టసాధ్యంగా మారింది. శ్రీశైలానికి ఈనెల 16న ప్రధాని నరేంద్రమోదీ రానున్న నేపథ్యంలో దీర్ఘకాలిక సమస్యలు పరిష్కారమవుతాయని దేవస్థానం అధికారులు ఆశలు పెట్టుకున్నారు.

**మాస్టర్ ప్లాన్ మాటేమిటి..**

శ్రీశైల క్షేత్రాన్ని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసేందుకు 2010లో మాస్టర్‌ప్లాన్ అమలుకు శ్రీకారం చుట్టారు. అప్పట్లో రూ.600 కోట్లతో ప్రతిపాదించగా.. కేవలం రూ.200 కోట్లతో పనులు చేశారు. ముఖద్వారం నుంచి సాక్షి గణపతి ఆలయం వరకు వీరభద్ర జంక్షన్ పేరుతో నాలుగు వరుసల రోడ్డుగా విస్తరించాలన్న ప్రతిపాదన ఉంది. ఇక్కడ అలిపిరి తరహాలో టోల్‌గేటు ఏర్పాటుచేయాలని భావిస్తున్నారు. అటవీ భూమి అవసరం కావడంతో ఆచరణ సాధ్యం కావడం లేదు.

**వేధిస్తున్న ట్రాఫిక్ సమస్య**

శ్రీశైలంలో తరచూ ట్రాఫిక్ సమస్య వేధిస్తోంది. శ్రీశైలం ఆనకట్ట వద్ద నుంచి బ్రహ్మగిరి (తెలంగాణ ప్రాంతం) వరకు వందలాదిగా



వచ్చే కార్లు, ఇతర వాహనాలు ఘాట్ రోడ్డులో గంటల తరబడి ఆగిపోతున్నాయి. బ్రహ్మగిరి నుంచి ఆనకట్ట స్విచ్ యార్డు వరకు కొత్త వంతెన నిర్మాణానికి రూ.500 కోట్లతో నేషనల్ హైవే అథారిటీ ప్రతిపాదించింది.గతంలో హెలీ టూరిజం ప్రవేశపెట్టినప్పటికీ స్థలం కొరతతో ఆపేశారు. చిన్నపాటి విమానాశ్రయం ఏర్పాటుచేసినా అన్ని జ్యోతిర్లింగాలకు అనుసంధానం చేసినట్లవుతుందని భక్తులు అభిప్రాయపడుతున్నారు. ఈ నేపథ్యంలో వీటన్నింటికీ నిధులు మంజూరు చేయాలని పలువురు విన్నవిస్తున్నారు.

**తిరుమల, తిరుపతి తరహాలో..**

శ్రీశైలంలోని నివాసాలను సున్నిపెంటకు తరలించేందుకు 2016లో నిర్ణయం తీసుకున్నారు. శ్రీశైలాన్ని తిరుమల, సున్నిపెంటను తిరుపతి తరహాలో అభివృద్ధి చేయాలని సంకల్పించారు. శ్రీశైలం డెవలప్‌మెంట్ అథారిటీని ఏర్పాటు చేయాలని భావించారు. దీనికి కేంద్రం సహకారం అవసరమని యంత్రాంగం యోచిస్తోంది.

సున్నిపెంటలో అటవీశాఖకు చెందిన 480 ఎకరాలను శ్రీశైల దేవస్థానానికి కేటాయించారు. శ్రీశైలంలో నివసించే 3,250 మంది నిరుపేదలకు ఎన్టీఆర్ గృహాలు నిర్మించేందుకు పట్టాలు పంపిణీ చేశారు. పునరావాస ప్యాకేజీ అమలుచేస్తే ఇళ్ల నిర్మాణానికి పేదలు ముందుకొస్తారు.

సున్నిపెంటలో రూ.70 కోట్లతో దేవస్థానం రెగ్యులర్ ఉద్యోగుల కోసం క్వార్టర్స్ నిర్మించారు. శ్రీశైలం-సున్నిపెంట మధ్య 8 కి.మీ. దూరం ఉంది.. వంతెన నిర్మిస్తే 2.5 కి.మీ. దూరమే పడుతుంది. వంతెన పనులకు రూ.20 కోట్లవుతుంది. కేంద్రం చేయూతనివ్వాల్సి ఉంది. తీగల వంతెన నిర్మిస్తే పర్యాటకులను ఆకట్టుకోవచ్చు.

## రైతుల చింత.. కష్టాలు తొలగిస్తే నిశ్చింత



పుంగనూరు : ఉమ్మడి చిత్తూరు జిల్లాలో సుమారు 2,774 హెక్టార్లలో చింత తోటలు ఉన్నాయి. పంట చేతికి రాకముందే పెద్ద వ్యాపారులు కొనుగోలు చేసి పర్యవేక్షణ బాధ్యతలు రైతులకు అప్పగిస్తారు. దీంతో ధర పెరిగినా రైతుకు ఎలాంటి ఉపయోగం ఉండటం లేదు. ప్రస్తుతం నిల్వలు బడా వ్యాపారులు, శీతల గిడ్డంగుల యజమానుల ఆధీనంలో ఉన్నాయి. వచ్చే ఏడాది ఫిబ్రవరిలో మళ్లీ పంట కోతకు వస్తుంది. అప్పటి వరకు ధరలు తగ్గే అవకాశం లేదు.

చింత పండు ధరలు ఒక్కసారిగా పెరిగాయి. గత సీజన్‌లో వర్షాభావంతో తమిళనాడు, తెలంగాణ, మహారాష్ట్రలో దిగుబడులు తగ్గడంతో ఆ ప్రభావం ధరలపై పడింది. మన రాష్ట్రంతో పాటు కర్ణాటకలో పంట బాగానే పండినా బయటనుంచి తక్కువగా దిగుమతి కావడంతో నెలరోజుల వ్యవధిలో పరిస్థితి మారిపోయింది.

**25 వేల టన్నుల నిల్వలు..** పుంగనూరు, హిందూపురం, గుంటూరు, విజయవాడ, హైదరాబాద్ ప్రాంతాల నుంచి ఎగుమతులు, దిగుమతులు జరుగుతాయి. జిల్లాలో పుంగనూరు, పలమనేరు ప్రాంతాల్లోనే గిడ్డంగులు ఉన్నాయి. వీటిలో 25 వేల టన్నులు నిల్వ ఉంది.

**ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు**

సమస్య: రైతులు ఎక్కువగా చింతను కాకి, ముడిపంటగా విక్రయిస్తారు. అంటే చెట్టు నుంచి పండు కొట్టి నేరుగా అమ్మడం. ఇది రైతుకు తక్కువ లాభం అందిస్తుంది. ఎందుకంటే వినియోగదారులు, పరిశ్రములు ఎక్కువ ధర ఇవ్వడానికి ప్రాసెస్ చేసిన ఉత్పత్తిని కోరుతున్నాయి.

పరిష్కారం: ప్రాసెసింగ్ యూనిట్లు: గ్రామీణ ప్రాంతాల్లో, రైతు సంఘాల వద్ద చింతపండు శుభ్రపరచడం, వేపడం, గింజలు తొలగించడం తయారీ చేసే యూనిట్లను ఏర్పాటు చేయాలి.

మార్కెటింగ్ మద్దతు: ప్రాసెస్ చేసిన ఉత్పత్తులను స్థానికంగా, ఎగుమతి మార్కెట్లకు పంపే విధంగా లాజిస్టిక్స్ సౌకర్యాలు కల్పించాలి.

ఉప ఉత్పత్తుల విక్రయం: గింజలు, ఆకులు, వళ్లపొరలు ఫార్మాస్యూటికల్, ఆహారం, పరిశ్రమలకు అందించి అదనపు ఆదాయం పొందొచ్చు. చెట్టు అన్ని భాగాలతో రైతులకు లాభాలు కల్పించాలి.

చిత్తూరు జిల్లాలో చింత రైతులకు కావాల్సింది: చెట్ల సంరక్షణ ం ప్రాసెసింగ్ యూనిట్లు మార్కెట్ చేయూత

**ఉమ్మడి జిల్లాలో..**

2,774 హెక్టార్లు చింత పంట విస్తీర్ణం

20 వేల టన్నులు ఏటా లభ్యమయ్యేది

30 వేల టన్నులుఇతర రాష్ట్రాల నుంచి వచ్చేది

40 వేల టన్నులు గోదాముల్లో నిల్వలు

## తగ్గించినా తగ్గేదేలే..!




తిరుపతి : కేంద్రం వస్తు సర్వీసు పన్నులు (జీఎస్టీ) తగ్గించినా.. ఆ ఫలాలు వినియోగదారులకు చేరడం లేదు. గత నెల 21 నుంచి తగ్గింపు జీఎస్టీ అమల్లోకి వచ్చినా.. వ్యాపారులు ఇప్పటికీ ఎంఆర్పీకే విక్రయిస్తున్నారు. అధికారులు, నాయకులు అవగాహన కల్పిస్తున్నా.. క్షేత్రస్థాయిలో భిన్నమైన పరిస్థితి నెలకొంది.

**బిల్లుల్లో కానరాని బెనిఫిట్**

వాహనాలు, ఎలక్ట్రికల్ తదితర లగ్జరీ వస్తువులపై 26 శాతం నుంచి 18 శాతానికి, కొన్ని రకాలపై 12 శాతం నుంచి 5 శాతానికి తగ్గించారు. ఔషధాలపై 12 శాతం ఉండగా, పూర్తిగా రద్దు చేశారు. గత ఎమ్మార్పీ ప్రకారం బిల్లు వేయాల్సి వస్తే జీఎస్టీ బెనిఫిట్ నమోదు చేసి మిగిలిన మొత్తం వినియోగదారుల నుంచి తీసుకోవాలి. ఇలాకాకుండా ఎమ్మార్పీనే తీసుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

**కనిపించని బోర్డులు**

తగ్గింపు జీఎస్టీ ఫలాలు అందని వినియోగదారులు ఎవరికి ఫిర్యాదు చేయాలో తెలియడం లేదు. చిత్తూరు, తిరుపతి జిల్లాలోని 9 సర్కిల్ జీఎస్టీ కార్యాలయాల్లో హెల్ప్‌డెస్కులు పెట్టినట్లు అధికారులు ప్రకటించారు. కలెక్టరేట్లో కమాండ్ కంట్రోల్ డెస్క్ ఏర్పాటు చేశారు. అక్కడికి వెళ్లి ఫిర్యాదు చేయాలి. ఫోన్ నంబర్లు ఇవ్వకపోవడంతో చాలామంది మిన్నకుండిపోతున్నారు. చాలా దుకాణాల్లో తగ్గింపు బోర్డులు పెట్టనేలేదు.

ఫిర్యాదు చేయాల్సిన టోల్ ఫ్రీ నంబరు: 87126 31280

**తగ్గించకపోగా బెదిరింపులు**

ఇంటి వైరింగ్‌కు తిరుపతి శ్రీదేవి కాంప్లెక్స్‌లోని ఓ ఎలక్ట్రికల్ షాపుకెళ్లా. రూ.65,300 బిల్లు అయింది. జీఎస్టీ రూపాయి కూడా తగ్గలేదు. మళ్లీ బిల్లు పెరుగుతుందని బెదిరించడంతో రూ.50వేలు చెల్లించి కొంత సరుకు తీసుకొన్నా. జీఎస్టీ తగ్గినా.. ఫలం అందలేదు.

దామోదరం నాయుడు, వేదాంతపురం

**అవగాహన కల్పిస్తున్నాం..**జీఎస్టీ తగ్గింపు రేట్లతో వస్తువులు విక్రయించాలి వ్యాపారులకు అవగాహన కల్పిస్తున్నాం. ఇందుకు ఆయా దుకాణాల ముందు తగ్గింపు రేట్ల పట్టికల ఏర్పాటుకు ఆదేశించాం.

నాగేంద్ర, కమర్షియల్ అడిషనల్ కమిషనర్, తిరుపతి

## అనగనగా ఓ బకింగ్‌హామ్



సూళ్లూరుపేట: బకింగ్‌హామ్ కాలువ పేరు విననివారు ఉండరు. ఇప్పుడు అనగనగా ఓ కాలువుండేది.. బ్రిటిష్ కాలంలో జల రవాణాకు ఎంత కీలకంగా ఉపయోగపడిందని నేటి తరానికి చెప్పుకోవాల్సిన దుస్థితి. ఈ కాలువ ఆనవాళ్లు లేకుండా ఆక్రమణలకు గురవుతోంది. దీని ఆధునికీకరణకు గతంలో చేసిన ప్రతిపాదనలు కాగితాలకే పరిమితమయ్యాయి.

**సర్వే చేసినా..**

కొన్నేళ్ల కిందట కేంద్ర ప్రభుత్వం జల రవాణాకు పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు చర్యలు చేపట్టింది. ఈ నేపథ్యంలో జిల్లా మీదుగా వెళ్లే జాతీయ జల రవాణా మార్గం-4 బకింగ్‌హామ్ కెనాల్ తెరపైకి వచ్చింది. 2017లో ఇంజినీర్లు సర్వే చేసి రూ.3,500 కోట్లతో డీపీఆర్లు తయారు చేసి కేంద్రానికి పంపించారు.

బకింగ్‌హామ్ కెనాల్‌లో పడవలు వెయ్యి టన్నులతో ఎదురెదురుగా ఏకకాలంలో ప్రయాణించాలి. రెగ్యులేటర్లు, లాక్ లాంఛర్ల వద్ద ఒక్కోవైపు 12 మీటర్ల చొప్పున ఇరువైపులా 24 మీటర్లు ఉండాలి. కాలువలో నీటి ఉపరితలం నుంచి ఏడు మీటర్ల మేర ఖాళీ జాగా అవసరం. కెనాల్ 140 మీటర్ల వెడల్పు, 6 మీటర్ల లోతు ఉండాలి. వంతెనలు, యూటీ టెక్నిల్(అండర్ టెక్నిల్) అక్విడక్టులు, సూపర్ పాసేజ్‌లు, రోడ్ల నిర్మాణం పునర్నిర్మించాలి.

జల రవాణాకు కాలువ విస్తరణ బెర్సిన్స్, గోదాములు, ఇరువైపులా రోడ్లకు కొంత భూమి కావాలి.

కెనాల్‌లో నీటి ప్రవాహ వేగం అలైన్‌మెంట్ సమగ్ర సర్వే చేయాలి.

**ఘనమైన చరిత్ర** ఈ కాలువ తవ్వకాన్ని 1803లో ప్రారంభించి 1899లో పూర్తి చేశారు.నెల్లూరు, తిరుపతి జిల్లాల పరిధిలో 178 కి.మీ.లు మేర కెనాల్ విస్తరించింది.

## వ్యర్థం.. ఇదే పరమార్థం

చిత్తూరు : రాష్ట్రంలోని డంపింగ్ యార్డుల్లో గత ఐదేళ్లలో నగరపాలికలు, పురపాలికల్లో 85 లక్షల టన్నుల చెత్తను తొలగించలేదు. ఈ ఏడాది డిసెంబరు నాటికి విభజించి కాలుష్య నియంత్రణ చర్యలు చేపడుతున్నాం. అసెంబ్లీ పురపాలక శాఖ మంత్రి నారాయణ ఉమ్మడి జిల్లాలోని చిత్తూరు, తిరుపతి కార్పొరేషన్లు, పుత్తూరు, శ్రీకాళహస్తి, గూడూరు, వెంకటగిరి, సూళ్లూరుపేట, నాయుడుపేట, కుప్పం, పలమనేరు, నగరి, పుంగనూరు పురపాలికలను స్వచ్ఛతగా మార్చనున్నారు. ఈ పట్టణాల్లో పోగయ్యే వ్యర్థాలను జాతీయ హరిత ట్రిబ్యునల్(ఎన్జీటీ) ఆదేశాలతో మూడు నెలలుగా డంపింగ్ యార్డుల్లో రీసైక్లింగ్ చేపట్టారు. కాలుష్యాన్ని తగ్గించి పట్టణాలకు ఊపిరి పోయనున్నారు.కూటమి ప్రభుత్వం ఎన్జీటీ మార్గదర్శకాలను పాటిస్తూ యంత్రాల ద్వారా వ్యర్థాల నుంచి మట్టి, రాళ్లు, ప్లాస్టిక్ వేరు చేస్తున్నారు. అక్టోబరు2 నాటికి దీన్ని పూర్తి చేసి యార్డుల్లో ఒక్క గుట్ట లేకుండా చేయాలన్న లక్ష్యంతో ప్రారంభించారు. అయితే కొన్ని నగర, పురపాలికల్లో వ్యర్థాలు అనుకున్న దాని కంటే ఎక్కువగా ఉండటంతో ఆలస్యం అవుతోంది. 2025 డిసెంబరు నాటికి లక్ష్యంగా నిర్దేశించారు. ఇది



పూర్తయితే భూ, జల కాలుష్యం తగ్గిపోతుంది. వ్యర్థాలు కాల్చే సమస్య ఉండదిక.వ్యర్థాలు 12 లక్షల టన్నులు

ఇప్పటి వరకు విభజన 6.54 లక్షల టన్నులు

ఇంకా చేయాల్సింది 5.46 లక్షల టన్నులు

## తట్టెడు మట్టేసి.. నిధులు మింగేసి

పత్తికొండ: ఉమ్మడి కర్నూలు జిల్లాలో చెరువుల అభివృద్ధి కాగితాలకే పరిమితమైంది. నిధులు మంజూరు చేసినా పనులు చేయకుండా కాజేశారే తప్ప ఎలాంటి పనులు చేపట్టలేదు. చెరువుల్లో తూతూమంత్రంగా మట్టి పనులు చేసి మమ అనిపించారు. అప్పటి పాలకులు, ప్రజాప్రతినిధులకు మామూళ్లు ఇచ్చి అన్నీ పూర్తి చేసినట్లు సొమ్ము మింగేశారు. హంద్రీనీవా కాలువ నీటితో ఉమ్మడి జిల్లాలోని మద్దికెర, తుగ్గలి, పత్తికొండ, కృష్ణగిరి, డోన్, ప్యాపిలి మండలాల్లోని 68 చెరువులను నింపే కార్యక్రమం చేపట్టారు. ఇందులో భాగంగా గత వైకాపా ప్రభుత్వం కొన్ని చెరువులను గుర్తించి వాటిని అన్నివిధాలా అభివృద్ధి చేయాలని నిర్ణయించింది. పత్తికొండలో 3 చెరువులు, తుగ్గలిలో 12, మద్దికెరలో ఒక చెరువును అభివృద్ధి చేసేందుకు గత సర్కారు నిధులు మంజూరు చేసింది. చెరువుల్లో పనుల పేరుతో నిధులు పక్కదారి పట్టించారు.

**శిథిలావస్థలో తూములు**

650 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న మదనంతపురం చెరువు కింద 750 ఎకరాల ఆయకట్టు ఉంది. లింగాల వాగు నుంచి దీనికి నీరొస్తుంది. ప్రస్తుతం తూములు శిథిలమయ్యాయి. గత ప్రభుత్వ హయాంలో రూ.4.50 కోట్లతో పనులు చేపట్టినా తూముల మరమ్మతులు పట్టించుకోలేదు. చెరువులో మట్టి పని, ఎడమ కాలువ పునర్నిర్మాణం, స్లూయిస్‌ల పనులు చేసినట్లు అధికారులు చెబుతున్నారు. కొంత మేరకు చెరువులో మట్టి తొలగింపు పనులు చేశారు. ఆపై ఎలాంటి నిర్మాణం చేపట్టలేదు.



**రూ.26.50 కోట్లు మంజూరు**

మద్దికెర, తుగ్గలి మండలాల పరిధిలో 13 చెరువులను అభివృద్ధి చేసేందుకు గత వైకాపా ప్రభుత్వం రూ.26.50 కోట్లు మంజూరు చేసింది. మద్దికెర మండలం మదనంతపురం చెరువుకు రూ.4.50 కోట్లు, తుగ్గలి మండలం జొన్నగిరి చెరువుకు రూ.5.50 కోట్లు, మిగిలిన 11 చెరువులకు రూ.16.50 కోట్లు మంజూరు చేసింది. ఈ నిధులతో పనులు చేపట్టినట్లు చెబుతున్నా ఎక్కడా కనిపించడం లేదు.

**పూర్తిగా విస్మరించారు: తిమ్మన్న, సాగునీటి సంఘం మాజీ అధ్యక్షుడు, జొన్నగిరి**

జొన్నగిరి చెరువును వైకాపా హయాంలో రూ.5.50 కోట్లతో అభివృద్ధి చేస్తున్నామని అప్పటి అధికారులు చెప్పి ప్రజలను, రైతులను మభ్యపెట్టారు. ఇక్కడ ఎలాంటి పనులు జరగలేదు. దీంతో కట్ట పూర్తిగా దెబ్బతింది. నీరు వృథా అవుతోంది. ఫలితంగా రైతులు నష్టపోయే పరిస్థితి నెలకొంది.నీటిపారుదల శాఖ ఏఈ ధర్మేంద్ర మాట్లాడుతూ జొన్నగిరి చెరువులో గతంలో వివిధ పనులు చేపట్టారని.. వర్షాలకు కట్ట శిథిలమైందని చెప్పారు. మరమ్మతుల కోసం ఎస్టిమేట్ నిధుల కింద రూ.7 లక్షలకు ప్రతిపాదనలు పంపినట్లు పేర్కొన్నారు.

## అడుగులు పడుతున్నాయ్

నంద్యాల : నంద్యాల పట్టణంలో గత వైకాపా ప్రభుత్వ హయాంలో పనులు ప్రారంభమై ఆగిపోయిన తెలుగుగంగ, ఎస్సార్బీసీ సర్కిల్-1 కార్యాలయ భవన నిర్మాణాలు మరోసారి తెరపైకి వచ్చాయి. ఈ పనులను తిరిగి ప్రారంభించేలా కూటమి ప్రభుత్వం దృష్టి పెట్టింది. నంద్యాల కేసీ కాలువ కాంపౌండ్‌లోని తెలుగుగంగ క్వార్టర్స్ స్థలంలో తెలుగుగంగ కార్యాలయ పరిపాలన భవనం, ఎస్సార్బీసీ సర్కిల్-1 కార్యాలయం భవన నిర్మాణాలకు సంబంధించి కూటమి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్య భవనాల విభాగంలో చేర్చింది. ఇటీవలే ఈ భవనాల నిర్మాణాలకు సంబంధించిన ద్రస్తాలను జలమండలి శాఖ ఉన్నతాధికారులు రాష్ట్ర ప్రభుత్వానికి నివేదించారు.

శిథిలావస్థకు చేరుకుని..

40 ఏళ్ల కిందట నిర్మించిన తెలుగుగంగ కార్యాలయం ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకుంది. కార్యాలయంలోని కొన్ని భవనాల పైకప్పులు ఎప్పుడు కూలుతాయో తెలియని పరిస్థితి నెలకొంది. ఎస్సార్బీసీ కాలనీలోని ఎస్సార్బీసీ సర్కిల్-1 భవనం పరిస్థితి ఇలానే ఉంది. ఈ రెండు కార్యాలయాల్లో విధులు నిర్వహించేందుకు అధికారులు, సిబ్బంది భయపడుతున్నారు. కనీసం మరుగుదొడ్ల సౌకర్యం కూడా లేదు.

**నిధులివ్వడంలో నిర్లక్ష్యం**

టీజీపీ, ఎస్సార్బీసీ సర్కిల్-1 కార్యాలయ భవన నిర్మాణాలకు



సంబంధించి గత ప్రభుత్వ హయాంలో 2021లో రూ.5.25 కోట్లు మంజూరయ్యాయి. గుత్తేదారుడికి పనులు అప్పగించారు. నిర్మాణంలో భాగంగా పాత క్వార్టర్లను కూల్చివేశారు. నిర్మాణ పనులు కొంతమేర జరిగాయి. అప్పటి ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో పనులు ఆగిపోయాయి. మరోవైపు నిర్మాణ పనుల పర్యవేక్షణ బాధ్యతలను నీటి పారుదల శాఖ విభాగానికి ఇవ్వకుండా ఇష్టానుసారంగా కేటాయించారు.

**గతంలో స్థలం ఎంపిక చేసినా..**

2005లో ఇదే క్వార్టర్స్ ప్రాంతంలో రాయలసీమ స్థాయి జల వనరుల కాంప్లెక్స్ నిర్మించాలని అప్పటి ప్రభుత్వం ప్రతిపాదనలు తయారు చేసింది. కేసీ కాల్వ, తెలుగుగంగ, ఎస్సార్బీసీ, గురు రాఘవేంద్ర, ఎల్ఎల్సీ, తుంగభద్ర, జీఎన్ఎస్ఎస్, హెచ్ఎన్ఎస్ఎస్ తదితర అన్ని ప్రాజెక్టుల సీఈలు, ఎస్ఈల కార్యాలయాలు ఇక్కడే ఏర్పాటు చేసేలా ప్రయత్నాలు జరిగాయి. ఆ తర్వాత అడుగులు పడలేదు. అప్పట్లో ఎంపిక చేసిన స్థలంలోనే ప్రస్తుతం రెండు సర్కిల్ కార్యాలయాలను నిర్మించనున్నారు.

# ఊపిరి తీస్తున్న ఊబలు..

రాజమహేంద్రవరం : ఇటీవల కాలంలో గోదావరి నదిలో ప్రమాదశాతు జారిపడి గల్లంతైన వారి సంఖ్య పెరుగుతోంది. గత రెండు వారాల్లోనే నలుగురు మృతి చెందారు. ఈ ఏడాది 20 మందికి పైగానే నదిలో గల్లంతై ప్రాణాలు కోల్పోయారు. ఆయా ఘాట్‌ల వద్ద భద్రతా చర్యలు తీసుకోకపోవడంతోపాటు నదిలో పూడిక తీత (డ్రెడ్జింగ్)ను యంత్రాంగం విస్మరించడమే దీనికి కారణాలవుతున్నాయి. నదీ సమతుల్యత కాపాడే ప్రక్రియలో భాగంగా ఏటా నదిలో పూడిక తీత చేయాల్సి ఉంది. పుష్కరాలు సమీపిస్తున్నా.. దీనిపై నీటిపారుదల శాఖ దృష్టిసారించకపోవడం గమనార్హం.

**ఏటా 2 శాతం మేటలు**

ఏటా నదికి వరద తాకిడి ఉంటుంది. ఉత్తరాది రాష్ట్రాల్లో వర్షాల



కారణంగా నదిలోకి వరద నీరు చేరుతుంది. ఏటా రెండు శాతం మేర నదిలో ఇసుక మేట వేస్తున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. ఏటా నీరు నిల్వ ఉన్న చోట మేటలు తగ్గించేందుకు డ్రెడ్జింగ్ చేస్తారు. టెండర్లు పిలిచి యంత్రాల సాయంతో ఈ ప్రక్రియ చేపడతారు. ప్రధానంగా ఘాట్‌ల వద్ద పూడిక తొలగిస్తుండాలి.లేకపోతే నాచు పెరిగి, నదిలోకి దిగిన వారు ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉంది.

**సమీపిస్తున్న పుష్కరాలు**

ఇప్పటికీ నదిలో పూడిక తొలగింపు పనులు చేపట్టకపోవడంతో రానున్న పుష్కరాలకు భక్తులకు భద్రత ప్రశ్నార్థకంగా మారింది. గత పుష్కరాలకు ముందుగానే ఈ ప్రక్రియ పూర్తి చేశారు. ఓఎన్‌జీసీ సంస్థకు చెందిన రెండు యంత్రాలు నదిలో నెల రోజుల పాటు ఈ పనులు చేపట్టాయి. నదిలో మేటలు, ఊబలు లేకుండా జాగ్రత్తలు తీసుకున్నారు.

# ఇళ్ల స్థలాల లెక్క తేలింది

కాకినాడ : జిల్లాలోని జగనన్న కాలనీల్లో ఖాళీ స్థలాల లెక్క తేలింది. గత ప్రభుత్వంలో జిల్లా వ్యాప్తంగా 1,500 ఎకరాల భూమిని సుమారు రూ.1,300 కోట్లు వెచ్చించి అప్పట్లో కొనుగోలు చేశారు. మార్కెట్‌ధర కన్నా ఎక్కువకు కొని రూ.కోట్లలో కమీషన్లు కొట్టేశారు. అప్పట్లో పట్టాలు ఇచ్చిన పేదలకు ఈ స్థలాలను అప్పగించకుండా నిరుపయోగంగా వదిలేశారు. దీంతో వేల సంఖ్యలో పేద కుటుంబాలు గూడుకు దూరమయ్యాయి. కూటమి ప్రభుత్వం వచ్చాక.. వాటిల్లో ఖాళీ స్థలాల గుర్తింపునకు చర్యలు చేపట్టారు. మండలాల వారీగా రెవెన్యూ శాఖ ద్వారా లెక్క తేల్చారు. వీటిని ప్రస్తుతం అందరికీ ఇళ్ల పథకంలో దరఖాస్తు చేసిన పేదలకు పల్లెల్లో 3 సెంట్లు, పట్టణాల్లో 2 సెంట్లు చొప్పున కేటాయింపునకు కసరత్తు మొదలుపెట్టారు.

**కొత్తగా 25,664 దరఖాస్తులు**

కూటమి ప్రభుత్వం వచ్చాక.. అందరికీ ఇళ్లు పథకం కింద అర్హులైన



పేదల నుంచి ఇళ్ల స్థలాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా గ్రామీణంలో 8,600, పట్టణాల్లో 17,064 మంది దరఖాస్తు చేశారు. వీరికి పల్లెల్లో 3 సెంట్లు, పట్టణాల్లో 2 సెంట్లు చొప్పున కేటాయింపునకు 598 ఎకరాలు అవసరమని గుర్తించారు. ప్రస్తుతం జగనన్న కాలనీల్లో 89.49 ఎకరాలు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయి. మిగతా భూమిని సేకరించి, త్వరలో అందజేతకు ఏర్పాట్లు చేస్తున్నారు. అందుబాటులో ఉన్న స్థలాలను గుర్తించామని, అవసరమైన భూములకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తామని డీఆర్వో వెంకటరావు తెలిపారు.

గతంలో పట్టాలు పొందిన లబ్ధిదారులు గృహ నిర్మాణాలు ప్రారంభించకపోయినా.. స్థలాలు వెనక్కి తీసుకునే ప్రతిపాదన ఏమీ లేదని అధికారులు చెబుతున్నారు.

ఈ కాలనీల్లో పక్కపక్కనే రెండు ప్లాట్లు ఖాళీగా ఉంటే వాటినే కొత్తవారికి కేటాయిస్తారని చెబుతున్నారు.

ఇప్పటికే పట్టాలు పొందిన వారిలో అనర్హులు ఉంటే.. వారిని తొలగించే అంశం.. ప్రభుత్వ నిర్ణయంపై ఆధారపడి ఉంటుంది.

# కొత్త గురువులొస్తున్నారు..!

పి.గన్నవరం : కూటమి ప్రభుత్వం చొరవ తీసుకుని మెగా డీఎస్సీ ప్రకటించి విజయం సాధించిన ఉపాధ్యాయులకు నియామక పత్రాలు అందించింది. వీరికి ఈ నెల 3 నుంచి ప్రారంభమైన శిక్షణ తరగతులు 10 వరకూ కొనసాగనున్నాయి. అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో మెగా డీఎస్సీ ప్రకటించక ముందు 580 మంది ఉపాధ్యాయుల పోస్టులు భర్తీ చేయాల్సి ఉండగా ఈ ఏడాది మేలో బదిలీలతో 117 పోస్టులు ఖాళీ అయ్యాయి. మొత్తం 697 పోస్టులు నూతన ఉపాధ్యాయుల రాకతో భర్తీ కానున్నాయి. ఈ నెల 13 నుంచి కొత్త ఉపాధ్యాయులు విధుల్లో చేరతారు. గత ప్రభుత్వం డీఎస్సీ ప్రకటించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించింది. సంవత్సరాల తరబడి పాఠశాలల్లో వివిధ సబ్జక్టు టీచర్లు లేకపోవటంతో విద్యావ్యవస్థ గాడి తప్పింది.

'మెగా డీఎస్సీతో జిల్లాలో ఖాళీగా ఉన్న 697 ఉపాధ్యాయుల పోస్టులు భర్తీ అవుతాయి. పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత తీరుతుంది. ప్రస్తుతం నూతన ఉపాధ్యాయులకు ఇస్తున్న శిక్షణ తరగతులు 10వ తేదీతో ముగుస్తాయి. 13 నుంచి ఆయా పాఠశాలలకు కేటాయిస్తాం.' అని డీఈవో షేక్ సలీంబాషా అన్నారు.

జిల్లాలో పాఠశాలలు 1,563
మొత్తం విద్యార్థులు 89,672
బాలురు 42,799 బాలికలు 46,873
భర్తీ కానున్న పోస్టులు 697
ఎస్‌జీటీ తెలుగు 234

# పాలసముద్రంలో మోగనున్న 'బెల్'



సోమందేపల్లి : దేశంలో రక్షణ శాఖకు సంబంధించిన కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్(బీహెచ్‌ఈఎల్)ను గోరంట్ల మండలంలోని పాలసముద్రం సమీపంలో నిర్మించేందుకు 2014లో అప్పటి కేంద్ర రక్షణశాఖ మంత్రి మనోహర్‌పారికర్, రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు భూమిపూజ చేశారు. అనంతరం చాలాకాలం పనులు ముందుకు సాగలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ప్రస్తుత కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలాసీతారామన్ చొరవతో నాసిన్ (నేషనల్ అకాడమీ ఆఫ్ కస్టమ్స్, ఇండైరెక్ట్ ట్యాక్సెస్ అండ్ నార్కొటిక్స్) శిక్షణ కేంద్రం ప్రారంభమైంది. నాసిన్‌కు ఆనుకుని ప్రస్తుతం బీహెచ్‌ఈఎల్ పనులు శరవేగంగా సాగుతున్నాయి. అంతర్గత రహదారులు, ప్రహరీ పనులు పూర్తయ్యాయి. మరోవైపు సౌరశక్తి ఉత్పత్తి ప్రారంభమైంది. ప్రస్తుతం ప్రధాన ద్వారం, ఆవరణలో అవసరమైన భవన నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి.

**మరో మైలురాయి దాటుతున్న శ్రీసత్యసాయి జిల్లా**

దేశంలోనే ప్రతిష్ఠాత్మకమైన బీహెచ్‌ఈఎల్ కంపెనీ శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండ నియోజకవర్గంలో ఏర్పాటు అవుతుండటంతో జిల్లాకు మరోఖ్యాతి లభించబోతోంది. అందులోనూ పెనుకొండ నియోకజవర్గం అభివృద్ధిలో మరో పదడుగులు ముందుకు పడనుంది. ఇప్పటికే అంతర్జాతీయ స్థాయిలో కియా కార్ల కంపెనీ, అనుబంధంగా 18 సంస్థలు, మరోవైపు నాసిన్ కొనసాగుతున్నాయి. వీటితో పాటు బెల్ కంపెనీ నిర్మాణంతో ఈ ప్రాంతం మరింత అభివృద్ధి చెందుతుందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

సంస్థ: భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్
ఎక్కడ: గోరంట్ల మండలం, పాలసముద్రం పంచాయతీ, మిషన్‌తండా వద్ద
సేకరించిన భూమి: 913 ఎకరాలు

# పురం స్థలం.. పరాధీనం



గుత్తి : పురపాలికల్లో పాఠశాలలు, ఆలయాలు ఇతర ప్రజల అవసరాల కోసం కేటాయించిన రూ.కోట్లు విలువైన స్థలాలు అన్యాక్రాంతం అవుతున్నాయి. ప్రభుత్వ స్థలాన్ని పరిరక్షించాల్సిన అధికారులు కార్యాలయాలకే పరిమితమవుతున్నారు. గుత్తి, తాడిపత్రి, గుంతకల్లు పట్టణాల్లో రాజకీయ అండదండలున్న కొందరు నాయకులు భూములను కబ్జా చేస్తున్నారు. దర్జాగా ఇళ్లు, భవంతులు నిర్మిస్తున్నారు. పట్టణ ప్రణాళిక అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదన్న విమర్శలు ఉన్నాయి. అధికారుల అలసత్వాన్ని ఆసరాగా చేసుకుంటూ అక్రమార్కులు యథేచ్ఛగా ఆక్రమణలకు పాల్పడుతున్నారు.

బోగస్ పట్టాలు సృష్టించి.. నిర్మాణాలు

గుత్తి, తాడిపత్రి, గుంతకల్లు పట్టణాల్లో మొత్తం రూ.13.50 కోట్ల స్థలాలు పరులపాలయ్యాయి.

గుత్తిలోని బీసీ కాలనీలో ఓ నాయకుడు రజకులతో సొమ్ము వసూలు చేసుకుని బోగస్ పట్టాలు సృష్టించి ఇప్పించాడు. అక్కడ రూ.కోటి విలువైన స్థలంలో అక్రమ నిర్మాణాలు సాగుతున్నాయి.

తాడిపత్రి రోడ్డులో సుమారు రూ.50 లక్షలు విలువైన స్థలాన్ని ఓ ప్రజాప్రతినిధి ఆక్రమించాడు. ఆ స్థలంలో భవనాలు, దుకాణ సముదాయాన్ని నిర్మించి అద్దెకు ఇచ్చాడు. ప్రతినెలా బాడుగల రూపంలో పెద్ద ఎత్తున వసూలు చేస్తున్నాడు. గుత్తి మేజర్ పంచాయతీగా ఉన్నప్పుడే తాడిపత్రిరోడ్డులో రిజర్వుడు స్థలం కబ్జాకు గురైంది.

గుంతకల్లు పట్టణంలోని మొదీనాబాదు, తిలక్‌నగర్, మారుతీనగర్‌లలో రూ.6 కోట్లు విలువైన రిజర్వుడు స్థలాలు అన్యాక్రాంతం అయ్యాయి. తాడిపత్రిలోని శ్రీనివాసనగర్, సంజీవనగర్‌తోపాటు ఆరు కాలనీల్లో పరిస్థితి ఇలాగే ఉంది.

అక్రమంగా రిజిస్ట్రేషన్లు

రిజర్వుడు స్థలాల్ని అక్రమంగా రిజిస్ట్రేషన్లు చేసుకుంటూ, ఇతరులకు విక్రయిస్తూ రూ.కోట్లు సొమ్ము చేసుకుంటున్నారు. అధికారులు సైతం ప్రభుత్వానికి ఫీజులు వస్తే చాలన్నట్లు పరిశీలించకుండానే రిజిస్ట్రేషన్ పూర్తి చేస్తున్నారు. ఈ వ్యవహారంలో అధికారులకు మాముళ్లు అందుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి

**పరిశీలించి చర్యలు తీసుకుంటాం**

రిజర్వుడు స్థలాల పరిరక్షణకు చర్యలు తీసుకుంటాం. క్షేత్రస్థాయిలో ఆక్రమణలను గుర్తించి నిబంధనల మేరకు వాటిని తొలగిస్తాం. గుత్తిలో పంచాయతీగా ఉన్నప్పుడే ఆక్రమణలు జరగడంతో ఇప్పుడు ఏమీ చేయలేకపోతున్నాం.

మారుతీప్రసాద్, టీపీవో, గుత్తి

# బిందు సేద్యానికి ఊరట



అనంతపురం : రాష్ట్రంలోనే ఉమ్మడి అనంతపురం జిల్లాలో బిందు సేద్యం పరికరాలు ఎక్కువగా మంజూరు చేస్తున్నారు. పరికరాలకు జీఎస్టీ చెల్లింపు రైతులకు పెనుభారంగా మారింది. సుమారు ఏడేళ్ల కిందట 18 శాతం ఉన్న జీఎస్టీని కేంద్రం ప్రభుత్వం అప్పట్లో 6 శాతం తగ్గించి, 12 శాతం ఖరారు చేస్తూ నిర్ణయం తీసుకుంది. అందులో రైతు వాటా 6 శాతం, రాష్ట్ర ప్రభుత్వ వాటా 6 శాతం చొప్పున జీఎస్టీ చెల్లిస్తూ వచ్చారు. అది కూడా రైతుకు భారమని భావించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తాజాగా 5 శాతానికి జీఎస్టీ తగ్గిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో ఉమ్మడి జిల్లాలో వేలాది మంది రైతులకు భారీ ఊరట కలుగనుంది.

**32 వేల హెక్టార్లు లక్ష్యం**

ఉమ్మడి అనంతపురం జిల్లాలో 2025-26 ఆర్థిక సంవత్సరానికి బిందుసేద్యం లక్ష్యం 32 వేల హెక్టార్లు విధించారు. అందుకు సుమారు రూ.298.57 కోట్లు వెచ్చించనున్నారు. ఇప్పటికే బిందు సేద్యం పరికరాల కోసం ఉమ్మడి జిల్లాలో 43,534 మంది రైతులు 58,161 హెక్టార్లకు పేర్లు నమోదు చేసుకున్నారు. అందులో 6,083 మంది రైతులకు 8,072 హెక్టార్లకు పరికరాలు మంజూరు చేశారు.

అనంతపురం జిల్లాలో 18 వేల హెక్టార్లు లక్ష్యం కాగా 23,154 మంది రైతులు 32,560 హెక్టార్లకు పేర్లు నమోదు చేసుకున్నారు. వారిలో 4,588 మంది రైతులకు 6,162 హెక్టార్లకు పరికరాలు మంజూరు చేశారు.

శ్రీసత్యసాయి జిల్లాలో 14 వేల హెక్టార్లు లక్ష్యం కాగా 20,380 మంది రైతులు 26,451 హెక్టార్లకు పేర్లు నమోదు చేసుకున్నారు. అందులో 1,495 మంది రైతులకు 1,910 హెక్టార్లకు పరికరాలు మంజూరు చేశారు.

ఉమ్మడి అనంతపురం జిల్లాలో బిందుసేద్యం పరికరాలకు ఏటా సుమారు 298.57 కోట్లు వెచ్చిస్తున్నారు. అందులో 12 శాతం జీఎస్టీ అంటే రూ.35.82 కోట్లు చెల్లించేవారు. తాజాగా 5 శాతానికి కుదించడంతో రూ.14.92 కోట్లు చెల్లించాల్సి ఉంటుంది. అంటే ఏటా రూ.20.9 కోట్లు భారం తగ్గనుంది.

**రైతులకు వెసులుబాటు**

జీఎస్టీ తగ్గింపుతో కరవు జిల్లాలో రైతులకు ఆర్థికంగా వెసులుబాటు కలుగనుంది. అర్హులైన రైతులందరికీ పథకం వర్తించాలన్నదే రాష్ట్ర ప్రభుత్వం ప్రధాన ఉద్దేశం. రైతులు సద్వినియోగం చేసుకోవాలి.

రఘునాథరెడ్డి, పీడీ(ఏపీఎంఐపీ)

# కన్ను పడింది.. కొండ కరిగింది



చౌడేపల్లి: అక్రమార్కుల కన్ను ప్రధాన రహదారికి ఆనుకొని ఉన్న కొండలపై పడింది. ఇటీవల కొందరు ఎలాంటి అనుమతులు లేకుండా తవ్వి యథేచ్ఛగా తరలిస్తున్నారు. చౌడేపల్లి మండలంలో ఈ వ్యవహారం జోరుగా సాగుతున్నా అధికారులెవరూ కనీసం పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి.తిరుపతి- పుంగనూరు ప్రధాన రహదారి పక్కనున్న కొండమర్రి రెవెన్యూ పరిధిలో రామయ్యగట్లకు వెళ్లే మార్గంలో కొండను సుమారు 600 మీటర్లకు పైగా తవ్వి తరలించేశారు. కొండకు ఆనుకొని ఉన్న ప్రభుత్వ స్థలాన్ని సైతం కొందరు రైతులు చదును చేసి తమకు అనుకూలంగా మార్చుకున్నారు.చౌడేపల్లి మండలంలోని కొండామర్రి రెవెన్యూ పరిధిలో రాజనాల బండ ఆలయానికి వెనుక వైపునున్న దేవరకుంట దుస్థితి ఇది. పొలాల చదును పేరుతో ఇక్కడ 200 మీటర్ల పొడవున గ్రావెల్ తవ్వి పట్టణాల్లోని లేఅవుట్లకు తరలించేశారు. అధికారులకు ఫిర్యాదులు వెళ్తున్నా పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు.

# నదీకోత.. రైతన్న గుండెకోత

ఆలమూరు : గోదారమ్మకు వరదొస్తే పాయల్లోని లంక పొలాల రైతులు కలవరపాటుకు గురవుతుంటారు. విలువైన లంకపొలాలు కోతకు గురై గోదావరిలో కలిసిపోతుండటంతో ఆందోళన వ్యక్తమవుతోంది. ఆలమూరు మండలం బడుగువానిలంకలో సుమారు 800 ఎకరాలు ఉన్నాయి. అందమైన పూలతోటలు, పండ్ల తోటలతో సుసంపన్నంగా ఉంటుంది. అన్నిరకాల పంటలు పండడంతో పాటు, అధిక దిగుబడులు వస్తుండటంతో ఎకరం రూ.50 లక్షల నుంచి రూ.80 లక్షల వరకూ పలుకుతుంటాయి. వరదలు వచ్చినప్పుడల్లా ఎకరాలకు ఎకరాలు కోతకు గురవుతూ ఉండటంతో కర్షకులు తల్లడిల్లుతున్నారు.

**2006లో గ్రోయిన్ల నిర్మాణం**

2006లో అప్పటి ఎమ్మెల్యే బిక్కిన కృష్ణార్జునచౌదరి కృషితో గ్రామంలో నదీకోత అధికంగా ఉన్నచోట గ్రోయిన్లు, రాతికట్ట నిర్మించారు. అప్పటి నుంచి నదీకోత తగ్గింది. రాతికట్ట లేని ప్రాంతాల్లో భూమి కోతకు గురవుతోంది. రెండేళ్ల క్రితం రిలయన్స్ గ్యాస్ సంస్థ సుమారు రూ.42 కోట్లతో కొంతమేర రివిట్‌మెంట్ పనులు చేపట్టింది.

**మూడు నెలలుగా వరదలు..**

ఈ సంవత్సరం ఆగస్టు, సెప్టెంబరు, అక్టోబరులో మూడుసార్లు వరదలు



వచ్చాయి. రెండో ప్రమాద హెచ్చరిక స్థాయికి చేరుకున్న వరద ఉద్ధృతికి కొత్త, పాత రివిట్‌మెంట్‌ల కలయిక ప్రాంతంలో మళ్లీ కోత మొదలైంది. బర్మా సొసైటీకి చెందిన భూముల్లో రెండుచోట్ల భూమి కుంగిపోయింది. మూడు రోజుల వ్యవధిలోనే పలు పూలతోటలు కళ్లముందే కొట్టుకుపోవడంతో అన్నదాతలు తల్లడిల్లుతున్నారు. ఇదిలాగే కొనసాగితే లంక భూములతో పాటు జిరాయితీ భూములు, తరువాత గ్రామానికి సైతం ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వరద తగ్గిన వెంటనే ఈ ప్రదేశంలో మళ్లీ పనులు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

**ఆరుసార్లు మునక..** 35 రోజులు ముంపుప్రస్తుత వరదల కాలంలో ఇంతవరకు చాకలిపాలెం సమీపంలోని కనకాయలంక కాజ్వే ఆరుసార్లు ముంపులో చిక్కుకుని 35 రోజులపాటు ఉండిపోవటంతో ఇక్కడి ప్రజలు అవస్థలు పడ్డారు. బ్యారేజి వద్ద ఆరున్నర లక్షల క్యూసెక్కుల వరదనీటిని సముద్రంలోకి విడిచిపెడితే ఈ కాజ్‌వే ముంపు బారిన పడుతుంది. ఈ సీజన్‌లో దఫదఫాలుగా వచ్చిన ఉద్ధృత వరదలకు కనకాయలంక ప్రజలు చాకలిపాలెంవైపు రాకపోకలు సాగించేందుకు మరపడవలను ఆశ్రయించారు. ఆదివారం సాయంత్రం బ్యారేజి నుంచి సముద్రంలోకి 5,25,148 క్యూసెక్కుల వరద నీటిని విడిచిపెట్టారు. వరద కనిష్ఠస్థాయికి చేరడంతో కాజ్‌వే ముంపు నుంచి బయటపడింది. వివిధ లంకల్లో వరద ఇంకా తగ్గకపోవడంతో ప్రజలు మరపడవల్లో రాకపోకలు సాగిస్తున్నారు.

# విలీనం చేయరు.. ఎన్నికలు నిర్వహించరు

కాకినాడ : జిల్లా కేంద్రానికి ఆనుకుని ఉన్న కాకినాడ గ్రామీణ మండలంలోని రమణయ్యపేట, వలసపాకల, వాకలపూడి, తూరంగి, ఇంద్రపాలెం, చీడిగ గ్రామాలు గత 14 సంవత్సరాలుగా స్థానిక సంస్థల ఎన్నికలు జరగడం లేదు. దీంతో అభివృద్ధి లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కార్పొరేషన్‌లో విలీన ప్రక్రియ నిలిచిపోవడంతో ఇవి ప్రత్యేకాధికారుల పాలనలో నడుస్తున్నాయి.

**రెండింటిని మాత్రమే చేర్చారు**

కాకినాడ గ్రామీణ మండలంలో 20 గ్రామాలు ఉండగా 8 గ్రామాలను కాకినాడ కార్పొరేషన్‌లో విలీనం చేయాలని తీర్మానం చేయగా వాటిలో 2013లో స్వామి నగర్, ఎస్ అచ్యుతాపురం మాత్రమే విలీనం చేశారు. కోర్టు కేసులతో ఇప్పటి వరకు ఈరెండు డివిజన్లలో కార్పొరేషన్ ఎన్నికలు జరగలేదు. ఒక్క వాకలపూడికి మాత్రమే 2014లో ఎంపీటీసీ ఎన్నికలు నిర్వహించారు. మిగతా ఐదింటిలో 2011 నుంచి పంచాయతీ, ఇతర స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించలేదు. 2015లో రాష్ట్రప్రభుత్వం ప్రత్యేక జీవో జారీ చేసి విలీనానికి ప్రయత్నం చేయగా స్థానిక ప్రజాప్రతినిధులు కోర్టును ఆశ్రయించారు. దీంతో ఇటు కార్పొరేషన్‌లో విలీనం కాక, అటు పంచాయతీ ఎన్నికలు జరగక గ్రామాలు అభివృద్ధికి నోచుకోవడం లేదు. ప్రభుత్వం దృష్టిసారించి,



ప్రత్యేక చర్యలు చేపట్టాలని గ్రామస్థులు విజ్ఞప్తి చేస్తున్నారు.

**రూ.240 కోట్లు నిధులు కోల్పోయారు..**

గత 14 సంవత్సరాలుగా ఈ 6గ్రామాల్లో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించకపోవడం వల్ల కేంద్ర ప్రభుత్వం అందించే ఆర్థిక సంఘం నిధులు సుమారు రూ.240 కోట్లు కోల్పోయాయని అంచనా. ఆ నిధులు ప్రత్యేక గ్రాంటు ద్వారా ప్రభుత్వం విడుదల చేయాలని గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు.

**ప్రభుత్వం స్పందించాలి**

6 గ్రామాలకు వెంటనే పంచాయతీ ఎన్నికల నిర్వహించి ప్రజా పరిపాలన తీసుకురావాలి. కార్పొరేషన్‌లో విలీనం అయితే పన్నుల భారం పెరుగుతుంది. గ్రామాల్లో నివసించే పేద, మధ్య తరగతి వర్గాల వారు భరించలేరు. దీనిపై ఎమ్మెల్యే పంతం నానాజీకి వినతి పత్రం అందించాం. ఆయన ఈ సమస్యపై అసెంబ్లీకి కూడా ప్రస్తావించడం జరిగింది. ప్రభుత్వం జోక్యం చేసుకుని వెంటనే పంచాయతీ ఎన్నికలు నిర్వహించాలి. అడబాల రత్నప్రసాదరావు, మాజీ సర్పంచి, రమణయ్యపేట

చురకలు



# చిన్నారులకు సన్నబియ్యం

అల్లవరం : కూటమి అధికారంలోకి రాగానే చిన్నారులు, బాలింతలు, గర్భిణుల సంరక్షణపై ప్రత్యేక దృష్టి సారించింది. ఇందులో భాగంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు ఇక నుంచి రోజూ రుచికరమైన పౌష్టికాహారం అందనుంది. త్వరలోనే కేంద్రాలకు సన్నబియ్యం సరఫరా చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. దీనికి సంబంధించి యంత్రాంగం కసరత్తు చేస్తోంది.

**ప్రక్షాళన దిశగా..**

ఇప్పటికే మినీ కేంద్రాలను ప్రధాన కేంద్రాలుగా మార్పు చేశారు. పలు రకాల పుస్తకాలు, వస్తువులను అందిస్తున్నారు. కేంద్రాల వద్దే కూరగాయలు పండించి వాటినే విద్యార్థులకు వండి పెట్టేలా కిచెన్ గార్డెన్‌లను ఏర్పాటు చేసేందుకు రూ.10వేల ప్రోత్సాహకాన్ని అందించారు. తాజాగా చిన్నారులు, బాలింతలు, గర్భిణులకు సన్నబియ్యం అందించేందుకు నిర్ణయించారు.

**ప్రభుత్వ బడుల మాదిరిగానే..**

క్యూఆర్ కోడ్‌తో ఉన్న సన్నబియ్యం బస్తాలను అంగన్‌వాడీ కేంద్రాలకు అందించనున్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు ఈక్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి ఎన్ని బస్తాలు దిగుమతి చేశారనే విషయాన్ని ఆన్‌లైన్‌లో నమోదు



చేయాల్సి ఉంటుంది.

**ఎక్కడి నుంచైనా..**అంగన్‌వాడీ కేంద్రాల్లో బాలింతలు, గర్భిణులకు అందిస్తున్న పోషకాహారాన్ని ఇకపై ఎక్కడి నుంచైనా పొందేలా ప్రత్యేక యాప్‌ను అందుబాటులోకి తీసుకువచ్చారు. ఇప్పటి వరకు కేంద్రాలకు వచ్చిన వారికి మాత్రమే పోషకాహారం అందిస్తున్నారు. రానివారు ఆ నెలకు సంబంధించి పోషకాహార కిట్లు కోల్పోతున్నారు. ఇకపై ఈ రకమైన ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉండదు. పోషణ్ ట్రాకర్ యాప్‌లోనే మైగ్రేషన్ ఆప్షన్‌ను ప్రవేశ పెట్టారు. దీంతో సరకులు ఎక్కడి నుంచైనా పొందే అవకాశం ఏర్పడనుంది.

**ఎంతోమందికి మేలు-విజయకుమారి, ఐసీడీఎస్, పీడీ** మైగ్రేషన్ ఆప్షన్ కల్పించడంతో ఎంతో మంది లబ్ధిదారులకు మేలు జరగనుంది. ఉపాధి నిమిత్తం, కాన్పులకు పుట్టింటికి వెళ్లిన వారికి అక్కడే నేరుగా పోషకాహారం తీసుకునే వెసులుబాటు కలుగుతుంది. కేంద్రాలకు సన్నబియ్యం సరఫరాపై ప్రభుత్వం నుంచి ఆదేశాలు రావాల్సి ఉంది.

# చెత్త బండి.. సరకులు ఇస్తుంది..!

అమలాపురం: ఇంట్లో వ్యర్థాలు పడేసేందుకు చెత్త బండి ఎప్పుడు వస్తుందా..? అని ఎదురు చూస్తాం. అదే బండి చెత్త తీసుకుని సరకులు ఇస్తుందంటా నమ్ముతారా..? స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా జిల్లాలో పైలెట్ ప్రాజెక్టుగా ఓ పంచాయతీలో ఇలా చేస్తున్నారు. కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ ఆదేశాలతో స్వచ్ఛ రథం పేరుతో ఈ వినూత్న కార్యక్రమానికి ఆగస్టు 15న శ్రీకారం చుట్టారు. త్వరలోనే జిల్లాలోని మరో మూడు చోట్ల ఈ వాహనాలను అందుబాటులోకి తీసుకొచ్చేలా ఇటీవల ప్రతిపాదనలు పంపారు.

**ఎలా సాగుతుందంటే..**

అమలాపురం మండలం కామనగరువు పంచాయతీకి స్వచ్ఛ రథాన్ని కేటాయించారు. ఈ వాహనంతో పంచాయతీలోని ప్రతి కాలనీకి వెళ్లి నిరుపయోగంగా ఉండే తడి, పొడి చెత్త, వస్తువులుంటే తెచ్చి ఇవ్వాలని ప్రచారం చేస్తున్నారు. ప్లాస్టిక్, పాత వస్తువులు, పొడి చెత్తకు సమానమైన నిత్యావసరాలను అందిస్తున్నారు. దీనికి 'స్వచ్ఛ బంధు' పేరిట సిబ్బందిని నియమించి నిధుల ఆధారంగా రూ.25వేల వరకు గౌరవ వేతనంగా ఇస్తున్నారు.

**మరో మూడు చోట్ల..**

జిల్లాలోని రాజోలు, రామచంద్రపురం, కొత్తపేటలో ఈ వాహనాలను కొత్తగా అందుబాటులోకి తీసుకొచ్చేందుకు సమాయత్తమవుతున్నారు. ఆయా ప్రాంతాల్లో ఈ వాహనాలు అందుబాటులోకొస్తే చెత్త వస్తువుల సేకరణ పెరగనుంది.

**ఈ వస్తువులు తీసుకుంటారు..**

ప్లాస్టిక్ బాటిళ్లు, కవర్లు, పుస్తకాలు, పాల ప్యాకెట్ల కవర్లు, అట్టలు, ప్యాకింగ్ కవర్లు, నూనె డబ్బాలు, గాజు సీసాలు, ఎలక్ట్రానిక్ వ్యర్థాలు, కంప్యూటర్లు, కీబోర్డులు, సీడీలు, చరవాణులను తీసుకుంటున్నారు. రోజూ కనీసం 250 కేజీలు సేకరించేలా ప్రణాళికలను రూపొందించి ముందుకు సాగుతున్నారు.

**పక్కాగా అమలు చేస్తున్నాం**-డి.శాంతలక్ష్మి, డీపీవో

పర్యావరణ హితంగా గ్రామాల్ని తీర్చిదిద్దడంతోపాటు చెత్త నుంచి సంపద సృష్టికి స్వచ్ఛ రథం ఉపయోగపడుతుంది. ప్రస్తుతం జిల్లాలోని కామనగరువులో ఈ కార్యక్రమం జరుగుతుంది. త్వరలోనే రాజోలు, కొత్తపేట, రామచంద్రపురం ఏర్పాటు చేసేలా ప్రతిపాదనలు పంపాం.

# ముందుకు సాగని మూడు రాష్ట్రాల దారి

ఆలూరు : జిల్లా మీదుగా వెళ్లే మూడు రాష్ట్రాల రహదారి పనులు ముందుకుసాగడం లేదు. కర్ణాటక రాష్ట్రం హగరి నుంచి జిల్లాలో ఆలూరు, ఆదోని, ఎమ్మిగనూరు, మంత్రాలయం మండలం మాధవరం, తెలంగాణ రాష్ట్రం జడ్చర్ల వరకు జాతీయ రహదారి-167 నిర్మాణానికి 2017లో శ్రీకారం చుట్టారు. ఇందుకు రూ.220 కోట్లు మంజూరు చేసింది.

పనులు చేపట్టేందుకు టెండర్లు దక్కించుకున్న గుత్తేదారు జిల్లాలో హాలహర్వి మండలం చింతకుంట గ్రామం నుంచి ఆదోని వరకు పనులు ప్రారంభించి పూర్తిచేశారు. మధ్యలో కొన్ని పనులు చేయకుండా వదిలేయడంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. ఈ రహదారి వెంట నిత్యం మూడు వేల వాహనాలు వెళ్తుంటాయి.

ఆంధ్ర- కర్ణాటక రాష్ట్రాలను కలిపే వంతెన నిర్మాణ పనులు చింతకుంట వద్ద ఆగిపోయాయి. ఐదు పిల్లర్ల వరకే పనులు చేశారు. మరో ఐదు పిల్లర్లు నిర్మించాల్సి ఉంది.

హాలహర్వి మండలం కామినహాలు- మెదేహాలు మధ్య రహదారి కోతకు గురైంది. ఇక్కడ రెండు వంతెనల వద్ద సుమారు 200 మీటర్ల మేర రోడ్డు వేయాల్సి ఉంది.

ఆలూరు పట్టణంలో కొంత వరకే రహదారి వేశారు. డివైడర్లు వేయకుండా అలాగే వదిలేశారు.

ఆలూరు పట్టణంలో ఇరువైపులా రోడ్డు విస్తరణ చేపట్టాల్సి ఉంది. పట్టణంలో ఫుట్‌పాత్ పనులు చేయాల్సి ఉంది.

# మండుతున్న ఖ'నిజం'..!!



విశాఖపట్నం : స్టీల్ ప్లాంటులో కీలక విభాగమైన రా మెటీరియల్ హ్యాండ్లింగ్ ప్లాంట్ (ఆర్‌ఎంహెచ్‌పీ)ను సరైన ప్రణాళిక లేకుండా నిర్వహిస్తున్నారని కార్మిక సంఘాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి. ఒప్పంద కార్మికుల తొలగింపు, కన్వేయర్‌ల నిర్వహణ కొరవడటం, కీలక అధికారుల బదిలీ వంటి పరిణామాలు ఆర్‌ఎంహెచ్‌పీపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. ఫలితంగా ఉక్కు ఉత్పత్తి వ్యయం పెరుగుతుందంటున్నారు.

**అదనపు ఖర్చుతో:** స్టీలు ప్లాంటు ఏర్పాటు చేశాక మొట్టమొదటిగా నిర్మించిందే ఆర్‌ఎంహెచ్ ప్లాంటు. నాలుగేళ్లుగా ఇందులో మరమ్మతులు చేయకుండా, విడిభాగాలు అమర్చకుండా నిర్వహణపై చేతులెత్తేశారు. ఎన్‌ఎండీసీ నుంచి ముడి ఇనుప ఖనిజం రేక్‌ల ద్వారా వస్తుంది. ఒక్కో రేక్‌కు 56 వ్యాగన్స్ ఉండగా, 4వేల టన్నులపైగా ముడి సరకు వస్తుంది. వేగన్ టెప్లర్స్ ద్వారా ఈ ఖనిజాన్ని దిగుమతి చేస్తారు. బాయిలర్ బొగ్గు, లైమ్‌స్టోన్, డోలమైట్ వంటివి ఇక్కడికే వస్తాయి. సింటర్‌ప్లాంట్, థర్మల్‌ప్లాంటు, కోకోవన్, బ్లాస్ట్‌ఫర్నేస్‌లు, ఎస్‌ఎంఎస్‌కు పంపేందుకు కన్వేయర్లను ఉపయోగిస్తారు. ప్రతిరోజూ ఆర్‌ఎంహెచ్‌పీ నుంచి కన్వేయర్లపై 25 వేల టన్నుల ఖనిజం వెళ్లాలి. సరైన నిర్వహణ లేక ఐదు వేల టన్నులు మించి వెళ్లడం లేదు. దీంతో టన్నుకు అదనంగా రూ.28 ఖర్చు చేసి డంపర్లతో ప్రతిరోజూ ముడిఖనిజాన్ని బేస్ మిక్స్‌కు తరలిస్తున్నారు.

**సిబ్బంది లేరు... నిర్వహణ చేయరు:** కన్వేయర్స్‌పైనుంచి ముడి సరకు జారిపడగానే వెంటనే శుభ్రం చేయాలి. ఆర్‌ఎంహెచ్‌పీలో పెద్ద సంఖ్యలో కార్మికులను తొలగించారు. 870 మంది ఒప్పంద కార్మికులున్నారు. ప్రస్తుత వర్షాకాలంలో కన్వేయర్లపై వెళ్లే ముడిఖనిజం ఎక్కడికక్కడ ఆగిపోయే సమస్యలెక్కువ. ఈ నేపథ్యంలో సాధారణంగా ఉన్న ఒప్పంద కార్మికులతోపాటు అదనంగా మాన్‌సూన్ లేబర్ పేరుతో 120 మందిని నియమించుకుంటారు. అయితే ఉన్నవాళ్లనే తొలగించడంతో... ఈనెల 5వ తేదీ వరకు వీఆర్‌ఎస్‌కు అనుమతి పొందిన కొందరు ఉద్యోగులతో ఇక్కడి పనులు చేయించారనే ఆరోపణలొస్తున్నాయి. తాజాగా కన్వేయర్ బెల్ట్ తెగడం కూడా కలకలం రేపుతోంది. అది తెగిపోయిందా... కావాలనే చేశారా అన్నది తేలాల్చి ఉంది.

**అగ్గిరాజుకున్నా..**

ఆర్‌ఎంహెచ్‌పీలోని కోల్ యార్డులో బొగ్గు నిల్వలుంటాయి. ప్రధానంగా బాయిలర్ కోల్ నిల్వల్లో ఎయిర్ గ్యాప్స్ ఉండటం వల్ల ఆక్సిజన్‌తో కలిసి అగ్గిరాజుకుంటుండటం సాధారణం. ఈ మంటలను ఆర్పడానికి, అగ్గిరాజుకోకుండా ఉండటానికి స్ప్రింక్లర్లు, పైపులతో నీటిని చల్లడానికి ప్రతిరోజూ ఒప్పంద కార్మికులుండేవారు. ప్రస్తుతం కార్మికుల కొరతతో బొగ్గు నిల్వలకు మంటలు తీవ్రంగా వ్యాపించే వరకు గుర్తించే పరిస్థితి ఉండటం లేదు.

**పర్యవేక్షణ అధికారులను మార్పుచేస్తూ..**

ఆర్‌ఎంహెచ్‌పీపై అవగాహన ఉన్న పర్యవేక్షణాధికారులు (హెచ్‌వోడీ)లను రోజుల వ్యవధిలో నలుగురిని మార్చేశారు. ఈ నెల 3, 4తేదీల్లో మెకానికల్, ఎలక్ట్రికల్, ఆపరేషన్స్ ఇన్‌ఛార్జులను తప్పించారు. కన్వేయర్ విధానంపై కనీస అవగాహన లేని ఇతర విభాగాల నుంచి అధికారులను తెచ్చి ఇక్కడ నియమిస్తుండటంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

# పౌరసరఫరాలు మరింత స్మార్ట్



నర్సీపట్నం : రేషన్ డిపోలు స్మార్ట్‌గా మారుతున్నాయి. రేషన్ కార్డులు, ఈ-పోస్ యంత్రాలు ఆధునికత హంగులద్దుకున్నాయి. పాత రేషన్ కార్డులకు బదులు ప్రభుత్వం స్మార్ట్ కార్డులు అందిస్తోంది. 24 మండలాల్లో 1,063 డిపోల పరిధిలో 5,32,340 మంది లబ్ధిదారులకు వీటిని పంపిణీ చేయనున్నారు. వైకాపా ప్రభుత్వం కార్డులను ఆ పార్టీ రంగులతో ముద్రించగా.. కూటమి ప్రభుత్వం ఆధునిక విధానాల దిశగా అడుగులు వేసింది. స్మార్ట్ కార్డులు ఏటీఎం కార్డ్ తరహాలో క్యూఆర్ కోడ్‌తో ఉన్నాయి. కార్డుకు ఒక వైపు రాష్ట్ర ప్రభుత్వ అధికారిక చిహ్నం, లబ్ధిదారుడి ఫొటో, చౌక దుకాణం నంబరు ఉంటాయి. రెండో వైపు కుటుంబ సభ్యుల వివరాలుంటాయి. సభాపతి అయ్యన్నపాత్రుడు చేతులమీదుగా శుక్రవారం నర్సీపట్నంలో లబ్ధిదారులకు కార్డులను అందజేయనున్నట్లు జిల్లా పౌరసరఫరాల అధికారి మూర్తి చెప్పారు. అనంతరం 1,063 డిపోల పరిధిలో సచివాలయ ఉద్యోగులు,

డీలర్లు ఇంటింటికి వెళ్లి కార్డులకు పంపిణీ చేస్తారని పేర్కొన్నారు. కార్డుపై ఉన్న క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి కుటుంబ సభ్యుల వివరాలు, ఫొటోలు, చిరునామా, డిపో ఐడీ తెలుసుకోవచ్చు. నర్సీపట్నం నియోజకవర్గంలో 83,799 మంది లబ్ధిదారులకు కార్డులు పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయని పౌరసరఫరాల ఉప తహసీల్దారు చందనరేఖ చెప్పారు. జిల్లాలో కొత్త రేషన్‌కార్డులకు 3501 దరఖాస్తులు వచ్చాయి. వీటిలో 2 వేలకు పైగా ఆమోదం తెలిపారు.

**ఈ-పోస్‌కూ కొత్త హంగులు**

కార్డులతో డిపోల్లోని ఈ-పోస్ యంత్రాలు సైతం స్మార్ట్‌గా మారనున్నాయి. డిపోల వద్ద ప్రస్తుతం వినియోగిస్తున్న యంత్రాలు సరిగా పనిచేయడం లేదు. కీప్యాడ్‌లు సరిగా పనిచేయకపోవడం, సర్వర్లకు సిగ్నల్ రాకపోవడం, తరచూ ఛార్జింగ్ తగ్గిపోవడంతో సరకులు అందించే క్రమంలో ఇబ్బంది ఎదురవుతోంది. కొత్త ఈ-పోస్ యంత్రంలో స్మార్ట్ రేషన్ కార్డును స్వైప్ చేసి సరకులను తీసుకోవచ్చు. కొత్త ఈ-పోస్ యంత్రాలను డీలర్లకు ఈనెల 12 నుంచి విడతల వారీగా అధికారులు, ప్రజాప్రతినిధుల సమక్షంలో అందించనున్నారు. ఇప్పటికే ఈ యంత్రాలు జిల్లా పౌరసరఫరాల కార్యాలయానికి చేరుకున్నాయి.

**ఇవీ ప్రత్యేకతలు**

కొత్త ఈ-పోస్ టచ్ స్క్రీన్‌తో సరికొత్త సాంకేతికత, సదుపాయాలతో ఉంటుంది. సిమ్ ఉంటుంది. నెట్ లేకపోయినా వైఫై, బ్లూటూత్ అనుసంధానంతో వినియోగించవచ్చు.

స్మార్ట్‌రేషన్ కార్డు స్వైప్ చేయడం ద్వారా ఆటోమేటిక్‌గా కనెక్ట్ అవుతుంది. దీంతో లబ్ధిదారుల పూర్తి వివరాలు వస్తాయి.

బయోమెట్రిక్ సదుపాయం సైతం అందుబాటులో ఉంది. వేలిముద్ర పడకపోతే కెమెరా ద్వారా ఐరిస్ తీసుకుని సరకులు అందిస్తారు.

జీపీఆర్‌ఎస్ సౌకర్యం వల్ల డేటా నమోదు అవుతుంది.

# వర్షభయం.. వేగం అవశ్యం



శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయం తరపున ప్రారంభించిన శివం టు శివం రోడ్డు పనులు మరింత వేగవంతం చేయాల్సి ఉంది. సాధారణంగా ఏటా నవంబరు, డిసెంబరు నెలల్లో వర్షాలు సమృద్ధిగా కురుస్తుంటాయి. ఆ సమయంలో సువర్ణముఖి నదిలో ప్రవాహ ఉధృతి మరింత పెరిగే అవకాశం ఉంటుంది. వర్షాల్లోపు వీలైనంత ఎత్తు పెంచే దిశగా వరద కట్ట పనులు వేగంగా చేపట్టాల్సి ఉంది.

**ఏయే పనులంటే..**సువర్ణముఖి ఆనకట్ట నుంచి రామసేతు వంతెన వరకు కనకాచలాన్ని ఆనుకుని వరద కట్ట పనులు చేస్తున్నారు.

చెంబేడు కాల్వకు నీటి మళ్లింపునకు ఇబ్బందులు లేకుండా కాంక్రీటు పనులు చేపట్టారు. ఈ కాల్వను ఆనుకుని ఉన్న కరకట్టను విస్తరించే పనులు మాత్రమే జరుగుతున్నాయి.

అనుసంధాన రోడ్లపై అనిశ్చితి: ప్రస్తుతం శివం టు శివం రోడ్డు ఏర్పాటు నేపథ్యంలో ఆయా వీధుల నుంచి అనుసంధానం రోడ్లపై ఇంకా స్పష్టత రానట్లు తెలుస్తోంది. పట్టణ ప్రజలకు ఎలాంటి అవస్థలు తలెత్తకుండా, ట్రాఫిక్ సమస్యలకు అవకాశం లేకుండా అనుసంధాన రోడ్లు ఏర్పాటు చేపట్టాలని ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి అధికారులను గతంలో ఆదేశించిన విషయం తెలిసిందే. ఏదీ ఏమైనా ఈ రోడ్డు అందుబాటులోకి రావడంతో ఆలయానికి వచ్చే భక్తులతో పాటు పట్టణ ప్రజలకు సౌలభ్యంగా ఉంటుంది.

**త్వరితగతిన చేయిస్తాం..**

శివం టు శివం రోడ్డు పనుల అభివృద్ధి సువర్ణముఖి నదికి వరద తాకిడి దృష్ట్యా పనులు మరింత వేగవంతం చేయాలని ఉన్నతాధికారులు ఆదేశించాం. అందుకు తగ్గట్లు పనుల్లో పురోగతి కోసం అధికారులు, గుత్తేదారులకు సూచనలు ఇచ్చాం. అడ్డంకులు ఏర్పడకుండా ప్రణాళికబద్ధంగా పనులు చేపడుతున్నాం. మురళీధర్‌రెడ్డి, ఈఈ, శ్రీకాళహస్తీశ్వరాలయం

పనుల విలువ: రూ.29 కోట్లు

రహదారి పొడవు: 2.75 కి.మీ.

# ఉల్లి రాసుల్లో కన్నీటి సుడులు

కర్నూలు : కర్నూలు మార్కెట్ యార్డు ఉల్లి సంచులతో నిండిపోయింది. క్వింటా రూ.1200తో మార్క్‌ఫెడ్ కొనుగోలు చేస్తుండటంతో సరకు భారీగా పోటెత్తుతోంది. ఆగస్టు 31 నుంచి కొనుగోళు ప్రారంభించగా ఇప్పటికే వేల టన్నులు కొన్నారు. వాటిని ఏం చేయాలో తెలియక మార్కెట్‌లోనే నిల్వ చేశారు. రైతులు కొత్తగా తెచ్చిన సరకు దించేందుకు అడుగు స్థలం లేదు. వేల టన్నుల సరకు వాహనాల్లోనే ఉంది. కొనుగోలు చేసిన సరకును ఎప్పటికప్పుడు బయటకు తరలించడంలో విఫలమవడం రైతుల పాలిట శాపంగా మారింది.

**60 శాతం మార్కెట్‌లోనే**

మార్క్‌ఫెడ్ ద్వారా ఆగస్టు 31 నుంచి ఈనెల 11వ తేదీ వరకు 3,920 టన్నులు కొనుగోలు చేశారు. మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో మరో 268 టన్నులు కొన్నారు. మొత్తం 4,084 టన్నులు కొనుగోలు చేయగా.. ఇందులో 40 శాతం అంటే 1,632 టన్నులే బయటకు తరలించారు. ఇంకా 2,452.00 టన్నుల ఉల్లి నిల్వలు (60 శాతం) ఐదు రోజులుగా వ్యవసాయ మార్కెట్‌లోనే పేరుకుపోయాయి. దీంతో రోజువారీ కొత్తగా వచ్చే సరకు దించేందుకు స్థలం కొరత వేధిస్తోంది.

**కొన్నారు.. కుళ్లబెట్టారు**

తెల్లవారుజామున కురిసిన వర్షానికి వ్యవసాయ మార్కెట్‌లో ప్రభుత్వం కొనుగోలు చేసిన ఉల్లి నిల్వలు తడిసిపోయాయి. రూ.కోట్లు ఖర్చుచేసి



కొనుగోలు చేసిన సరకు షెడ్లలోనే కుళ్లిపోతోంది. ఇప్పటికే వందల బస్తాల ఉల్లి కుళ్లిపోయి దుర్వాసన వెదజల్లుతోంది. ఇప్పటికే 200-300 టన్నుల సరకు పాడైపోయింది. కొనుగోలు చేసిన ఉల్లిని సకాలంలో హైదరాబాద్, కోస్తాంధ్ర, వివిధ ప్రాంతాల్లోని రైతుబజార్లకు, పొరుగు జిల్లాలకు సరఫరా చేయడంలో మార్కెటింగ్, మార్క్‌ఫెడ్ అధికారులు తీవ్ర నిర్లక్ష్య ధోరణి అవలంబించారు. ఫలితంగా ఉల్లి నిల్వలు కొండలా పేరుకుపోయాయి. రూ.లక్షల విలువ చేసే సరకు కుళ్లిపోవడంతో పారబోయాల్సి వచ్చింది.

**సరకంతా వర్షార్పణం**

రోజువారీగా మార్కెట్‌కు వచ్చే ఉల్లి వాహనాలను అర్ధరాత్రి 12 గంటలకు మార్కెట్ లోపలికి అనుమతిస్తారు. ఇదే విధంగా బుధవారం అర్ధరాత్రి ఉల్లి వాహనాలను మార్కెట్‌లోకి అనుమతించారు. జంబోషెడ్డు, ఉల్లి షెడ్లలో గత నాలుగైదు రోజులుగా కొనుగోలు చేసిన ఉల్లి నిల్వలు కొండలా పేరుకుపోయాయి. దీంతో రైతులు తెచ్చిన సరకు ట్రాక్టర్లు, ట్రాలీ జీపులు, లారీల్లోనే ఉండిపోయింది.

ఉల్లి నిల్వలను వాహనాల్లోనే ఉంచాలని షెడ్లలోకి దించొద్దని మార్కెట్ కమిటీ అధికారులు రైతులకు తెలిపారు. దీంతో గురువారం ఉదయం 10 గంటల వరకు సరకంతా వాహనాల్లోనే ఉండిపోయింది. గురువారం తెల్లవారుజాము నుంచి ఉదయం 10 గంటల వరకు కర్నూలులో మోస్తరు వర్షం కురవడంతో రైతులు ఇబ్బంది పడ్డారు.

మార్కెట్ కమిటీ వారు రైతులకు టార్పాలిన్లు పంపిణీ చేయాలి. గురువారం ఒక్క రైతుకు కూడా మార్కెట్ కమిటీ వారు టార్పాలిన్లు అందజేయలేదు. తడుస్తున్నా పట్టించుకోలేదని రైతులు వాపోయారు.

# ఆదాయ గనులు

నంద్యాల : ఉమ్మడి జిల్లాలో గ్రానైట్ తదితర క్వారీల నుంచి సీనరేజీ వసూలు చేసే బాధ్యతను ప్రైవేటు సంస్థకు అప్పగించారు. ఇటీవల నిర్వహించిన టెండర్లలో సుధాకర్ ఇన్‌ఫ్రా సంస్థ పోటీ పడి నెలకు రూ.14.05 కోట్ల చొప్పున చెల్లించేందుకు ముందుకొచ్చింది. రెండేళ్లపాటు ప్రభుత్వానికి సదరు సంస్థ రూ.336 కోట్లు జమ చేయనుంది. ఇందుకు సంబంధించి గనుల శాఖ ఉన్నతాధికారులు ఇటీవల ఉత్తర్వులు జారీ చేశారు. సదరు సంస్థ ఈనెల 25 నుంచి సీనరేజీ వసూలు చేయనుంది. అప్పటిలోగా కర్నూలు, నంద్యాల జిల్లాలోని క్వారీలను సదరు సంస్థకు భూగర్భ గనుల శాఖ అధికారులు అప్పగించనున్నారు.

**గత ఐదేళ్లలో అధోగతి**

కర్నూలు, నంద్యాల జిల్లాల పరిధిలో 500 క్వారీలున్నాయి. ఇందులో కంకర, గ్రావెల్‌తోపాటు సున్నపురాయి, సిలికా శాండ్, ఐరన్‌ఓర్, రోడ్ మెటల్, సోప్ స్టోన్స్, వైట్ షెల్, క్వార్జ్, డోలమైట్ తదితర చిన్న క్వారీలు ఉన్నాయి. వీటి నుంచి రాళ్లు, గ్రావెల్ తదితరాలు బయటకు రావాలంటే సీనరేజీ చెల్లించాలి. క్వారీలు పెద్ద నాయకుల చేతిలో ఉ



ండడం, రాజకీయ ఒత్తిళ్లు తీవ్రస్థాయిలో ఉండడం, ఆధిపత్య ధోరణి తదితర కారణాలతో పన్ను వసూళ్లు తగ్గాయి. అధికారులు కొన్నిసార్లు ఏమీ చేయలేని పరిస్థితి నెలకొంది. ఫలితంగా గనుల శాఖ పెద్దఎత్తున ఆదాయం కోల్పోతోంది. ఈ పరిస్థితిలో సీనరేజీ వసూలు బాధ్యతను ప్రభుత్వం ప్రైవేటు సంస్థకు అప్పగించింది.

**ఇక నుంచి లెక్క పక్కా**

ఇప్పటివరకు గనుల శాఖ ఆధ్వర్యంలో సిబ్బంది సీనరేజీ వసూలు చేసేవారు. ఇక నుంచి ప్రైవేటు సిబ్బంది ఈ బాధ్యత తీసుకోనున్నారు. ప్రభుత్వంతో కుదుర్చుకున్న ఒప్పందం ప్రకారం ప్రతి నెలా సదరు గుత్తేదారు సంస్థ ఉమ్మడి జిల్లాకు సంబంధించి రూ.14 కోట్లను కచ్చితంగా చెల్లించాల్సి ఉంటుంది. కొలతల ప్రకారం ఎంత ముడి సరకు క్వారీల నుంచి బయటకు వెళ్లిందో స్పష్టంగా లెక్కించి ఆ మేరకు పన్నులు వసూలు చేయనుంది. సీనరేజీ అంచనా వేసిన మేరకు విభాగాల వారీగా సంబంధిత ప్రభుత్వ ఖాతాలకు నెలవారీగా సొమ్మును జమ చేయాల్సి ఉంటుంది. గ్రానైట్, కంకర తదితరాల మాదిరిగానేకాక గ్రామాల్లో మట్టి, గ్రావెల్ తరలించినా పన్ను కట్టాల్సిందే. సొంత పొలంలో తవ్వకాలు చేసినా సీనరేజీ చెల్లించాల్సిందే.

# ఉక్కపోత... కుండపోత



అనంతపురం : జిల్లాలో భిన్న వాతావరణ పరిస్థితులు నెలకొన్నాయి. గత వారం రోజులుగా ఉక్కపోతతో జనం ఉక్కిబిక్కిరయ్యారు. వేసవి కాలాన్ని తలపించింది. ఈనేపథ్యంలో బుధవారం రాత్రి జిల్లా అంతటా మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. దీంతో ఉక్కపోత నుంచి ఉపశమనం కలిగింది. పలు మండలాల్లో భారీ వర్షం కురువడంతో వాగులు, వంకలు పొంగిపొర్లాయి. చెరువులు, చెక్‌డ్యాంల్లో నీటితో కళకళలాడుతున్నాయి. బుధవారం రాత్రి నుంచి గురువారం ఉదయం వరకు వర్షం కురిసింది. సగటున 47.6 మి.మీ వర్షపాతం నమోదైంది. 14 మండలాల్లో 50 మి.మీపైగా వర్షం కురిసింది.

**కొన్ని మండలాల్లో ఇలా..**

యల్లనూరు మండలంలో అత్యధిక వర్షపాతం నమోదైంది. కణేకల్లులో 94.0, ఉరవకొండ 90.2, పామిడిలో 88.6, గుత్తి 86.2, విడపనకల్లు 79.0, రాప్తాడు 78.4, వజ్రకరూరు 77.8, గుంతకల్లు 74.2, నార్పల 64.6, పుట్లూరు 64.2, శింగనమల 60.2, యాడికి 57.2, కళ్యాణదుర్గం 50.2, పెద్దవడుగూరు 47.0, బుక్కరాయసముద్రం 45.0, తాడిపత్రి 44.2, గార్లదిన్నె 43.4, డి.హీరేహాళ్ 37.2, అనంతపురం అర్బన్ 36.0, అనంతపురం గ్రామీణం 34.2, పెద్దపప్పూరు 31.8, ఆత్మకూరు 30.2, బొమ్మనహాళ్ 27.2, బ్రహ్మసముద్రం 20.0, రాయదుర్గం 16.6, కూడేరు 11.2, శెట్టూరు, కంబదూరు, గుమ్మఘట్ట, బెళుగుప్ప, కుందుర్పి మండలాల్లో చిరుజల్లులు పడ్డాయని జిల్లా ముఖ్య ప్రణాళికాధికారి అశోక్‌కుమార్ తెలిపారు.

**258 ఎకరాల్లో పంట నష్టం**

కణేకల్లు మండల పరిధిలో 109 మంది రైతులకు సంబంధించి 247 ఎకరాల్లో వరి, వేరుసెనగ పంటలు దెబ్బతిన్నాయి. వరి 40 ఎకరాలు, వేరుసెనగ 207 ఎకరాల్లో నష్టం వాటిల్లినట్లు జేడీఏ ఉమామహేశ్వరమ్మ పేర్కొన్నారు. యాడికి, గుత్తి, తాడిపత్రి మండలాల్లో ఎనిమిది మంది రైతులకు సంబంధించి 11 ఎకరాల్లో టమాటా పంట దెబ్బతిన్నట్లు ఉద్యానశాఖ డీడీ ఉమాదేవి పేర్కొన్నారు.

# ఐసీడీఎస్‌లో ఇష్టారాజ్యం!



అనంతపురం : గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పంపిణీ చేసే పౌష్టికాహారంలోనూ అక్రమార్కులు దోచుకుని తింటున్నారు. నాసిరకం సరకులు సరఫరా చేస్తున్నా యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోంది. ఇదే అదనుగా గుత్తేదారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. గుడ్డు కనీస సైజు 50 గ్రాములకుపైగా ఉండాలి. 20 నుంచి 30 గ్రాముల బరువు కలిగిన గుడ్లను సరఫరా చేస్తున్నా పట్టించుకోవడం లేదు. పాలు సరఫరా.. అదనపు పౌష్టికాహారంగా ఇచ్చే కిట్లల్లోనూ చేతివాటం చూపిస్తున్నారు. ఇప్పటికే శ్రీసత్యసాయి జిల్లాలో పురుగులు ఉన్న ఎండు ఖర్జూరాన్ని సరఫరా చేశారు. ఇదే దుస్థితి అనంత జిల్లాలోనూ వెలుగు చూసింది. రాగిపిండి, అటుకులు, చిక్కీ, బెల్లం.. ఇలా ప్రతి దాంట్లోనూ కల్తీ ఉన్నట్లు అంగన్‌వాడీ కార్యకర్తలు ఫిర్యాదు చేసినా స్పందించేనాథుడే కరవయ్యాడు. బియ్యం, కందిపప్పు, వంటనూనె సరఫరా పూర్తి స్థాయిలో కేంద్రాలకు చేరడం లేదు.

**సక్రమంగా అమలు కాని మెనూ**

ఉమ్మడి జిల్లాలో 5126 అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో 3.01 లక్షల మంది లబ్ధిదారులు ఉన్నారు. గర్భిణి/బాలింతలకు నెలకు 5లీటర్ల పాలు, 25 కోడిగుడ్లు, బియ్యం, కందిపప్పు, నూనె, అదనపు ఆహారం కింద కిలో అటుకులు.. రాగిపిండి 2కిలోలు, ఖర్జూరం, చిక్కీ, బెల్లం 250 గ్రాములు ఇవ్వాలి. 3 ఏళ్లలోపు పిల్లలకు 2.5కిలోల బాలామృతం, 30 కోడిగుడ్లు, 2.5లీటర్ల పాలు, 3-6ఏళ్లలోపు బాలలకు 2.5లీటర్ల పాలు, 25కోడిగుడ్లు, మధ్యాహ్న భోజనం కేంద్రాల్లోనే ఇవ్వాలి. ఈ మెనూ సక్రమంగా అమలు కాలేదు. కోడిగుడ్లను ప్రతి నెలా 1, 10, 15, 25 తేదీల్లో నాలుగు విడతల్లో కేంద్రాలకు సరఫరా చేయాలి. పాలు, కిట్లు నెల మొదటి వారంలోనే ఇవ్వాలి. చాలా చోట్ల అమలు కావడం లేదు. వాటిపై అనంత అర్బన్, గుత్తి, కంబదూరు, ఉరవకొండ, కదిరి, ఓడీసీ, ధర్మవరం, మడకశిర, హిందూపురం.. తదితర ప్రాజెక్టుల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయి. ప్రతి నెలా సీడీపీఓలు కనీసం 20 రోజులు, సూపర్‌వైజర్లు ప్రతి రోజూ రెండు కేంద్రాలను తనిఖీ చేయాలి. చాలా మంది సీడీపీఓలు అసలు ప్రాజెక్టులకే వెళ్లడం లేదు. సరఫరాలో అక్రమాలకు ఒడిగట్టినా బిల్లులో కోత పెట్టడం లేదు. గుత్తేదారులు, అధికారులు కుమ్మక్కై పేదల కడుపు కొడుతున్నారు.

**ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటాం**

– నాగమణి, పీడీ, ఐసీడీఎస్

పౌష్టికాహారం సరఫరా, నాణ్యతపై ఫిర్యాదులు రాలేదు. ఎవరైనా ఫిర్యాదు ఇస్తే విచారణ చేస్తాం. గుత్తేదారులపై చర్యలు ఉంటాయి. సీడీపీఓ, సూపర్‌వైజర్లకు ఆదేశాలు ఇస్తాం. మరింత నిఘా పెడతాం.

# వ్యవసాయానికి స్వస్తి.. పొట్టేళ్ల పెంపకంపై దృష్టి



గోరంట్ల వ్యవసాయానికి స్వస్తిపలికి పొట్టేళ్ల పెంపకంపై దృష్టి మళ్లించారు జిల్లాలోని దక్షిణాది మండలాలకు చెందిన యువ రైతులు. పంటలసాగుతో కష్టాలు, నష్టాలు చవిచూసి విసిగిపోయిన తరుణంలో సమాజంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా ప్రత్యామ్నాయంగా పొట్టేళ్లను పెంచుతున్నారు. కేవలం మూడు మాసాలు శ్రమిస్తే మంచి లాభాలు గడించవచ్చంటున్నారు.

**గోరంట్ల మండలంలోనే 150..**

శ్రీసత్యసాయి జిల్లాలో గోరంట్ల, చిలమత్తూరు, కొత్తచెరువు, ఓబుళదేవరచెరువు, బుక్కపట్నం మండలాల్లో పొట్టేళ్ల పెంపకం షెడ్లు విపరీతంగా కనిపిస్తున్నాయి. ఉన్నత చదువులు చదివి ఉద్యోగాలు రానివారు కూడా ఈరంగాన్ని ఎంచుకుంటున్నారు. ఈక్రమంలో గోరంట్ల మండలంలోనే 150 షెడ్లకు పైగా వెలిశాయి. సుమారు 20వేలు పొట్టేళ్లు పెంపకం జరుగుతోంది.

**అన్ని సౌకర్యాలతో ఏర్పాటు**

ఈ ప్రక్రియలో మొదట నిర్వాహకుడి ఆర్థిక సామర్థ్యాన్ని బట్టి షెడ్డును నిర్మించుకుంటారు. అనంతరం కర్ణాటకలోని బళ్లారి, సింధనూను ప్రాంతాల నుంచి పిల్లలను ఒక్కోటి రూ.7 వేల చొప్పున కొనుగోలు చేస్తున్నారు. ఇక్కడ కేవలం రెండు మూడు నెలల పాటు మేపి డిమాండ్‌ను బట్టి రూ.20 వేల వరకు విక్రయిస్తున్నారు. ప్రత్యక్ష, పరోక్షంగా గోరంట్ల మండలంలో వెయ్యి కుటుంబాలు ఈరంగం నుంచి ఉపాధి పొందుతున్నాయి. వీటిపెంపకంపై అనుభవం ఉన్న నెల్లూరు జిల్లా వాసులు ఉపాధి కోసం గోరంట్లకు వచ్చారు.

**రైతులకు గిట్టుబాటు..**

పొట్టేళ్లు అనతికాలంలోనే బలిష్టం కావడానికి స్థానికంగా లభిస్తున్న వేరుసెనగ పొట్టు, మొక్కజొన్న గింజలు ఆహారంగా వేస్తున్నారు. దీంతో ఈరెండు పంటలు సాగుచేస్తున్న రైతులకు మంచి గిట్టుబాటు ధర లభిస్తోంది. సీకేపల్లి మండలం నుంచి వేరుసెనగ పొట్టు తీసుకొస్తుండగా, మొక్కజొన్నలు ఈపరిధిలోనే లభిస్తున్నట్లు చెబుతున్నారు.

**రెండేళ్లుగా పెంచుతున్నాను** –శ్యాంసుందర్, ఎంఏ, బీఈడీ, కమ్మవారిపల్లి

గతంలో ఓ విద్యాసంస్థలో ప్రిన్సిపల్‌గా కొంతకాలం పనిచేశాను అయితే సంతృప్తినివ్వలేదు. గోరంట్లకు సమీపంలో సొంతస్థలం ఉండడంతో రూ.15లక్షలు వెచ్చించి శాశ్వతంగా షెడ్డు నిర్మించి రెండేళ్లుగా పెంచుతున్నాను. 300 పొట్టేళ్లు మూడు విడుతల్లో ఎంపికచేసి ప్రతినెలా 100 విక్రయించి.. కొత్తవాటిని తీసుకొస్తున్నా. శ్రమ అయినప్పటికీ గిట్టుబాటు ఉంటోంది. స్థానిక వ్యాపారులే కొనుగోలు చేస్తున్నారు.

## మా‘గోడ’ ఆలకించండయ్యా..!

చిత్తూరు: చిత్తూరు మండలం గువ్వకల్లు పంచాయతీలో ఇళ్లు లేని పేదలకు గత ప్రభుత్వం గుట్టలో ఇంటి స్థలాలు కేటాయించింది. సొంతింటి కల సాకారమవుతుందనే ఆశతో పేదలు వెంటనే ఇంటి నిర్మాణాలు చేపట్టారు. కాలనీ పక్కనే చిత్తూరు-తచ్చూరు రహదారి నిర్మాణం చేపట్టడంతో లబ్ధిదారులు ఎంతో సంతోషపడ్డారు. ఇంత వరకు బాగానే ఉన్నా.. వారి ఆశలపై హైవే అధికారులు నీళు చల్లారు. గ్రామానికి దారి లేకుండా ప్రమాదాల నివారణకు అధికారులు నిర్మించిన ప్రహరీ రాకపోకలకు ఇబ్బందిగా మారిందని వారు పేర్కొంటున్నారు. చిత్తూరు మండలం మీదుగా అనుపల్లె, బండపల్లె, గోపాలపురం, గొల్లపల్లె, ఎగుమాసాపల్లె, దిగుమాసాపల్లె, మత్తుకూరు, ఐనవేడు గ్రామాల గుండా చిత్తూరు-తచ్చూరు జాతీయ రహదారి



వెళ్తుంది. రహదారి వెంబడి ప్రహరీ నిర్మించడంతో సమీపంలోని పొలాలకు వెళ్లడానికి దారి లేక రైతులు ఇబ్బంది పడుతున్నారు. ఎక్కడో దూరంగా ఉండే అండర్‌పాస్‌ల దగ్గరికెళ్లి చుట్టూ తిరిగి రావడంతో అవస్థలు పడుతున్నామని వాపోతున్నారు. పైగా సర్వీసు రోడ్డు సైతం పూర్తి చేయకపోవడంతో మరింత ఇబ్బందిగా మారిందని ఆవేదన చెందుతున్నారు.

**అధికారులు స్పందించాలి**

చిత్తూరు-తచ్చూరు జాతీయ రహదారి భూసేకరణ ప్రక్రియలో పొలాలు, గ్రామాలకు ఇరువైపులా దారి సౌకర్యం కల్పిస్తామని అధికారులు హామీ ఇచ్చారు. కానీ ఈ హామీని అధికారులు పూర్తిగా విస్మరించారు. అధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి. విజయశేఖర్‌రెడ్డి, గువ్వకల్లు

## ఇలా ఉంటే.. పనులవుతాయా..?

చిత్తూరు : ఐదేళ్ల వైకాపా పాలనలో ఏపీఎస్పీడీసీఎల్ అవినీతి అక్రమాల్లో కూరుకుపోయింది. వైకాపాతో అంటకాగిన అధికారులు ఇష్టానుసారం రూ.కోట్లు మింగేశారు. కూటమి ప్రభుత్వం అధికార పగ్గాలు చేపట్టి 15 నెలలు కావస్తున్నా.. ఇంకా వైకాపాతో అంటకాగిన అధికారుల హవానే కొనసాగుతుండటం గమనార్హం. గతేడాది డిసెంబరు నుంచి ఉద్యోగుల ఉద్యోగోన్నతు(పదోన్నతుల)ల ప్రక్రియ ముందుకు సాగలేదు.. కూటమి ప్రభుత్వం దీనిపై దృష్టి సారించకపోవడంతో ఆ శాఖ ఉద్యోగుల్లో తీవ్ర అసంతృప్తి నెలకొంది.

**ఇదీ పరిస్థితి..** ఖాళీల కారణంగా పీఎం సూర్యఘర్, పీఎం కుసుమ్, ఆర్‌డీఎస్ఎస్ ప్రాజెక్టు పనులు ఏపీఎస్పీడీసీఎల్ పరిధిలోని ఐదు ఉమ్మడి చిత్తూరు, కడప, నెల్లూరు, అనంతపురం, కర్నూలు జిల్లాల్లో ముందుకు సాగడం లేదు. పోస్టుల ఖాళీలతో ప్రాజెక్టు పనుల పర్యవేక్షణ



పూర్తిగా కొరవడింది. పనుల్లో ఎదురవుతున్న సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించి.. ముందుకెళ్లడంలో సంస్థ విఫలమవుతోందనే ఆరోపణలున్నాయి. కీలకమైన పోస్టులు.. ఇన్‌ఛార్జులతో నెట్టుకొస్తుండటంతో ఆశించిన ప్రగతి లేదని ఆ శాఖ అధికారులే చెబుతున్నారు. విద్యుత్తు వినియోగదారులకు సత్వర మెరుగైన సేవలు కష్టతరంగా మారాయి. కొత్తగా ఉప-కేంద్రాలు, విద్యుత్తు లైన్లు ఏర్పాటు, పరిశ్రమలు, వ్యాపార సంస్థలకు సర్వీసుల జారీ సకాలంలో కావడం లేదు.

## కొరవడిన ‘చెత్త’శుద్ధి..!

రాజమహేంద్రవరం : జిల్లాలో పలు పట్టణాల్లో డెంగీ, మలేరియా, టైఫాయిడ్, డయేరియా వ్యాధులు విజృంభిస్తున్నాయి. ముఖ్యంగా పురపాలికల్లో పారిశుద్ధ్య లోపం, కాలువల్లో పూడికలు తొలగించకపోవడం, చెత్త నిల్వలతో దోమలు వ్యాప్తి చెంది, ప్రజారోగ్యం మంచం పడుతోంది. ఆయా పట్టణాల్లో అపరిశుభ్ర వాతావరణం ఉన్న ప్రాంతాలు గుర్తించేలా ప్రత్యేక సర్వే నిర్వహించి అపరిశుభ్ర ప్రాంతాలను (బ్లాక్ స్పాట్‌లు) గుర్తించారు. దీనికి సంబంధించి నివేదికను ప్రభుత్వానికి పంపారు. ఆయా ప్రాంతాల్లో తక్షణం పారిశుద్ధ్య చర్యలు తీసుకోనున్నారు.

**ఏయే అంశాలను పరిగణనలోకి తీసుకున్నారంటే**



జిల్లాలోని పురపాలికల్లో సచివాలయం వ్యవస్థ సర్వే నిర్వహించింది. దీని కోసం ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశారు. ఆయా డివిజన్ పరిధిలోని సచివాలయం సెక్రటరీతోపాటు పారిశుద్ధ్య విభాగం పర్యవేక్షక ఉద్యోగి, ఏఎన్‌ఎం, శానిటరీ ఇన్స్‌స్పెక్టరు కలిసి పరిశీలించా రు. పురవీధుల్లో పెద్ద ఎత్తున చెత్త పేరుకున్న ప్రాంతాలను బ్లాక్ స్పాట్‌లుగా నిర్ధారించారు. వీటితోపాటు కాలువల్లో పూడికలు తొలగించకపోవడం, మురుగునీరు రహదారిపై ప్రవహించడం, ఇళ్ల మధ్యలో ఖాళీ స్థలాల్లో చెత్త పేరుకుపోవడం వంటి వాటిని కూడా ప్రామాణికంగా తీసుకున్నారు. అత్యధికంగా రాజమహేంద్రవరంలో పెద్ద ఎత్తున చెత్త పేరుకుపోవడాన్ని గుర్తించారు. మరోవైపు మురుగు కాలువలు సైతం అధ్వానంగా ఉన్నాయి.

**యాప్‌లో సమాచారం పొందుపరుస్తూ..**

అపారిశుద్ధ్య ప్రాంతాల్లో దోమల నివారణకు ఫాగింగ్, స్ప్రేయింగ్ నిరంతరం జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని, కాలువల్లో పూడికలు తొలగించడానికి కార్యాచరణ చేపట్టాలని పురపాలికశాఖ యంత్రాంగా న్ని ఆదేశించింది. ప్రస్తుత పరిస్థితిని ఎప్పటికప్పుడు అంచనా వేస్తూ సమాచారాన్ని యాప్‌లో పొందుపర్చే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించింది.

## సారథి.. పట్టించుకుంటారా

కొవ్వూరు : దశాబ్దాల సేవలకు ప్రతిరూపం రోడ్‌కం రైలు వంతెన. గోదావరి అంటే ఠక్కున కళ్ల ముందు సాక్షాత్కరిస్తుంది ఈ అద్భుత సేతువు. ఈ ప్రాభవం క్రమంగా మసక బారుతోంది. బాగా పాడైతే.. ప్రజాగ్రహం తోడైతే అత్యవసరంగా, హఠాత్తుగా రాకపోకలను ఆపి రోడ్డు నిర్మాణం లేదా చిన్నపాటి మరమ్మతులు, రంగులు వేయడం తప్ప వంతెన పదికాలాలపాటు ఉండే కార్యాచరణకు నోచుకోవడం లేదు. 2023వ సంవత్సరం చివరిలో 45 రోజులపాటు రాకపోకలను నిలిపివేసి ర.భ.శాఖ ఆధ్వర్యంలో రూ.2.10 కోట్లతో వంతెన పొడవునా సెకండరీ జాయింట్ల మరమ్మతులు చేసి రహదారి నిర్మించారు. రూ.కోట్లు ఖర్చు చేసినా నిర్వహణపట్ల అటు అధికార యంత్రాంగం, ప్రజాప్రతినిధులు శ్రద్ధ చూపడం లేదనే విమర్శలు .

**శిథిలమై ఇలా..**



2.9 కిలోమీటర్ల పొడవున ఉన్న వంతెన హ్యాండ్ రెయిల్స్ శిథిలస్థితికి చేరాయి. సుమారు 1600 మీటర్ల పొడవున సిమెంటు రెయిలింగ్‌ను తొలగించి మైల్డ్‌స్టీల్ రెయిలింగ్ అమర్చారు. గోదావరి నుంచి పైకి రెయిలింగ్ వరకు చాలా చోట్ల రావి మొక్కలు పెరిగి గోడలను దెబ్బతీస్తున్నాయి. కొవ్వూరు వైపు వంతెన నడకమార్గం (ఫుట్‌పాత్)లో సిమెంటు రాళ్ల ధ్వంసమవుతున్నాయి. రావి, ఇతర పిచ్చి, గడ్డి మొక్కలు ఏపుగా పెరుగుతున్నాయి. రాళ్ల మధ్య దూరం పెరిగేలా మారి అటు రెయిలింగ్, నడక మార్గాలను దెబ్బతీసేలా తయారయ్యాయి.

ఓ మోస్తరు వర్షం కురిసినా వంతెనపైకి చేరిన నీరు, మట్టి, ఇతర వ్యర్థాలు నడక మార్గానికి చేర్చి ఉన్న జాలీల నుంచి కిందికి వెళ్లే పరిస్థితి లేదు. వంతెన పొడవునా 180 విద్యుద్దీపాలు పూర్తిగా వెలిగిన సందర్భాలు ఎప్పుడూ లేదు..

జిల్లా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి వంతెన ప్రాభవాన్ని కాపాడేలా చర్యలు తీసుకోవాలని.. రైల్వే, రభశా, సంబంధిత శాఖలను సమన్వయం చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

## పేదలకు గూళ్లు.. పెద్దలకే మేళ్లు

కాకినాడ : గత ప్రభుత్వంలో పేదల పేరుతో మంజూరు చేసిన ఇళ్లతో పెద్దలే బాగుపడ్డారు. ఆప్షన్-3 ఎంచుకున్న లబ్ధిదారులకు గృహాలను నిర్మించి ఇస్తామని నమ్మబలికి గుత్తేదారులకు దోచిపెట్టారు. జిల్లాలో 10 వేలకు పైగా ఇళ్ల నిర్మాణాలను అప్పగిస్తే పది శాతం మాత్రమే పూర్తిచేశారు. జిల్లాలో పీఎంఏవై అర్బన్, గ్రామీణ్ పథకాల్లో 84,934 ఇళ్లు మంజూరు చేశారు. వాటిలో 10,716 గుత్తేదారులకు అప్పగించారు. కేంద్ర ప్రభుత్వం అందించే రూ.1.80 లక్షలకు తోడు లబ్ధిదారులతో రూ.35 వేలు అదనంగా గుత్తేదారులకు అందజేశారు. ఒక్కో ఇంటిపై రూ.2.15 లక్షలు ఖర్చుచేసినా పూర్తిచేయడంలో విఫలమయ్యారు. సొంతంగా ఇల్లు కట్టినవారికి పునాదుల వరకు రూ.50 వేల బిల్లు చెల్లిస్తే, గుత్తేదారులకు రూ.70 వేలు బిల్లు ఇచ్చారు. బిల్లులు చేసుకుని మిగతా పనులు వదిలేసినవే ఎక్కువ.

**ఇష్టారీతిన కట్టబెట్టేశారు..**

జిల్లాలోని ఏడు ప్రాంతాల్లో ఇళ్ల నిర్మాణ బాధ్యత 13 గుత్తేదారు సంస్థలకు అప్పగించారు. కొన్నింటికి అనుభవం లేకపోయినా నేతల సిఫార్సులతో ఇచ్చేశారు. ః కొమరగిరిలో 8,795 ఇళ్ల నిర్మాణాలను అప్పగించారు. అందులో 4,400 ఓ సంస్థకు.. మిగతావాటిని పది సంస్థలకు కట్టబెట్టారు. ఓ సంస్థకు 236 ఇళ్ల బాధ్యతలు అప్పగిస్తే ఒక్కటీ పూర్తిచేయలేదు. మరో సంస్థకు 299 కేటాయిస్తే కేవలం 39 మాత్రమే పూర్తిచేశారు. ఇంకో సంస్థకు 550 ఇళ్ల నిర్మాణం అప్పజెప్పగా 490 ఇళ్లు ప్లింత్ బీమ్ దశలో ఉన్నాయి. ః సామర్లకోటలో 679 ఇళ్లకు 167 మాత్రమే పూర్తిచేశారు. పెద్దాపురంలో 591 ఇళ్లకు 137 పూర్తిచేశారు. 200 గూళ్లు పునాదులతో సరి. ః పండూరు లేఅవుట్‌లో 357 గృహాలకు 11 పూర్తయ్యాయి.

**నోటీసులు ఇచ్చినా..**

కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఇళ్ల నిర్మాణాలు పూర్తిచేయాలని గుత్తేదారులకు పలుమార్లు నోటీసులు ఇచ్చింది. ఒకరిద్దరు మాత్రమే స్పందించారు. కలెక్టర్ షాన్‌మోహన్ వద్ద ప్రస్తావించగా కొంతమందిని తప్పించి వేరేవారికి అప్పగించినట్లు చెప్పారు. ఆప్షన్-3 ఇళ్ల నిర్మాణాలన్నీ పూర్తయ్యేలా చూస్తామన్నారు.

## ఆశల వారధి.. దాటని తీరిది

సఖినేటిపల్లి : తీరప్రాంత ప్రజల చిరకాల కోరికైన సఖినేటిపల్లి-నరసాపురం వంతెన నిర్మాణం అందని ద్రాక్షలా మారింది. సుమారు ఏడు దశాబ్దాల నుంచి ప్రభుత్వాలు మారుతున్నా ఏవిధమైన కదలిక లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సఖినేటిపల్లి-నరసాపురం వశిష్ఠ గోదావరి రేవులోని పంటుపై ప్రతిరోజూ వేలాదిమంది రాకపోకలు సాగిస్తుంటారు. వరదల కారణంగా పంటు ఆగిపోతే ఇబ్బందులు పడాల్సిందే. 1960లో నీలం సంజీవరెడ్డి సీఎంగా ఉన్నప్పుడు అప్పటి ఎమ్మెల్యే అల్లూరి సత్యనారాయణరాజు ఇక్కడ వారధి నిర్మించాలని ప్రతిపాదనలు తెచ్చారు. 1985లో చేగొండి హరిరామ జోగయ్య, 2003లో మంత్రి కొత్తపల్లి సుబ్బారాయుడు ఫ్లోటింగ్ బ్రిడ్జికి భూమిపూజ చేశారు. 2008లో సీఎంగా రాజశేఖర్‌రెడ్డి రూ.192.40 కోట్లతో ప్రతిపాదనలు చేయగా రూ.67.50 కోట్ల అంచనాతో భూమిపూజ చేశారు. 2016లో ఎమ్మెల్యే మాధవనాయుడు పలువురు ఎమ్మెల్యేలను, ఎంపీలను తీసుకుని కేంద్రమంత్రి నితిన్‌గడ్కారీ వద్దకు వెళ్లి డీపీఆర్ మంజూరు చేయించారు. 2020లో సీఎం జగన్ హయాంలో రామేశ్వరం(సఖినేటిపల్లి)-రాజులంకకు(నరసాపురం) మార్చి రూ.450 కోట్లు మంజూరు చేశారు.

ఇటీవల కేంద్ర ప్రభుత్వం రూ.580 కోట్లు మంజూరు చేసింది. రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్‌తో చర్చించి వంతెన నిర్మాణానికి కృషి చేస్తున్నామని జాతీయ రహదారి నిర్మాణ సంస్థ(భీమవరం) డీఈ శ్రీనివాసరావు తెలిపారు. నిర్మిస్తే ప్రయోజనాలు కోనసీమ వాసులు నరసాపురం, మచిలీపట్నం, ఒంగోలు మీదుగా ప్రయాణం చేయడానికి, పశ్చిమగోదావరి వాసులు అమలాపురం, కాకినాడ వెళ్లడానికి సులువైన మార్గం.

రెండు జిల్లాల తీరప్రాంతాల్లో మత్స్యసంపదను చెన్నై, హౌరా వరకు తక్కువ సమయంలో తరలించొచ్చు. అంతర్వేది మినీ ఫిషింగ్ హార్బర్ అభివృద్ధి చెందుతుంది. ఆధ్యాత్మిక, పర్యాటక ప్రాంతాలు(అంతర్వేది, పేరుపాలెం) అభివృద్ధి వేగంగా జరిగి ఉపాధి అవకాశాలు పెరుగుతాయి.

చురకలు

గురువారం 9 అక్టోబర్ 2025

## నేషనల్ క్రష్ మొదటి టార్గెట్ అవుతుందే..?

కొన్నిసార్లు టైం బాగా లేకపోతే ఎలాంటి సంబంధం లేకపోయినా కొందరిని టార్గెట్ చేసినట్టు అవుతుంది. అంతా బాగుంటే ఏమి ఉండదు కానీ ఏదైనా తేడా వస్తేనే ఇలాంటివి జరుగుతుంటాయి. మొన్నటిదాకా సౌత్ నార్త్ అనే తేడా లేకుండా అదరగొడుతూ వచ్చి.. నేషనల్ క్రష్ గా ఆడియన్స్ చేత సూపర్ అనిపించుకున్న రష్మిక ఇప్పుడు తనకు ఏమాత్రం సంబంధం లేని విషయాలకు మొదటి టార్గెట్ అవుతుంది. కొన్నిసార్లు మాట్లాడితే తప్పు అవుతుందనుకున్న టైం లో మరికొన్నిసార్లు సైలెంట్ గా ఉన్నా కూడా మిస్టేక్ అవుతుంది.

**కన్నడ నటి రష్మిక కిరిక్ పార్టీతో..** నేషనల్ క్రష్ విషయంలో ప్రస్తుతం ఇలాంటి చర్చలే జరుగుతున్నాయి. కన్నడ నటి అయిన రష్మిక కిరిక్ పార్టీతో ఓవర్ నైట్ స్టార్ అవ్వగా ఛలోతో తెలుగు ఎంట్రీ ఇచ్చింది. ఆ సినిమా నుంచి ఇప్పుడు పాన్ ఇండియా స్టార్ గా సూపర్ ఫామ్ కొనసాగిస్తుంది. ఐతే లేటెస్ట్ గా రిషబ్ శెట్టి కాంతారా చాప్టర్ 1 సెన్సేషనల్ హిట్ అయ్యింది. ఆ సినిమా మీద రష్మిక మందన్న



స్పందించకపోవడంపై కన్నడ ఆడియన్స్ హర్ట్ అవుతున్నారు. ప్రతి కన్నడ సినిమాకు రష్మిక స్పందించాల్సిన అవసరం లేదు. కానీ కిరిక్ పార్టీ డైరెక్టర్ చేసింది రిషబ్ శెట్టి కాబట్టి అతని డైరెక్షన్ తో పాటు యాక్టింగ్ చేసి అదరగొట్టిన సినిమాపై రష్మిక రెస్పాండ్ అయితే బాగుంటుందని అంటున్నారు. ఐతే దీనిపై మరో వెర్షన్ రష్మికకు సపోర్ట్ చేస్తున్న వారు ఉన్నారు. రష్మిక ఆ సినిమా చూసి ఉండకపోవచ్చు. ప్రస్తుతం ఆమె కూడా వరుస ప్రాజెక్ట్ లతో బిజీగా ఉంది. అందుకే ఒకవేళ చూసే ఛాన్స్ రాకపోవచ్చని అంటున్నారు. రష్మిక మీద ఈమధ్య కాలంలో వచ్చిన ఫస్ట్ నెగిటివిటీ ఇదే. ఐతే అంతకుముందు రిషబ్ శెట్టి కూడా రష్మిక పేరు చెప్పకుండా మాట్లాడినందుకే రష్మిక ఇప్పుడు కాంతారా 1పై స్పందించడం లేదని అంటున్నారు.

**అనవసరమైన ఇష్యూస్ లో ఆమె..** ఈ వ్యవహారాలు అన్నీ కూడా రష్మిక ఇమేజ్ ని తగ్గించేవు కానీ అనవసరమైన ఇష్యూస్ లో ఆమెను పెడుతున్నట్టు ఉంటుంది. ఇక లేటెస్ట్ గా రష్మిక మందన్న, విజయ్ దేవరకొండ ఎంగేజ్మెంట్ జరిగింది. అఫీషియల్ గా ఇద్దరు చెప్పలేదు కానీ ఈ టైంలో రష్మికపై ఇలా కొన్ని పాజిటివ్, కొన్ని నెగిటివ్ వార్తలు రావడం కూడా ఆమెను కచ్చితంగా అప్సెట్ చేస్తాయని చెప్పొచ్చు. మొన్నటిదాకా ఆమెను ఆకాశాన్ని ఎత్తిన నెటిజన్లు ఇప్పుడు కాంతారా 1 విషయంపై రష్మికను కార్నర్ చేయడం మాత్రం కరెక్ట్ కాదని కొందరు అంటున్నారు. మరి ఈ ఇష్యూస్ గురించి రష్మిక ఏదైనా రెస్పాండ్ అవుతుందా అన్నది చూడాలి.

## అనుష్క నెక్ట్స్.. అది బెటర్ ఆప్షన్..!

స్వీటీ అనుష్క రీసెంట్ గా ఘాటి సినిమాతో ప్రేక్షకుల ముందుకు రాగా ఆ సినిమాతో ఆశించిన ఫలితాన్ని అందుకోలేదు. క్రిష్ డైరెక్షన్లో తెరకెక్కిన ఈ సినిమా కనీసం పర్ఫామెన్స్ కూడా సరిగా చేయకపోవడం వల్ల సినిమా డిజాస్టర్ అయ్యింది. సినిమా థియేట్రికల్ వెర్షన్ మాత్రమే కాదు ఓటీటీలో కూడా పెద్దగా ఇంపాక్ట్ చూపించలేదు. ఐతే అనుష్క ఘాటి స్పెషల్ ఫోన్ టాక్ లో భాగంగా రానాతో నెక్స్ట్ ఇయర్ నుంచి అసలు గ్యాప్ ఉండదని వరుస సినిమాలు చేస్తానని అన్నది. అనుష్క అలా చెప్పడం ఫ్యాన్స్ కి కాస్త ఉత్సాహాన్ని ఇచ్చింది.



**నిశ్శబ్దం తర్వాత అనుష్క గ్యాప్..** ఐతే ఘాటితో మరోసారి ఫీమేల్ సెంట్రిక్ సినిమా అటెంప్ట్ చేసింది అనుష్క ఇది కూడా అరుంధతి, భాగమతి, రుద్రమదేవి తరహాలో ఉంటుందని అనుకుంటే అది కాస్త మిస్ ఫైర్ అయ్యింది. నిశ్శబ్దం తర్వాత అనుష్క గ్యాప్ ఇచ్చి మరీ నవీన్ పొలిశెట్టితో మిస్ శెట్టి మిస్టర్ పొలిశెట్టి సినిమా చేసింది. ఆ సినిమా పర్వాలేదు అనిపించుకుంది. ఐతే ఆ తర్వాత ఘాటితో మరో సూపర్ హిట్ కొడుతుందని అనుకుంటే అది కాస్త డిజాస్టర్ అయ్యింది. అనుష్క నెక్స్ట్ సినిమా విషయంలో ఫ్యాన్స్ ఇలాంటి ప్రయోగాలు వద్దు కమర్షియల్ సినిమా చేస్తే చాలని అంటున్నారు. స్టార్ సినిమాలకు అనుష్క పర్ఫెక్ట్ ఆప్షన్ అవుతుంది. ఆమె స్టార్స్ తో నటిస్తే ఆ ప్రాజెక్ట్ కి స్పెషల్ క్రేజ్ వస్తుంది. అలా కాకుండా లేడీ ఓరియెంటెడ్ సినిమాలే చేస్తా అంటే మాత్రం కష్టమే అని చెప్పొచ్చు. ఫీమేల్ సెంట్రిక్ సినిమాలు ఆమెకు ఎంత పాపులారిటీ తెచ్చినా వాటికంటూ కొన్ని లిమిటేషన్స్ ఉంటాయి. అందుకే అనుష్క ఇమేజ్ కి తగినట్టుగా స్టార్ సినిమాలు చేస్తే ఆమెకు ప్లస్ అవుతుంది.

**సూపర్ సినిమాతో తెరంగేట్రం..** సూపర్ సినిమాతో తెరంగేట్రం చేసిన అనుష్క గ్లామర్ షోలో కూడా వెనక్కి తగ్గలేదు. ఇక ఫీమేల్ సెంట్రిక్ సినిమాలకు సెంటర్ ఆఫ్ ఎట్రాక్షన్ గా కొన్నాళ్లు కనిపించింది. ఐతే ఆ తర్వాత సైజ్ జీరో కోసం బాగా బరువు పెరిగి అది తగ్గించుకోవడం కోసం సినిమాలకు దూరమైంది. కెరీర్ పరంగా అనుష్క ప్లాన్స్ ఏంటన్నది అర్థం అవ్వక ఆడియన్స్ బాగా అప్సెట్ లో ఉన్నారు. అనుష్క కూడా మళ్లీ తిరిగి స్టార్ సినిమాలు చేస్తే మాత్రం ఫ్యాన్స్ కి పండగ అన్నట్టే లెక్క. ప్రస్తుతం అమ్మడు మలయాళంలో ఒక సినిమా చేస్తున్న అనుష్క తెలుగులో కూడా స్టార్ మూవీస్ కోసం ఎదురుచూస్తుంది. ఆమె చేయాలని అనుకోవాలో కానీ స్టార్ సినిమా ఛాన్స్ లు తప్పకుండా వస్తాయి.




## జనాలు లేక కరణ్ జోహార్ సినిమా విలవిల



బాలీవుడ్‌లో ధర్మ ప్రొడక్షన్స్ అంటేనే గ్రాండ్ మేకింగ్, భారీ క్యాస్టింగ్ హై బడ్జెట్ సినిమాలకు కేరాఫ్ అడ్రెస్. ఈ సంస్థ వెనుక ఉన్న స్టార్ ప్రొడ్యూసర్ కరణ్ జోహార్ ఎప్పుడూ వార్తల్లో ఉంటాడు. రీసెంట్‌గా రిలీజ్ చేసిన తన లేటెస్ట్ ఫిల్మ్, 'సన్నీ సంస్కారి కీ తులసి కుమారి'పై కూడా భారీ అంచనాలు పెట్టుకున్నాడు. అయితే, బాక్సాఫీస్ వద్ద ఈ సినిమాకు ఆశించినంత రెస్పాన్స్ రాలేదు. ఓపెనింగ్స్ డీసెంట్‌గా ఉన్నాయని మేకర్స్ ప్రచారం చేసినా, బాలీవుడ్ మీడియాలో మాత్రం షాకింగ్ విషయాలు వైరల్ అవుతున్నాయి. సినిమాకు వస్తున్న డల్ రెస్పాన్స్ చూసి, బాలీవుడ్ ట్రేడ్ పండితులు కూడా ఆశ్చర్యపోతున్నారట. అయితే, కలెక్షన్ల కంటే దారుణమైన విషయం ఏమిటంటే, థియేటర్లలో ఈ సినిమా ప్రదర్శనను నిలిపివేయాల్సిన పరిస్థితి వచ్చిందనేది ఇక్కడి హాట్ గాసిప్. మధ్యప్రదేశ్‌లో ఉన్న కొన్ని '%దీ%' క్లాస్ సెంటర్లలో పరిస్థితి మరీ దారుణంగా ఉందట. ఈ సినిమాకు ఆడియన్స్ రాకపోవడం వల్ల, మొదటి 4 రోజుల పాటు అన్ని షోలను క్యాన్సిల్ చేయాల్సి వచ్చిందని సమాచారం. అంతేకాదు, ఇప్పటికీ చాలా థియేటర్లలో ఈ సినిమా ప్రదర్శన మళ్లీ మొదలుపెట్టలేదు అనే న్యూస్ ఇండస్ట్రీ సర్కిల్స్‌లో గుప్పుమంటోంది. పెద్ద పెద్ద సిటీల్లోని మల్టీప్లెక్స్‌లలోనూ కలెక్షన్లు షాకింగ్‌గా డల్గా ఉన్నాయని చెబుతున్నారు. అయితే, ఈ డల్ రెస్పాన్స్‌ను కవర్ చేసుకోవడానికి, ధర్మ మూవీస్ నుంచి కొన్ని ప్రముఖ సినిమా హాళ్లకు డబ్బు అందిందని మరికొన్ని వార్తలు వైరల్ అవుతున్నాయి. అంటే, కార్పొరేట్ బుకింగ్ పేరుతో సినిమాను నడిపిస్తున్నారు తప్ప, నిజమైన ఆడియన్స్ రెస్పాన్స్ మాత్రం దారుణంగా ఉందని అంటున్నారు. ?ఈ విషయం ఇప్పుడు కరణ్ జోహార్‌ను టార్గెట్ చేస్తూ పెద్ద ఎత్తున ట్రోల్స్ దారితీసిందనే కథనాలు కూడా వస్తున్నాయి. అతను ఎప్పుడూ తన తండ్రి లెగసీ గురించి గొప్పగా చెబుతాడు. కానీ, ఇప్పుడు డబ్బులిచ్చి షోలు వేయించుకునే స్థాయికి వచ్చాడని కామెంట్స్ వస్తున్నాయి. ఆడియన్స్ లేక షోలు క్యాన్సిల్ అవ్వడం ఏ రకమైన లెగసీ అని బాలీవుడ్‌లో నెటిజన్స్ చర్చించుకుంటున్నారు. ?మొత్తానికి, 'సన్నీ సంస్కారి కీ తులసి కుమారి' ఇప్పుడు కరణ్ జోహార్ కెరీర్‌లోనే పెద్ద డిజాస్టర్‌గా నిలిచే అవకాశం కనిపిస్తోంది. అలాగే నెపో కిడ్స్ ను ప్రమోట్ చేస్తాడనే టాక్ కూడా ఉండడంతో ఓ వర్గం జనాలు ఈ విషయాన్ని మరింత హైలెట్ చేస్తున్నారు. ఇక ఇలాంటి కామెంట్స్ ఎన్ని వచ్చినా కరణ్ పెద్దగా పట్టించుకున్నది లేదు. కానీ సినిమా కంటెంట్ విషయంలో ఆయన పట్టు తప్పుతున్నట్లు కనిపిస్తుంది. మరి రాబోయే సినిమాలతో ఎలాంటి రిజల్ట్ ను అందుకుంటాడో చూడాలి.

## పవన్ ఫ్యాన్స్ కి శుభవార్త.. త్వరలో కిక్ ఇచ్చే న్యూస్!



సీనియర్ ఎన్టీఆర్ కాలం నుంచే సినిమాలలో గుర్తింపు తెచ్చుకున్న ఎంతోమంది సెలబ్రిటీలు.. రాజకీయాలలోకి కూడా అడుగుపెట్టి చక్రం తిప్పుతున్న విషయం తెలిసిందే. అయితే అలా వచ్చిన సినిమా సెలబ్రిటీలంతా రాజకీయాలలో సక్సెస్ అయ్యారా అంటే? చెప్పలేని పరిస్థితి. అటు రాజకీయాలలో సక్సెస్ కాలేక మళ్ళీ సినిమాలు చేసుకుంటూ కెరీర్ ను కొనసాగిస్తున్న సెలబ్రిటీలు కూడా ఉన్నారు. ఇక్కడ ఒక హీరో మాత్రం ఒకప్పుడు స్టార్ హీరోగా పేరు సొంతం చేసుకొని.. ఇప్పుడు రాజకీయాలలో అధికారాన్ని చేపట్టి.. ఒకవైపు అధికారం.. మరొకవైపు అభిమానులను అలరించడానికి సినిమాలు చేస్తూ దూసుకుపోతున్నారు. ఆయన ఎవరో కాదు పవర్ స్టార్ పవన్ కళ్యాణ్. గత పది సంవత్సరాలుగా రాజకీయాలతోనే సావాసం చేస్తున్న పవన్ కళ్యాణ్.. ఎట్టకేలకు 2024 సార్వత్రిక ఎన్నికలలో పిఠాపురం నుంచి పోటీ చేసి భారీ ఘన విజయాన్ని సొంతం చేసుకున్నారు. ముఖ్యంగా కూటమి ప్రభుత్వం ఏర్పడడంలో కీలక పాత్ర పోషించిన పవన్ కళ్యాణ్ ఆంధ్రప్రదేశ్ కి ఉప ముఖ్యమంత్రిగా కూడా బాధ్యతలు చేపట్టారు. ఒకవైపు అధికారంలో ఉన్నా.. మరొకవైపు అభిమానులను అలరించడానికి వరుస సినిమాలు చేస్తూ బిజీగా మారిపోయారు. అందులో భాగంగానే 'హరిహర వీరమల్లు' సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చిన పవన్ కళ్యాణ్.. ఇప్పుడు సెప్టెంబర్ 25న సుజీత్ దర్శకత్వంలో 'ఓ.జీ' సినిమా చేసి ప్రేక్షకులను పలకరించారు. ఇప్పుడు హరీష్ శంకర్ దర్శకత్వంలో 'ఉస్తాద్ భగత్ సింగ్' సినిమా చేస్తున్న విషయం తెలిసిందే. ఇదివరకే వీరిద్దరి కాంబినేషన్లో 'గబ్బర్ సింగ్' సినిమా వచ్చి మంచి విజయాన్ని అందుకుంది.. ఇప్పుడు మళ్లీ అదే కాంబినేషన్ రిపీట్ అవడంతో ఆ మ్యాజిక్ మళ్ళీ రిపీట్ చేయాలని అభిమానులు కూడా కోరుకుంటున్నారు. శ్రీ లీల హీరోయిన్ గా.. రాశిఖన్నా కీలక పాత్ర పోషిస్తున్న ఈ సినిమా వచ్చే యేడాది ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలోనే తాజాగా ఈ సినిమా విడుదల తేదీకి సంబంధించిన ఒక క్రేజీ న్యూస్ నెట్టింట హల్చల్ చేస్తోంది. తాజాగా అందుతున్న సమాచారం ప్రకారం.. ఈ సినిమాను వచ్చే ఏడాది సమ్మర్ స్పెషల్ గా విడుదల చేయాలని మేకర్స్ భావిస్తున్నారట. అంతేకాదు ఈ నెల ఆఖరిలో దీపావళి సందర్భంగా దీనిపై అనౌన్స్మెంట్ ఇచ్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ కూడా కంప్లీట్ అవ్వగా.. పోస్ట్ ప్రొడక్షన్ స్టేజ్ లో ఉంది. దేవి శ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రానికి మైత్రి మూవీ మేకర్స్ నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారు..

ఇకపోతే పవన్ కళ్యాణ్ నుంచి వచ్చిన హరిహర వీరమల్లు, ఓజీ సినిమాలు బ్లాక్ బాస్టర్ రేంజ్ లో సక్సెస్ కాలేదు. దీంతో అభిమానులు ఈ చిత్రంపై ఆశలు పెంచుకున్నారు. మరి గబ్బర్ సింగ్ కాంబో రిపీట్ కాబోతున్న నేపథ్యంలో ఈ సినిమా ఎలాంటి రికార్డ్స్ క్రియేట్ చేస్తుందో చూడాలి. మరోవైపు హరిహర వీరమల్లు 2, ఓజీ 2 చిత్రాలు కూడా ప్రకటించారు. మరి ఈ సినిమాల షూటింగ్స్ ఎప్పుడు ప్రారంభిస్తారో చూడాలి.

## మరో ట్రెండీ అవుట్ ఫిట్ లో దర్శనమిచ్చిన జాన్వీకపూర్!

ప్రస్తుతం పారిస్ లో ఫ్యాషన్ వీక్ ఫెస్టివల్ ఘనంగా జరుగుతున్న విషయం తెలిసిందే. ముఖ్యంగా సెలబ్రిటీలు ఒకరి తరువాత ఒకరు భిన్న విభిన్నమైన దుస్తులతో ఫ్యాషన్ ప్రియులను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తున్నారు. టాలీవుడ్, బాలీవుడ్ అని తేడా లేకుండా ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ ఉపయోగించుకుంటున్నారు. అటు ఫ్యాషన్ డిజైనర్స్ కూడా అద్భుతమైన దుస్తులను డిజైన్ చేసి.. సెలబ్రిటీల ద్వారా భారీ పాపులారిటీ సొంతం చేసుకుంటున్నారు. ఈ క్రమంలోనే బాలీవుడ్ బ్యూటీగా పేరు సొంతం చేసుకున్న జాన్వీ కపూర్ గత కొన్ని రోజులుగా వినూత్నమైన వస్త్రాలతో అందరినీ ఆకట్టుకుంటున్న విషయం తెలిసిందే. ఈమెతో పాటు ఈమె దుస్తులను డిజైన్ చేసిన ఫ్యాషన్ డిజైనర్స్ కూడా ఇప్పుడు వెలుగులోకి వస్తున్నారు. అందులో భాగంగానే తాజాగా మరోసారి ఫ్యాషన్ వీక్ ఫెస్టివల్ లో మెరిసిన జాన్వీ కపూర్.. అందులో తన అద్భుతమైన డ్రెస్ తో అందరి దృష్టిని ఆకట్టుకుంది.. తాజాగా రియా కపూర్ తో కలిసి పారిస్ ఫ్యాషన్ వీక్ లో సందడి చేసింది జాన్వీ కపూర్. ఈ ఫ్యాషన్ వీక్ లో ప్రముఖ



ఫ్రెంచ్ ఫ్యాషన్ డిజైనర్ ఇమ్మానుయేల్ ఉంగరో పారలెల్ డిజైన్ చేసిన అద్భుతమైన దుస్తులను ధరించి తమ ఫ్యాషన్ సెన్స్ ను ప్రదర్శించారు. ఫుల్ స్లీవ్ కలిగిన బ్లాక్ అండ్ వైట్ మినీ డ్రెస్ ధరించిన ఈ ముద్దుగుమ్మలు ఇద్దరూ కూడా తమ అద్భుతమైన ప్రదర్శనతో ఫ్యాషన్ వీక్ లో స్పెషల్ అట్రాక్షన్ గా నిలిచారు అని చెప్పవచ్చు. ముఖ్యంగా జాన్వీ కపూర్ జుట్టును ముడిపెట్టి, %ఖీఔ%1987 బ్యాగును ధరించి మరింత స్టైలిష్ గా కనిపించింది.ప్రస్తుతం వింటేజ్ లుక్ లో కనిపిస్తూ అందరి హృదయాలను దోచుకుంది ఈ ముద్దుగుమ్మ. జాన్వీ కపూర్ సినిమాల విషయానికి వస్తే.. బాలీవుడ్లో వరుస సినిమాలు చేస్తూ ప్రేక్షకులను అలరించిన ఈమె.. ఈ మధ్యకాలంలో కథల ఎంపిక విషయంలో తడబడుతోందేమో అనే అనుమానాలు కూడా వ్యక్తమవుతున్నాయి. ఈమధ్య వరుసగా పరమ్ సుందరి, హొమ్ బౌండ్, సన్నీ సంస్కారికీ తులసీ కుమారి అంటూ వరుసగా మూడు చిత్రాలలో నటించింది. కానీ మూడు కూడా డిజాస్టర్ గా నిలిచాయి. అలా హ్యాట్రిక్ ఫ్లాప్ ను సొంతం చేసుకుంది ఈ ముద్దుగుమ్మ. మరొకవైపు తెలుగులో దేవర సినిమాతో తెలుగు ప్రేక్షకులను పలకరించిన జాన్వీ కపూర్.. ఇప్పుడు రామ్ చరణ్, బుచ్చిబాబు సనా కాంబినేషన్లో వస్తున్న పెద్ది సినిమాలో హీరోయిన్గా నటిస్తోంది.

## గ్లామర్ తో కట్టిపడేస్తున్న ప్రియా ప్రకాష్ వారియర్..!

ఒక్క షాట్ తో ఓవర్ నైట్ లోనే స్టార్ సెలబ్రిటీ అయిపోయింది ప్రియా ప్రకాష్ వారియర్.. కన్నుగీటుతూ కుర్రకారు హృదయాలపై బాణాలు సంధించింది. ఒక్క మాటలో చెప్పాలి అంటే కుర్రకారుకు నేషనల్ క్రష్ అయిపోయింది అనడంలో సందేహం లేదు. అంతలా భారీ పాపులారిటీ సంపాదించుకున్న ప్రియా ప్రకాష్ వారియర్ హీరోయిన్గా నిలదొక్కుకోవడంలో కాస్త వెనకడుగు వేస్తోందనే చెప్పాలి. ముఖ్యంగా కథల ఎంపిక విషయంలో కూడా ఆచితూచి అడుగులు వేస్తున్నట్లు తెలుస్తోంది . అందులో భాగంగానే ఇప్పుడు సోషల్ మీడియాలో యాక్టివ్ గా ఉంటూ ఫాలోవర్స్ ను పెంచుకునే ప్రయత్నం చేస్తోంది ఈ ముద్దుగుమ్మ. ఇప్పుడు సోషల్ మీడియాలో నిత్యం ఆక్టివ్ గా ఉంటూ గ్లామర్ వలకబోస్తూ ఫాలోవర్స్ ను ఆకట్టుకున్న ఈ చిన్నది .. అందులో భాగంగానే తాజాగా గ్రీన్ కలర్ చుడీదార్ ధరించింది. ఇందులో ఈమె తన ఎద అందాలను హైలెట్ చేస్తూ హాట్ ప్రదర్శన ఇచ్చింది. ఆ మెడను ఫుల్ ఫిల్ చేయడానికి ప్రత్యేకంగా డైమండ్స్ తో డిజైన్ చేసిన స్టెప్స్ హారాన్ని ధరించింది. ముఖ్యంగా ఈ హారం ఈమె అందాన్ని మరింత హైలెట్ చేస్తోందని చెప్పవచ్చు. మొత్తానికి అయితే



ప్రియా ప్రకాష్ వారియర్ షేర్ చేసిన ఈ ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ అవ్వగా.. ముఖ్యంగా ఆమె కళ్ళకు అభిమానులు ఫిదా అవుతున్నారు. కాటుక కళ్ళతో మళ్లీ మాయ చేస్తోంది ఈ చిన్నది అంటూ ఇంస్టాగ్రామ్ వేదికగా కామెంట్ సెక్షన్ నింపేస్తున్నారు. ఏది ఏమైనా ప్రియా ప్రకాష్ వారియర్ షేర్ చేసిన ఈ ఫోటోలు ఇప్పుడు సోషల్ మీడియాలో తెగ వైరల్ గా మారుతున్నాయని చెప్పవచ్చు. ప్రియా ప్రకాష్ వారియర్ విషయానికి వస్తే.. 1999 అక్టోబర్ 28న కేరళ పుంకున్నంలో జన్మించింది. ఈమె తండ్రి కేంద్ర ఎక్సైజ్ శాఖ ఉద్యోగి ప్రకాష్ వారియర్, తల్లి గృహిణి. త్రిసూర్ లోని సందీప్ విద్యానికేతన్ లో పాఠశాల విద్యను పూర్తి చేసిన ఈమె.. 2018లో త్రిసూర్ లోని విమల కళాశాలలో బ్యాచిలర్ ఆఫ్ కామర్స్ కోర్సులో చేరింది. 2019లో వచ్చిన మలయాళ చిత్రం 'ఒరు ఆధార్ లవ్' అనే సినిమా ద్వారా ఇండస్ట్రీకి పరిచయమైన ప్రియా ప్రకాష్ వారియర్.. అందులో కన్ను గీటి ఓవర్ నైట్ లోనే వైరల్ అయిపోయింది.. అంతేకాదు 2018లో ఇండియాలో గూగుల్ ద్వారా అత్యధికంగా సెర్చ్ చేయబడిన నటిగా కూడా పేరు సొంతం చేసుకుంది. ఈమె తమిళ్ యాక్షన్ కామెడీ చిత్రమైన గుడ్ బ్యాడ్ అగ్లీలో కూడా నటించింది. 2021లో వచ్చిన తెలుగు చిత్రం చెక్ ద్వారా తెలుగు సినిమా తెరకు పరిచయమైన ఈమె ఇందులో నితిన్, రకుల్ ప్రీత్ సింగ్ హీరో హీరోయిన్ గా నటించగా.. తేనె పట్టుకొనే అమ్మాయి పాత్రలో నటించింది. అలాగే ఈ ఏడాది విష్ణుప్రియ అనే కన్నడ సినిమాలో కూడా నటించింది. ప్రస్తుతం ఈమె చేతిలో మరో 2, 3 చిత్రాలు ఉన్నట్లు సమాచారం.

PRINTED, PUBLISHED AND OWNED BY MOHAMMED IMRAN, PRINTED AT RIMSHA PRINTERS & WEB OFFSET PRINTING PRESS, Alugunur (V), Timmapur(M), DIST. KARIMNAGAR. TELANGANA.
PUBLISHED FROM H.NO. 10-2-324/B, VIDHYANAGAR, KARIMNAGAR - 505001. EDITOR : MOHAMMED IMRAN, RNI. NO. TELTEL/2006/16536